PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 43 సంచిక : 106 | విజయవాడ, శుక్రవారం 17 నవంబర్ 2023 | 6 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Friday 17 November 2023 | Rs

మోడీ ప్రభుత్వాన్ని సాగనంపాలి

- విద్రోహదినం కార్యక్రమంలో పెన్షనర్లు

3

తీవ్ర వాయుగుండంగా అల్పపీడనం

ప్రజాశక్తి- గ్రేటర్ విశాఖ బ్యూరో

పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం మరింత బలపడి గురువారానికి తీవ్ర వాయుగుండంగా మారింది. ఇది వాయవ్య దిశగా కదులుతోంది. ఈ ప్రభావంతో ఉత్తర కోస్తాంధ్రప్రదేశ్, యానాంల్లో రాబోవు రెండు రోజుల వరకూ తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు ఒకటి లేదా రెండు చోట్ల కురిసే అవకాశం ఉంది. దక్షిణ కోస్తాంధ్రప్రదేశ్‌లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు ఒకటి లేదా పలు చోట్ల కురిసే అవకాశం ఉంది. రాయలసీమలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పలుచోట్ల కురవనున్నాయి. తీవ్ర వాయుగుండం ఉత్తర ఈశాన్య దిశగా కదులుతూ తదుపరి 24 గంటలలో తుపాను తీవ్రతరం అయ్యే అవకాశం ఉంది. బంగ్లాదేశ్ తీరంలోని మోంగ్లా, ఖెపుపరా మధ్య గంటకు 55 నుంచి 65 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తున్నాయి. గరిష్ఠంగా 75 కిలోమీటర్ల వేగంతో ఈ నెల 18 తెల్లవారుజామున తీరాన్ని దాటనుందని అధికారులు అంచనా వేశారు. రెండు రోజులపాటు సముద్రంలోకి వేటకు వెళ్లవద్దని ఆదేశాలు జారీ చేశారు.



శంకరయ్య సంతాప సభలో ప్రసంగిస్తున్న ఏచూరి, వేదికపై ప్రకాశ్ కరత్, వైకో తదితరులు

శంకరయ్యకు కన్నీటి వీడ్కోలు

- అంతిమ యాత్రలో అశేష జనవాహిని
- ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు
- సీతారాం ఏచూరి, ప్రకాశ్ కరత్ తదితరులు హాజరు

ప్రజాశక్తి-చెన్నై

శతాబ్ది పోరాట యోధుడు, విప్లవ సూరీడు ఎన్ శంకరయ్యకు అశ్రునయనాలతో అంతిమ వీడ్కోలు పలికారు. ప్రజల సందర్శనార్థం టి నగర్‌లోని పి రామ్మూర్తి స్మారక చిహ్నం వద్ద వుంచిన ఆయన భౌతిక కాయాన్ని దర్శించుకునేందుకు గురువారం పెద్ద సంఖ్యలో జనం తరలివచ్చారు. వీరిలో చిన్నారుల నుంచి వృద్ధుల వరకు అన్ని వయసులవారు ఉన్నారు. తమ ప్రియతమ నేతను కడసారి చూసేందుకు రాష్ట్ర నలుమూలల నుంచి ప్రజలు, కార్యకర్తలు తండోపతండాలుగా రావడంతో టి నగర్, ఆ పరిసర ప్రాంతాలు జనం రద్దీతో కిటకిటలాడాయి. కొందరు దు:ఖాన్ని ఆపుకోలేక కన్నీరుమున్నీరయ్యారు. అనంతరం బసంత్‌నగర్‌లోని శ్మశాన వాటిక వరకు ఆయన అంతిమయాత్ర జన ప్రవాహంలా సాగింది. పార్టీ అగ్ర నాయకులు సీతారాం ఏచూరి, ప్రకాశ్ కరత్, కేంద్ర మాజీ మంత్రి, డిఎంకె ఎంపి ఎ రాజా, సిపిఎం రాష్ట్ర నాయకులు అగ్రభాగాన నిలిచారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానుల సమక్షంలో మధ్యాహ్నం 1.30 గంటలకు ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. ఆ ప్రజానాయకుని మృతికి గౌరవ సూచకంగా, పోలీసులు ఆరు తుపాకులతో పది రౌండ్లు గాలిలో పేల్చారు.

ఆయనకు నివాళులర్పించినవారిలో సిపిఎం తమిళనాడు రాష్ట్ర నాయకులు రామకృష్ణన్, సిపిఎం కేరళ రాష్ట్ర కార్యదర్శి ఎంవి గోవిందన్, అఖిల భారత కిసాన్ సభ అధ్యక్షులు అశోక్ ధావలే, ఐద్వా అధ్యక్షులు పికె శ్రీమతి, సిపిఎం కేరళ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పికె బిజు, డివైఎఫ్ఐ అఖిల భారత అధ్యక్షులు ఎఎ రహీమ్, సినీ నటులు పార్తీపన్, సత్యరాజ్, సినీనటి రోహిణి తదితరులు ఉన్నారు. బసంత్ నగర్ శ్మశానవాటిక వద్ద ఏర్పాటు చేసిన శంకరయ్య సంతాప సభలో సీతారాం ఏచూరి, ప్రకాశ్ కరత్, అశోక్ ధావలేతో పాటు డిఎంకె ఆర్గనైజింగ్ సెక్రటరీ ఆర్ఎస్ భారతి, పెరియార్ సంఘం నేత కె వీరమణి, సిపిఐ సహాయ కార్యదర్శి పెరియార్ స్వామి, సీనియర్ జర్నలిస్టు ఎన్ రామ్, ఎండిఎంకె ఎంపి వైకో, విసికె ఎంపి తిరుమవలవన్ తదితరులు పాల్గొన్నారు. ప్రజా ఉద్యమాలను నిర్మించడంలో శంకరయ్య నిర్వహించిన పాత్రను వారు గుర్తు చేసుకున్నారు. స్వాతంత్ర్య పోరాటం నుంచి, కమ్యూనిస్టు ఉద్యమం, కుల వ్యతిరేక, అంటరానితనం వ్యతిరేక పోరాటాలు, సంస్కరణోద్యమాలు గురించి వివరించారు. తమిళనాడు అభ్యుదయ ఉద్యమంలో ఎన్ శంకరయ్య పాత్రను గుర్తు చేసుకున్నారు.

తీరు మారని తమిళనాడు గవర్నర్

- పది బిల్లులు వెనక్కి పంపిన రాజ్ భవన్
- మళ్లీ ఆమోదానికి 18న ప్రత్యేక అసెంబ్లీ

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

బిల్లులను నిరవధికంగా తొక్కిపట్టే అధికారం గవర్నర్లకు లేదని దేశ అత్యున్నత న్యాయస్థానం తీవ్రంగా మందలించిన వారం రోజులకు తమిళనాడు గవర్నర్ పది బిల్లులను తిప్పి పంపారు. బిల్లులను క్లియర్ చేయడంలో గవర్నర్ల అసాధారణ జాప్యంపై కేరళ, పంజాబ్, తమిళనాడు రాష్ట్ర ప్రభుత్వాలు వేసిన పిటిషన్లను విచారించిన సుప్రీంకోర్టు గవర్నర్లు ప్రజలచే ఎన్నుకోబడిన ప్రతినిధులు కారనే విషయం గుర్తుంచుకోవాలని, చట్ట సభలు ఆమోదించిన బిల్లులు చట్ట రూపం దాల్చకుండా నిలిపివేసే అధికారం గవర్నర్‌కు లేదని స్పష్టం చేసింది.

బిల్లులను గవర్నరు వాపస్ చేసిన కొద్ది సేపటికే తమిళనాడు అసెంబ్లీ స్పీకర్ ఎం. అప్పావు ఈ నెల 18న ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో బిల్లులను మళ్లీ పరిశీలించి ఆమోదించాక గవర్నర్‌కు తిరిగి పంపుతారు. అప్పుడు వాటిని గవర్నరు తప్పనిసరిగా ఆమోదించాల్సి ఉంటుంది.

ఉద్దేశపూర్వకంగా బిల్లుల ఆమోదంలో జాప్యం

పెండింగ్‌లో ఉన్న బిల్లులలో ఒకటి ప్రభుత్వ ఆధ్వర్యంలో నడిచే విశ్వవిద్యాలయాలకు వైస్ ఛాన్సలర్ల నియామక పద్ధతులకు సంబంధించినది. రెండవది అన్నాడిఎంకె ప్రభుత్వంలోని మాజీ మంత్రుల ప్రాసిక్యూషన్‌కు సంబంధించిన బిల్లు. గవర్నర్ రవి ఇంతకుముందు నీట్ మినహాయింపు బిల్లును చాలా కాలం పాటు నాన్చి వెనక్కి పంపారు. అసెంబ్లీ మళ్లీ బిల్లును ఆమోదించిన తరువాత మాత్రమే దానిని రాష్ట్రపతికి పంపారు. ఆన్‌లైన్ గేమింగ్‌పై నిషేధం కోరుతూ వచ్చిన బిల్లును కూడా ఇలాగే తొక్కిపట్టారు.

నిర్భాగ్యులపై వాత్సల్య మేదీ?

- విడుదల కాని కేంద్రం వాటా
- అనాధ పిల్లల అగచాట్లు



ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి

నిర్భాగ్యులపై కేంద్ర ప్రభుత్వం కనికరం లేకుండా వ్యవహరిస్తోంది. తాను ఇవ్వాల్సిన వాటా నిధులు ఇవ్వకుండా తీవ్ర నిర్లక్ష్యంగా వ్యహరిస్తోంది. దీంతో, మిషన్ వాత్సల్య పథకం అనాధ పిల్లలకు అందడం లేదు. తల్లినిగాని, తండ్రినిగాని, ఆ ఇద్దరనీగాని కోల్పోయిన పిల్లల విద్య, వైద్య అవసరాలకు ఆర్థిక సాయం అందించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి ఈ పథకాన్ని అమలు చేయాలని నిర్ణయించాయి. 18 సంవత్సరాలు నిండే వరకు అనాధ పిల్లల చదువు కోసం నెలకు రూ.నాలుగు వేల చొప్పున సాయం అందజేయాలనేది ఈ పథకం ఉద్దేశం. ఇందులో రాష్ట్రం వాటా 40 శాతం కాగా, కేంద్రం వాటా 60 శాతం. కేంద్ర ప్రభుత్వం రూ.2,400, రాష్ట్ర ప్రభుత్వం రూ.1,600 కలిపి మొత్తం నాలుగు వేల రూపాయలను అనాధ పిల్లలకు అందించాలి. ఈ పథకం కోసం ఈ ఏడాది ఫిబ్రవరి నుంచి ఏప్రిల్ 30వ తేదీ వరకు గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా దరఖాస్తులను స్వీకరించారు. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 1.50 లక్షల దరఖాస్తులు వచ్చినట్లు తెలుస్తోంది. ఆరు నెలలు గడుస్తున్నా దరఖాస్తుదారులకు డబ్బులు అందడం లేదు.

కేంద్రం మెలిక

మిషన్ వాత్సల్య పథకాన్ని కేంద్ర ప్రభుత్వం 2011 నుంచి అమలు చేస్తోంది. హెచ్ఐవి లేదా ఎయిడ్స్ బాధిత పిల్లలు, వీధి బాలలు, తప్పిపోయిన, ఇంట్లో నుంచి పారిపోయిన బాలలు, బాలకార్మికులు తదితర కేటగిరి పిల్లలకు మాత్రమే రూ.నాలుగు వేలు సాయం అందిస్తూ వస్తోంది. ఇందులో తల్లిదండ్రులను కోల్పోయిన పిల్లలకు ఎటువంటి ప్రాధాన్యమూ ఇవ్వలేదు. తల్లినిగాని, తండ్రినిగాని, లేదా ఆ ఇద్దరినిగానీ కోల్పోయిన వారికి సాయం అందించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించి కేంద్ర ప్రభుత్వంతో సంప్రదించింది. కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించి 60 శాతం వాటా భరిస్తానని చెప్పినా ఆర్థిక సాయం దగ్గరకొచ్చేసరికి ముఖం చాటేస్తోంది. కేంద్ర ప్రభుత్వం తన వాటా నిధులు విడుదల చేయకపోవడంతో పథకం అమలుకు నోచుకోలేదు. కేంద్రం ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి ఈ పథకం అమలయ్యేలా చూడాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉంది. కేంద్ర ప్రభుత్వం మాత్రం ఎప్పటిమాదిరిగానే 'మిషన్ వాత్సల్య' కింద సాయం అందిస్తున్నా, అందులోనూ మెలిక పెట్టింది. కేంద్ర ప్రభుత్వం గతంలో పేర్కొన్న కేటగిరీ పిల్లలను తగ్గించి, కరోనా కాలంలో తల్లినిగాని, తండ్రినిగాని, లేదా ఆ ఇద్దరినీగాని కోల్పోయిన వారికే 90 శాతం మేర ప్రాధాన్యం కల్పించింది. జిల్లాకు 700 నుంచి 900 లక్ష్యాన్ని నిర్ణయించింది. కరోనా వల్ల పైనపేర్కొన్న కుటుంబసభ్యులను కోల్పోయిన పిల్లలకు సాయమందిస్తోంది. మిగిలిన అనాధ పిల్లల గురించి పట్టించుకోవడం లేదు.

అమ్మా, నాన్న ఇద్దరూ చనిపోయారు



మా అమ్మ భాగ్యలక్ష్మి, నాన్న జగదీష్ ఇద్దరూ చనిపోయారు. నన్ను మా తాతయ్య, నాన్నమ్మ ఉంటున్న సంతవురిటి గ్రామానికి తీసుకొచ్చి చదివిస్తున్నారు. మా తాతయ్య వ్యవసాయం చేస్తున్నారు. వలంటీరు వచ్చి అన్ని వివరాలూ తీసుకున్నారు. డబ్బులు వస్తే మా తాతయ్య వాళ్లకు కొంతసాయంగా ఉంటుంది.

– సిహెచ్.ప్రవల్లిక, సంతవురిటి గ్రామం

ఇల్లు గడవడం కష్టంగా ఉంది



నా భర్త చనిపోవడంతో కూలి పనులు చేసుకుంటూ ఇద్దరు పిల్లలను చదివిస్తున్నాను. పాప ఐదో తరగతి, బాబు రెండో తరగతి చదువుతున్నారు. వ్యవసాయ పనులకు వెళ్తేనే పూట గడుస్తోంది. ఆర్థికంగా చాలా ఇబ్బంది పడుతున్నాను. వలంటీర్లు వచ్చి ఆధార్ కార్డు, ఫొటోలు కావాలంటే ఇచ్చాను. డబ్బులు వస్తాయని చెప్పారు. ఇప్పటివరకు ఏమీ రాలేదు.

– బి.మంగమ్మ, కాఖండ్యాం గ్రామం

జిఓలు అప్‌లోడ్ చేయండి

- అన్ని శాఖలకూ జిఎడి ఆదేశం

ప్రజాశక్తి – అమరావతి బ్యూరో

అన్ని శాఖలూ జిఓలను ఎపి గెజిట్ వెబ్‌సైట్లో కచ్చితంగా అప్‌లోడ్ చేయాలని, 2022 ఏప్రిల్ ఒకటి నుండి ఇప్పటి వరకూ ఇచ్చిన జిఓలన్నీ అందులో చేర్చాలని సాధారణ పరిపాలనశాఖ అన్ని విభాగాలకూ ఆదేశాలు జారీ చేసింది. చేయని పక్షంలో సంబంధిత అధికారిని బాధ్యుడిని చేస్తామని పేర్కొంది. వైసిపి అధికారంలోకి వచ్చిన తరువాత జిఓలను అప్‌లోడ్ చేయడాన్ని ఆపేయాలని సాధారణ పరిపాలనశాఖ గతంలో ఆదేశాలిచ్చింది. దీని ప్రకారం కొన్ని జిఓలు మాత్రమే గెజిట్‌లో పెట్టేశారు. దీనిపై పలువురు హైకోర్టును ఆశ్రయించారు. పరిపాలనకు సంబంధించిన అంశాలను గోప్యంగా ఉంచాల్సిన అవసరం ఏమిటని, వాటిని బయటపెట్టేలా చూడాలని కోరుతూ పిటిషన్ దాఖలు చేశారు. మూడున్నరేళ్ల నుండి జిఓలు అప్‌లోడ్ చేయడం ఆగిపోయింది. ఈ నేపథ్యంలో విచారించిన కోర్టు జిఓలు అప్‌లోడ్ చేయకపోవడంపై అభ్యంతరం వ్యక్తం చేసింది. దీంతో సాధారణ పరిపాలనశాఖ అధికారులు అన్ని విభాగాలకూ ఆదేశాలు పంపారు. ఎపి గెజిట్‌లో అప్‌లోడ్ చేసిన అనంతరం వివరాలను కేబినెట్ సెక్షన్ అధికారికి తెలపాలని పేర్కొన్నారు.

మినీ డిఎస్‌సి?

- తక్కువ పోస్టులతో నోటిఫికేషన్‌కు యత్నం
- విద్యాశాఖ కసరత్తు !

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

నాలుగున్నరేళ్లల్లో ఒక్క డిఎస్‌సి నోటిఫికేషన్ విడుదల చేయని వైసిపి ప్రభుత్వం ఎన్నికల వేళ మినీ డిఎస్‌సి విడుదలకు ప్రయత్నిస్తోంది. నిరుద్యోగ అభ్యర్థుల్లో అసంతృప్తిని తగ్గించే ప్రయత్నంలో భాగంగానే ఈ కసరత్తు చేస్తోంది. త్వరలో మెగా డిఎస్‌సి నోటిఫికేషన్ అంటూ నిన్నటి వరకు ప్రకటించిన మంత్రులు, ఎమ్మెల్యేలు చివరకు తక్కువ పోస్టులతో సరిపెడుతున్నట్లు సమాచారం. సుమారు 25 వేల పోస్టులు విద్యాశాఖలో ఖాళీగా ఉన్నా, మొత్తాన్ని భర్తీ చేయడం లేదు. రాష్ట్ర వ్యాప్తంగా మంజూరైన ఉపాధ్యాయ పోస్టులు 1,88,162 కాగా 1,69,642 మంది మాత్రమే పనిచేస్తున్నారని విద్యాశాఖ చెబుతోంది. ఈ ప్రకారం కూడా 18,520 పోస్టుల ఖాళీలు ఉండాలి. కేవలం 8,366 మాత్రమే ఉన్నాయని అధికారులు అంటున్నారు. జనవరి 31వ తేదీ నాటికి మరో 5 వేల పోస్టుల్లో ఉపాధ్యాయులు ఉద్యోగ విరమణ చేయనున్నారు. మొత్తంగా ప్రభుత్వ లెక్కల ప్రకారమే 23,520 పోస్టులు ఖాళీ అన్నమాట. వీటిని భర్తీ చేయకుండా కేవలం 5 వేల నుంచి 6 వేలలోపు పోస్టులను మాత్రమే భర్తీ చేసే అవకాశం ఉందని విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు. ఈ పోస్టుల భర్తీ ప్రతిపాదనను ఆర్థిక శాఖకు త్వరలో పంపుతామని, అనుమతి రాగానే నోటిఫికేషన్ విడుదలవుతుందని చెబుతున్నారు. ఈ ప్రక్రియకు మొత్తం ఒక నెల సమయం పడుతుందని అంటున్నారు.

జిఓ 117తో 10,154 పోస్టులు రద్దు

రేషనలైజేషన్ పేరుతో రాష్ట్ర ప్రభుత్వం జిఓ 117ను గతేడాది విడుదల చేసింది. గతంలో ఉన్న ఉపాధ్యాయ, విద్యార్థి నిష్పత్తిని పెంచేసింది. ప్రాథమిక పాఠశాలల్లో గతంలో విద్యార్థి ఉపాధ్యాయ నిష్పత్తి 1:20గా ఉండేది. జిఓ 117తో 1:30 చేసింది. గతంలో విద్యార్థుల సంఖ్య 40 దాటితే ఉండే మూడో ఎస్‌జిటి పోస్టు, ఇప్పుడు 60 దాటితేనే ఉంది. ఉన్నత పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య ఆధారంగా మంజూరు చేయాల్సిన పోస్టులను తరగతుల ఆధారంగా మంజూరు చేసింది. దీంతో వేల సంఖ్యలో పోస్టులను ప్రభుత్వం కుదించింది. ఈ జిఓతో మొత్తం 10,514 ఉపాధ్యాయ పోస్టులను ప్రభుత్వం రద్దు చేసింది. అదేవిధంగా తెలుగు మాధ్యమాన్ని రద్దు చేయడంతో సుమారు మరో 15 వేల పోస్టులు రద్దయ్యాయి. సంస్కరణల పేరుతో రోజుకో విధానం తీసుకొస్తున్న ప్రభుత్వం.. ఉపాధ్యాయులను మాత్రం నియమించడం లేదు. దీంతో ఉన్నవారిపై భారం పడటమే కాకుండా లక్షల సంఖ్యలో నిరుద్యోగులు పోస్టుల కోసం ఎదురుచూస్తున్నారు.

నీట్ పిజి సీట్ల భర్తీకి ప్రత్యేక కౌన్సిలింగ్

- నేటి నుంచి రిజిస్ట్రేషన్లు ప్రారంభం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఖాళీగా ఉన్న పోస్ట్‌గ్రాడ్యుయేట్ మెడికల్ సీట్లను భర్తీ చేయడానికి నీట్ పిజి ప్రత్యేక రౌండ్ కౌన్సిలింగ్–2023 నిర్వహించనున్నట్లు మెడికల్ కౌన్సిలింగ్ కమిటీ (ఎంసిసి) గురువారం ఒక ప్రకటనలో తెలిపింది. దీని కోసం రిజిస్ట్రేషన్లను ఎంసిసి.ఎన్ఐసి.ఐఎన్ అనే తన అధికారిక వైబ్‌సైట్‌లో శుక్రవారం నుంచి ప్రారంభించనున్నట్లు వెల్లడించింది. రిజిస్ట్రేషన్లకు తుది గడువు ఈ నెల 22గా ప్రకటించింది. ఈ నెల 18 నుంచి 22 వరకూ అభ్యర్థులు తమకు నచ్చిన సెక్షన్లను లాక్ చేసుకోవచ్చు. సీట్ల కేటాయింపు ఫలితాలను ఈ నెల 24న ప్రకటిస్తారు. ఈ నెల 25 నుంచి 30 లోపు విద్యార్థులు తమకు కేటాయించిన సంస్థల్లో రిపోర్ట్ చేయాల్సి ఉంటుందని ఎంసిసి పేర్కొంది. 2023 విద్యాసంవత్సరానికి ఇదే చివరిరౌండ్ అని తెలిపింది. అఖిల భారత కోటా, రాష్ట్ర కోటాలో సీటు లభించని అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. రౌండ్–3లో సీటు వచ్చినా వాటిని నిరాకరించిన అభ్యర్థులకు అవకాశం లేదు. ఈ ప్రత్యేక కౌన్సిలింగ్‌లో సీటు వచ్చినా చేరని అభ్యర్థుల సెక్యూరిటీ డిపాజిట్‌ను జప్తు చేస్తారు. వారిని వచ్చే ఏడాది నీట్ పరీక్ష రాయకుండా నిరోధిస్తారు. రాష్ట్రాల భాగస్వామ్యంతోనే ఈ ప్రత్యేక కౌన్సిలింగ్ జరుగుతుంది.

టిడ్కో ఇళ్ల నిర్వహణపై దృష్టి

- గృహ నిర్మాణశాఖపై సమీక్షలో సిఎం
- పావలా వడ్డీపై రుణాలకు బకాయిలు చెల్లింపు




ప్రజాశక్తి – అమరావతి బ్యూరో

టిడ్కో ఇళ్ల నిర్వహణపై లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని, అసోసియేషన్లు సమర్థవంతంగా పని చేసేలా చూడాలని అధికారులను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశించారు. గృహ నిర్మాణశాఖపై గురువారం తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో సిఎం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. టిడ్కో ఇళ్ల నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. ప్రభుత్వం ఇచ్చిన రూ.లక్షల విలువైన ఆస్తిని ఎలా నిర్వహించుకోవాలనే అంశంపై వారికి తగిన విధంగా సూచనలు ఇవ్వాలని పేర్కొన్నారు. దీనివల్ల భవనాలు మరింత నాణ్యంగా ఉండేలా, పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలని తెలిపారు. అలాగే మౌలిక సదుపాయాలు కల్పనపై నిరంతరం పర్యవేక్షించాలని, ఎక్కడ ఏ సమస్యను గుర్తించినా వెంటనే దాన్ని సరిదిద్దేలా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. నిర్మాణాలు పూర్తి చేసుకున్న ప్రతి ఇంటినీ ఆడిట్ చేసి సదుపాయాలు ఉన్నాయా లేవా అన్న అంశాలను పరిశీలించాలని ఆదేశించారు. కరెంటు, తాగునీరు, సోక్‌పిట్లపై ఎప్పటికప్పుడు ఆడిట్ చేయించాలని సూచించారు. ఇళ్ల నిర్మాణం కోసం 12,72,143 మందికి పావలా వడ్డీకి రూ.35 వేల చొప్పున రూ.4,483 కోట్ల రుణాన్ని ఇప్పించామని, పావలా వడ్డీపై మిగిలిన రుణం చెల్లించాల్సిన బాధ్యత ప్రభుత్వం తీసుకుంటుందని సిఎం తెలిపారు. వడ్డీ డబ్బు విడుదలకు సన్నద్ధంగా ఉండాలని అధికారులను ఆదేశించారు.

మ్యాజిక్ సోక్‌పిట్లు

గత అక్టోబరులో 7.43 లక్షల ఇళ్లను లబ్ధిదారులకు అందించామని, ఫిబ్రవరి నాటికి మరో ఐదు లక్షల ఇళ్లను పూర్తి చేస్తామని ముఖ్యమంత్రికి అధికారులు వివరించారు. వీటికి సంబంధించిన పనులు చురుగ్గా సాగుతున్నాయని తెలిపారు. సదుపాయాలనూ పరిశీలించామని, కరెంటు, తాగునీరు సదుపాయాలు కల్పించామని పేర్కొన్నారు. మ్యాజిక్ సోక్‌పిట్లు ఏర్పాటు చేస్తున్నామని సిఎంకు వివరించారు.



చంద్రబాబు బెయిల్ పిటిషన్‌పై తీర్పు రిజర్వు

- స్కిల్ కేసులో ముగిసిన వాదనలు

ప్రజాశక్తి-అమరావతి

స్కిల్ డెవలప్‌మెంటు కేసులో టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడు దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌పై హైకోర్టు తీర్పును రిజర్వులో పెట్టింది. గురువారం ఇరుపక్షాల వాదనలు ముగియడంతో తీర్పును వాయిదా వేస్తున్నట్లు జస్టిస్ తల్లాప్రగడ మల్లికార్జునరావు ప్రకటించారు. స్కిల్ డెవలప్‌మెంటు కేంద్రాల ఏర్పాటు వ్యవహారంలో సీమెన్స్ సంస్థ 90 శాతం నిధులను ఖర్చు చేయకముందే రాష్ట్ర ప్రభుత్వం తన వాటా కింద రూ.330 కోట్లను విడుదల చేసి అవినీతికి తెరతీసిందని సిఐడి తరపున పొన్నవోలు సుధాకర్‌రెడ్డి వాదించారు. టిడిపి అధికారంలో ఉండగానే ఈ స్కాం వెలుగులోకి వచ్చిందని, ఇందులో చంద్రబాబు పాత్ర ఉందని చెప్పారు. ఈ పరిస్థితుల్లో చంద్రబాబుకు బెయిల్ మంజూరు చేస్తే సాక్ష్యాలను తారుమారు చేసే స్థాయిలో పలుకుబడి ఆయనకు ఉందన్నారు. స్కిల్ స్కామ్‌లో కాజేసిన డబ్బు హవాలా మార్గంలో మళ్లించారని అన్నారు. చెన్నప్ప అనే వ్యక్తి ద్వారా సుమన్ బోస్ మళ్లింపు చేశారని చెప్పారు. వారిద్దరి మధ్య రహస్య కోడ్ భాషలో సంభాషణలు కూడా ఉన్నాయన్నారు. చివరికి కుంభకోణంలోని కొంత డబ్బు తెలుగుదేశం పార్టీ ఖాతాకు జమైందన్నారు. దీనికి సంబంధించిన వివరాలు ఇచ్చేందుకు టిడిపి అంగీకరించడం లేదన్నారు. చంద్రబాబు సహ నిందితుల ద్వారా సాక్షులను ప్రభావితం చేస్తున్నారని, బెయిల్ కోసం తప్పుడు మెడికల్ రిపోర్టును కోర్టు ముందుంచారని వాదించారు. హైపర్ పిక్ కార్డియోపతి ఉన్నట్లు వైద్యులు చెబుతున్నారని, ఇసిజిలో మాత్రం అలాంటిదేమీ లేదని తేలిందన్నారు. ప్రభుత్వ వైద్యుల బృందంతో పరీక్షలు చేయించుకునేలా ఆదేశాలు జారీ చేయాలన్నారు. చంద్రబాబును ఢిల్లీ ఎయిమ్స్‌కు అయినా తీసుకెళ్తామని, ఇప్పటికే మధ్యంతర బెయిల్ షరతులను ఉల్లంఘించారని, బెయిల్ ఇవ్వొద్దని, పిటిషన్ కొట్టివేయాలని వాదించారు. ఈ వాదనను చంద్రబాబు తరపున సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా తోసిపుచ్చారు. చట్టసభలకు ఎన్నికలు జరగబోయే సమయంలో కావాలని ప్రభుత్వం చంద్రబాబుపై కేసులు నమోదు చేసిందన్నారు. ఒక కేసు తర్వాత మరో కేసు నమోదు చేసి చంద్రబాబును ఇబ్బందులకు గురిచేయాలనే కుట్రలో ప్రభుత్వం ఉందన్నారు. 2018 నుంచి స్కిల్ కేసు ఉందని, ఇప్పుడు హడావుడిగా కేసు విచారణ చేయాల్సిన అవసరం

మిగతా 2లో



న్యాయ కళాశాలల్లో ప్రవేశాలకు నేటి నుంచి కౌన్సెలింగ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలోని న్యాయ కళాశాలల్లో వివిధ కోర్సుల్లో ప్రవేశాలకు నేటి నుంచి కౌన్సెలింగ్ ప్రారంభం కానుంది. లాసెట్–2023లో ఉత్తీర్ణత సాధించినవారికి ఈ కౌన్సెలింగ్ నిర్వహిస్తారు. ఇందుకు సంబంధించిన వివరాలను రాష్ట్ర ఉన్నత విద్యామండలి వైస్ ఛైర్మన్, లాసెట్ కన్వీనరు పి ఉమామహేశ్వరి దేవి గురువారం ఒక ప్రకటనలో వెల్లడించారు. అభ్యర్థుల ఫీజు చెల్లింపు, రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఈ నెల 17 నుంచి 20 వరకు ఉంటుందని తెలిపారు. 18 నుంచి 22 వరకు సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ఉంటుందని పేర్కొన్నారు. స్పెషల్ కేటగిరి అభ్యర్థులకు 21న ఉంటుందని వివరించారు. 23 నుంచి 25 వరకు వెబ్ ఆప్షన్లు ఎంచుకోవచ్చని తెలిపారు. 26న ఆప్షన్లు మార్చుకునే అవకాశం ఉందని పేర్కొన్నారు. 28న అభ్యర్థులకు సీట్ల కేటాయింపు ఉంటుందని, 29, 30 తేదీల్లో అభ్యర్థులు ఆయా కళాశాలల్లో రిపోర్టు చేయాలని వివరించారు.

సయోధ్యా.. సంఘర్షణా?

- ఏదో ఎంచుకోండి
- బైడెన్‌కు జిన్‌పింగ్ హితవు

శాన్‌ఫ్రాన్సిస్కో ఇరువురు నేతల భేటీ



శాన్‌ఫ్రాన్సిస్కోలోని ఫిలోలి ఎస్టేట్‌లో సమావేశమైన జిన్‌పింగ్, బైడెన్, ఇరు దేశాల ఉన్నతాధికారులు

శాన్‌ఫ్రాన్సిస్కో: శతాబ్ద కాలంలో ఎన్నడూ చూడని విధంగా ఈనాడు ప్రపంచం కీలక మార్పులకు లోనవుతోందని చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ పేర్కొన్నారు. శాన్‌ఫ్రాన్సిస్కోకి దక్షిణంగా ఫిలోలి ఎస్టేట్‌లో బుధవారం అమెరికా అధ్యక్షుడు జో బైడెన్‌తో చైనా అధ్యక్షుడు సీజిన్‌పింగ్ భేటీ అయ్యారు. చైనా, అమెరికాలకు రెండు అవకాశాలు వున్నాయి. సమైక్యతను, సహకారాన్ని పటిష్టపరచుకోవడం, ప్రపంచ సవాళ్లను ఎదుర్కొనేందుకు చేతులు కలపడం, అంతర్జాతీయ భద్రత, సంక్షేమాలను పెంపొందించడమన్నది మొదటి అవకాశం కాగా. రెండవది ఘర్షణలు రెచ్చగొట్టడం, యుద్ధాలు ప్రేరేపిస్తూ ప్రపంచ ప్రజల మధ్య చీలికలు తేవడం. ఈ రెండూ పరస్పర విరుద్ధమైనవి. వీటిలో ఏ మార్గం ఎంచుకుంటామనే దానిపైనే ప్రపంచ మానవాళి, ఈ భూమండల భవిష్యత్తు ఆధారపడి ఉంటుందని చైనా అధ్యక్షుడు జిన్ పింగ్ సూటిగా చెప్పారు. చైనా, అమెరికా రెండూ ఒకదాన్ని మరొకటి మార్చడానికి ప్రయత్నించడమనేది పూర్తి అవాస్తవికంగా వుంటుందని జిన్‌పింగ్ చెప్పారు. అధికార పోటీ అనేది చైనా– అమెరికా, అలాగే ప్రపంచం ఎదుర్కొనే సమస్యలను ఏమాత్రం పరిష్కరించబోదన్నారు. చైనా తనదైన విధానాలు, నిబంధనలతో అభివృద్ధి పంథాను రూపొందించుకుందని అన్నారు. పాత వలసవాద విధానాన్ని చైనా అనుసరించదన్నారు. చైనా శాంతియుత పునరేకీకరణకు మద్దతివ్వాలని, తైవాన్‌కు ఆయుధాలివ్వడాన్ని ఆపివేయాలని జిన్‌పింగ్ అమెరికా అధ్యక్షుణ్ణి కోరారు. బైడెన్ ట్వీట్ చేస్తూ తమ ఇరువురి మధ్య చర్చలు బాగానే జరిగాయని, పురోగతి సాధించామని వ్యాఖ్యానించారు. ఈ భేటీలో ప్రపంచ శాంతి, అభివృద్ధితో బాటు ఇరు దేశాల మిలిటరీల మధ్య కమ్యూనికేషన్ల పునరుద్ధరణ

మిగతా 2లో

హోం మంత్రిని అడ్డుకున్న దళితులు

- దొమ్మేరులో మహేంద్ర అంత్యక్రియలు పూర్తి

ప్రజాశక్తి- కొవ్వూరు, రాజమహేంద్రవరం ప్రతినిధి

ఫ్లెక్సీ వివాదంతో ఆత్మహత్య చేసుకున్న బొంతా మహేంద్ర కుటుంబాన్ని పరామర్శించేందుకు వెళ్లిన హోం మంత్రి తానేటి వనితను దళితులు అడ్డుకున్నారు. హోం మినిస్టర్ గోబ్యాక్ అంటూ పెద్ద ఎత్తున నినదించారు. ఆమెను కారులో నుంచి బయటకు దిగనివ్వకుండా దిగ్బంధించారు. మహేంద్ర మృతికి అధికార పార్టీలోని గ్రూపు విభేదాలే కారణమని రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశమైన నేపథ్యంలో ప్రభుత్వం దిద్దుబాటు చర్యలు చేపట్టింది. స్థానిక ఎమ్మెల్యే, హోం మంత్రి తానేటి వనిత, సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జునను పరామర్శకు పంపించింది. ఈ నేపథ్యంలో దొమ్మేరులో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. పోలీసుల సహకారంతో మేరుగ నాగార్జున, ప్రభుత్వ సలహాదారు రాజీవ్‌కృష్ణ మాత్రమే మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి, రూ.20 లక్షల చెక్కును అందించారు. ప్రభుత్వపరంగా అన్నివిధాలా ఆదుకుంటామని వారు బాధిత కుటుంబానికి హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు మాట్లాడారు. హోం మంత్రి గెలుపు కోసం గత ఎన్నికల్లో మహేంద్ర పనిచేశారన్నారు. పోలీసులు నిర్బంధించారని హోం మంత్రికి సమాచారం ఇచ్చినా పట్టించుకోలేదని వాపోయారు. మంత్రి పట్టించుకుంటే మహేంద్ర బతికేవాడని తెలిపారు. దొమ్మేరులోని స్థానిక క్రైస్తవ శ్మశానవాటికలో మహేంద్ర అంత్యక్రియలు నిర్వహించారు.



పరామర్శకు వెళ్తున్న మంత్రి మేరుగ నాగార్జున

ఎంటిఎస్ అమలు చేయాలి

- పార్ట్ టైం లెక్చరర్ల ధర్నా

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మినీమం టైం స్కేల్ (ఎంటిఎస్) అమలు చేయాలని ఎయిడెడ్ కళాశాలల పార్ట్‌టైం లెక్చరర్లు ధర్నా చేశారు. తాడేపల్లిలోని వైసిపి కార్యాలయం వద్ద గురువారం డిగ్రీ కళాశాలల టెంపరరీ, పార్ట్‌టైం లెక్చరర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. నిరసన సందర్భంగా వైసిపి ప్రధాన కార్యదర్శి, ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డికి వినతిపత్రం అందజేశారు. పదేళ్లుగా ఎయిడెడ్ కళాశాలల్లో క్లియర్ ఎగనెస్ట్ ఎయిడెడ్ పోస్టుల్లో వెయ్యి మంది పనిచేస్తున్నారని పేర్కొన్నారు. రెగ్యులర్ లెక్చరర్లతోపాటు సమానంగా పనిచేస్తున్నా, సరైన వేతనం ఇవ్వడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. అధికారంలోకి రాగానే గురువులకు న్యాయం చేస్తామని తాము కలిసినప్పుడు ప్రతిపక్ష నేతగా ప్రజాసంకల్ప యాత్రలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హామీ ఇచ్చారని చెప్పారు. అధికారంలోకి వచ్చిన తరువాత కూడా పలుమార్లు కలిసి సమస్యను పరిష్కరించాలని సిఎం దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. అయినా ఇప్పటి వరకు తమ సమస్య పరిష్కారం కాలేదన్నారు. డిఎస్‌సి-1998 ఉపాధ్యాయులకు అమలు చేస్తున్నట్లు తమకూ ఎంటిఎస్ విధానం అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ఉపాధ్యక్షులు ఆరిగ జోషిరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..

స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ, ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ, అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి, గుంటూరు జిల్లా - 522 501కు కానీ **editorprajasakthi@gmail.com**కు పంపవచ్చు.

లోయలో వాహనం బోల్తా

- ఒకరు మృతి - పలువురికి గాయాలు

ప్రజాశక్తి - పాడేరు (అల్లూరి సీతారామరాజు జిల్లా)

అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు మండలంలోని రాయికోట గ్రామం వద్ద గురువారం రాత్రి బొలెరో వాహనం అదుపుతప్పి లోయలో పడిపోయింది. ఈ ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. ప్రాథమిక సమాచారం మేరకు.. ఈ వాహనంలో 20 మందికిపైగా ప్రయాణికులు ఉన్నట్లు తెలుస్తోంది. ఘటన జరిగిన వెంటనే వాహనంలో ప్రయాణిస్తున్న సోలం నూకరాజు (30) అక్కడికక్కడే మృతిచెందగా, మరో 15 మంది గాయపడినట్లు తెలుస్తోంది. క్షతగాత్రులను సమీపంలోని ఈదులపాలెం పిహెచ్‌సికి తరలించారు. ప్రమాదానికి సంబంధించి పూర్తి సమాచారం తెలియాల్సి ఉంది.

ఎమ్మెల్యే గోరంట్ల పిఎపై కానిస్టేబుల్ దాడి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి పిఎ చంద్రశేఖర్‌పై కానిస్టేబుల్ దాడి చేశారు. ఈ దాడిలో ఆయనకు గాయాలయ్యాయి. బాధితుని కథనం మేరకు.. రాజమహేంద్రవరంలోని తన ఇంటి నుంచి ఎమ్మెల్యే ఇంటికి చంద్రశేఖర్ బైకుపై వెళ్తుండగా రామాలయం సెంటర్‌లో ట్రాఫిక్ సిగ్నల్ పడింది. యూటర్న్ తీసుకొంటుండగా అక్కడ విధుల్లో ఉన్న ట్రాఫిక్ కానిస్టేబుల్ కరుణ్‌కుమార్‌అడ్డుకున్నారు. బైకు తాళాన్ని కానిస్టేబుల్ తీసుకోవడంతో ఇరువురి మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. ఆగ్రహానికి గురైన కానిస్టేబుల్ తన చేతిలో ఉన్న వాకీటాకీతో చంద్రశేఖర్ తలపై దాడి చేశారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే, టిడిపి నాయకులు, కార్యకర్తలు అక్కడకు చేరుకున్నారు. పోలీసుల తీరును నిరసిస్తూ రోడ్డుపై బైఠాయించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్రంలో కొందరు పోలీసులు సిఎం జగన్‌మోహన్‌రెడ్డికి ప్రయివేటు సైన్యంగా మారిపోయారని విమర్శించారు. అనంతరం ప్రకాశం నగర్ పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌పై ఫిర్యాదు చేశారు.



సమన్వయ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న బాలకృష్ణ

రాష్ట్రంలో అభివృద్ధి శూన్యం

- వైసిపిని గద్దె దింపడమే టిడిపి-జనసేన లక్ష్యం
- ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యసేవలు అందించకుండా అధ్వానంగా మార్చేశారని ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ విమర్శించారు. శ్రీ సత్యసాయి జిల్లాలో ఆయన గురువారం వివిధ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ముందుగా హిందూపురంలోని ఆయన నివాసంలో టిడిపి, జనసేన సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. వైసిపిని గద్దె దింపేలా రెండు పార్టీలు భవిష్యత్తులో కలిసి పని చేసేలా ఉమ్మడి నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. రాష్ట్రంలో అభివృద్ధి శూన్యంగా ఉందని విమర్శించారు. ప్రభుత్వం అవలంబిస్తోన్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. అనంతరం హిందూపురం జిల్లా ఆస్పత్రిని తనిఖీ చేశారు. ఆస్పపత్రిలో సమస్యలపై మెడికల్ సూపరింటెండెంట్ రోహిల్‌కుమార్‌తో మాట్లాడారు. ఈ సందర్భంగా బాలకృష్ణ విలేకరులతో మాట్లాడుతూ ఆస్పత్రిలో అనేక సమస్యలు ఉన్నాయని తెలిపారు. వైద్య పరికరాలు లేవని, ఉన్న వాటిని వినియోగించుకోవడంలేదని అన్నారు. గతంలో తాను ఇచ్చిన వెంటిలేటర్లను నిరుపయోగంగా పడేశారని తెలిపారు. ఆరోగ్యశ్రీ నిధులు విడుదల చేయకపోవడంతో వైద్య సేవలను నిలిపివేస్తామని ప్రయివేటు ఆస్పత్రుల యాజమాన్యాలు ప్రకటించడం ప్రభుత్వ చేతగానితనానికి నిదర్శనమని అన్నారు. అనంతరం టిడిపి ప్రభుత్వ హయాంలో హిందూపురం ఆస్పత్రిలో రూ.22 కోట్లతో నిర్మించిన మాతా శిశు ఆస్పత్రి ముందు సెల్ఫీ ఛాలెంజ్ చేశారు.

బాలకృష్ణ కారును అడ్డుకున్న వైసిపి కార్యకర్త

బాలకృష్ణ పర్యటనలో బుధవారం రాత్రి ఉద్రిక్తత చోటు చేసుకుంది. టిడిపి నాయకులు అశ్వర్థరెడ్డి కుమార్తె వివాహ రిసెప్షన్ ముగించుకుని ఇంటికి వెళ్తున్న బాలకృష్ణ కారును వైసిపి కార్యకర్త మధు మేళాపురం వద్ద అడ్డుకున్నాడు. చేతిలో ఉన్న ప్లకార్డును బాలకృష్ణ కారుపైకి విసిరారు. పోలీసులు అడ్డుకోవడంతో ప్లకార్డుకు ఉన్న కర్ర ఎస్‌ఐకి తగిలింది. పోలీసులు మధును పట్టుకునేందుకు యత్నించగా అక్కడి నుంచి పారిపోయాడు.

చంద్రగిరిలో 60 వేల దొంగ ఓట్లు

- ఎన్నికల ప్రధాన అధికారికి టిడిపి ఫిర్యాదు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

చంద్రగిరిలో నియోజకవర్గంలో 60 వేల దొంగ ఓట్లు వైసిపి నాయకులు చేర్చారని ఎన్నికల సంఘం ప్రధాన అధికారి ముఖేష్ కుమార్ మీనాకు టిడిపి నాయకులు ఫిర్యాదు చేశారు. ఈ ఓట్లను తొలగించాలని మీనాను గురువారం సచివాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. అలాగే చంద్రగిరి నియోజకవర్గంలో వైసిపి అనుకూల ప్రాంతాల్లో కొత్తగా 45 పోలింగ్ బూత్‌లు పెంచారని, వీటిని తొలగించి పాత పద్ధతిలోనే ఉంచాలని కోరారు. కొత్తపేట నియోజకవర్గంలో 6 వేల ఓట్లు తొలగించేందుకు ఇంగ్లీష్‌లో నోటీసులు ఇచ్చారని, వీటిని తొలగించొద్దని తెలిపారు. మీనాను కలిసిన వారిలో ఆ పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు ఎంఎ షరీఫ్, అధికార ప్రతినిధి పిల్లి మాణిక్యరావు ఉన్నారు.

మహేంద్ర కేసులో ఎ-1 హోంమంత్రి : మాజీ మంత్రి జవహర్

తూర్పు గోదావరి జిల్లా దుమ్మేరులో బొంతు మహేంద్ర ఆత్మహత్య కేసులో హోంమంత్రి తానేటి వనితను ఎ-1 చేర్చాల్సిన అవసరం ఉందని మాజీ మంత్రి కెఎస్ జవహర్ గురువారం విలేకరుల సమావేశంలో అన్నారు. ఎవరు ఒత్తిడి తెస్తే అతనిని అరెస్టు చేసి వేధించారు? హోంమంత్రి ఎవరికి ఫోన్‌లు చేశారు? అనే నిజాలు తెలియాలన్నారు. ఘటనకు నైతిక బాధ్యత వహిస్తూ హోంమంత్రి తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని టిడిపి అధికార ప్రతినిధి పిల్లి మాణిక్యరావు డిమాండ్ చేశారు. టిటిడి ఇఒ పదవికి ధర్మారెడ్డి అనర్హుడని ఆ పార్టీ అధికార ప్రతినిధి ఆనం వెంకట రమణారెడ్డి విమర్శించారు. చంద్రబాబు గురించి మాట్లాడే అర్హత వైసిపి నేత సజ్జలకు లేదని టిడిపి ఎమ్మెల్యే అశోక్‌బాబు అన్నారు. ఆస్పత్రిని తప్పు పట్టే స్థాయి ఎఏజికి లేదని అన్నారు.

సంక్షేమ బోర్డు డబ్బులు వాడుకున్న వైసిపి

- రాష్ట్ర కార్మిక విభాగం అధ్యక్షులు పుల్లయ్య

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

లేబర్ వెల్ఫేర్ బోర్డులో నిధులను జగనన్న బీమాకు మళ్లించి లేబర్ కార్డు పొందిన కార్మికులకు వైసిపి ప్రభుత్వం అన్యాయం చేసిందని కాంగ్రెస్ పార్టీ కార్మిక విభాగం రాష్ట్ర అధ్యక్షులు చెప్పులి పుల్లయ్య అన్నారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యాలయంలో అసంఘటిత కార్మికుల, ఉద్యోగుల కాంగ్రెస్ ఆరో ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన పుల్లయ్య మాట్లాడుతూ.. వైసిపి అధికారంలోకి వచ్చిన తరువాత కొత్త ఇసుక పాలసీని తెచ్చి భవన నిర్మాణ కార్మికులకు ఉపాధి లేకుండా చేసిందన్నారు. బిల్డింగ్ అండ్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ వెల్ఫేర్ బోర్డుకు నిధులు కూడా ఇవ్వడం లేదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మహిళా అధ్యక్షులు లాం తాంతియకుమారి, నగర అధ్యక్షులు నరహరశెట్టి నరసింహారావు, నాయకులు గురునాథం తదితరులు పాల్గొన్నారు.

ప్రజలను తప్పుదోవ పట్టిస్తోన్న నిమ్మగడ్డ

- ఎపి ఇంటెలెక్చువల్స్ అండ్ సిటిజన్స్ ఫోరం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో ఓటర్ల జాబితా సవరణ అంశంలో సిటిజన్స్ ఫర్ డెమొక్రసి పేరుతో మాజీ రాష్ట్ర ఎన్నికల కమిషనరు నిమ్మగడ్డ రమేష్‌కుమార్ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆంధ్రప్రదేశ్ ప్రొఫెషనల్స్ అండ్ సిటిజన్స్ ఫోరం అధ్యక్షులు పి విజయబాబు విమర్శించారు. దొంగ ఓట్లు - కుట్ర రాజకీయాలు అనే అంశంపై ఆంధ్రప్రదేశ్ ప్రొఫెషనల్స్ అండ్ సిటిజన్స్ ఫోరం ఆధ్వర్యంలో విజయవాడలోని ఐలాపురం హోటల్‌లో గురువారం రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా విజయబాబు మాట్లాడుతూ.. ప్రైవేటు సంస్థల చేతుల్లో ఓటర్ల జాబితా వుండటం ప్రమాదకరమని చెప్పే నిమ్మగడ్డ.. మొదట చంద్రబాబే ప్రైవేటు వారికి ఓటర్ల జాబితాను ఇచ్చారనే అంశాన్ని ఎందుకు విస్మరిస్తున్నారని అన్నారు. గతంలో సేవా మిత్రా, బ్లూ ఫ్రాగ్, ఐటి గ్రిడ్ వారికి డేటాను గంపగుత్తగా అందజేశారని ఆరోపించారు. సమావేశంలో సీనియర్ జర్నలిస్టు కృష్ణంరాజు, అధికార భాషా సంఘం సభ్యులు ఆచార్య జి రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యాక్సిస్ బ్యాంక్, మణపురం ఫైనాన్స్‌పై ఆర్‌బిఐ కొరడా

ముంబయి : నిబంధనలను పాటించడంలో విఫలమైనందుకు యాక్సిస్ బ్యాంక్, మణపురం ఫైనాన్స్‌పై ఆర్‌బిఐ కొరడా ఝులిపించింది. యాక్సిస్ బ్యాంకుపై రూ.90.92 లక్షలు, మణపురం ఫైనాన్స్ సంస్థపై రూ.42.78 లక్షల జరిమాన విధించింది. ఆర్‌బిఐ కెవైసి మార్గదర్శకాలు-2016, రుణాలు, అడ్వాన్సులు, కోడ్ ఆఫ్ కండక్ట్ ఫర్ ఓపెనింగ్ అండ్ ఆపరేటింగ్ కరంట్ అకౌంట్స్ తదితర నిబంధనల అమలులో ఆ సంస్థలు విఫలమయ్యాయని ఆర్‌బిఐ తెలిపింది. ఈ విషయమై తాము జారీ చేసిన నోటీసులకు ఆయా సంస్థల నుంచి సంతృప్తికరమైన సమాధానం రాకపోవడంతో జరిమానా విధించాల్సి వచ్చిందని పేర్కొంది.

యుపిలో దారుణాలు

- మహిళపై గ్యాంగ్ రేప్
- యువతి, తల్లిపై యాసిడ్ దాడి

లక్నో : బిజెపి పాలనలోని ఉత్తర్ ప్రదేశ్‌లో మహిళలపై దారుణాలు కొనసాగుతూనే ఉన్నాయి. బిజ్నోర్‌లో ఒక మహిళపై ఐదుగురు దొంగలు సామూహిక అత్యాచారానికి పాల్పడ్డగా, అయోధ్యలో ప్రేమకు అంగీకరించ లేదన్న కోపంతో యువతి, ఆమె తల్లిపై ఒక వ్యక్తి యాసిడ్‌తో దాడి చేశాడు. ఈ సంఘటనలు పూర్తి వివరాలు.. బిజ్నోర్‌లో ఇటీవల ఒక వ్యాపారి ఇంటిని దోచుకోవడానికి వచ్చిన ఐదుగురు దొంగలు అతని భార్యను కట్టేసి గ్యాంగ్ రేప్‌కి పాల్పడటమే కాకుండా సిగరెట్లతో దారుణంగా హింసించారు. ఈ ఘటనపై పోలీసులు విచారణ ప్రారంభించారు. హార్డ్‌వేర్-పేయింట్ వ్యాపారం చేసే ఓ వ్యక్తి తన తల్లి, పిల్లలతో కలిసి మెడిసిన్స్ కొనుగోలు చేయడానికి బయటకు వెళ్లిన సమయంలో ఈ దారుణం చోటు చేసుకుంది. ఐదుగురు వ్యక్తులు ఇంట్లోకి ప్రవేశించి అల్మారాలను పగలగొట్టి బంగారు ఆభరణాలు, రెండు కిలోల వెండి, రూ. 1.5 లక్షల విలువైన నగదును దోచుకున్నారు. మహిళను ఓ గదిలో బంధించి ఇంట్లోని స్కూటర్‌ని తీసుకుని పరారయ్యారు. రాత్రి 7.30 గంటల ప్రాంతంలో ఇంటి పైకప్పు నుంచి దొంగలు ఇంట్లోకి ప్రవేశించినట్లు వ్యాపారి తన ఫిర్యాదులో పేర్కొన్నాడు. తన భార్యను కొట్టడంతో పాటు ఆమెను బంధించి, స్పృహ తప్పేలా చేశారని, సామూహిక అత్యాచారం చేసి, సిగరెట్లతో కాల్చారని ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి మహిళను వైద్య పరీక్షల నిమిత్తం పంపినట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై మూడు టీంలతో నిందితులను పట్టుకునేందుకు వెతుకుతున్నట్లు ఎస్పీ రామ్ అర్జ్ తెలిపారు.

అయోధ్యలో ప్రేమకు అంగీకరించ లేదన్న కోపంతో యువతి, ఆమె తల్లిపై పొరుగున ఉండే 24 ఏళ్ల వ్యక్తి యాసిడ్‌తో దాడి చేశాడు. అనంతరం అక్కడి నుంచి పారిపోయాడు. గాయపడిన వారిద్దరూ చికిత్స పొందుతున్నారు. పోలీసులు నిందితుడ్ని అరెస్ట్ చేశారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరిపారు. నిందితుడ్ని అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు.

సహారాపై కేసు కొనసాగుతుంది

- సెబీ ఛైర్‌పర్సన్ మధాబీ వెల్లడి



ముంబయి : సుబ్రతా రాయ్ మరణించినప్పటికీ సహారా గ్రూపునపై కేసులు యథాతథంగా కొనసాగుతాయని సెక్యూరిటీస్ ఎక్స్ఛేంజీ బోర్డు ఆఫ్ ఇండియా (సెబీ) ఛైర్‌పర్సన్ మధాబీ పూరీ బుచ్ వెల్లడించారు. ముంబయిలో జరిగిన ఫిక్కీ సమావేశంలో మధాబీ మాట్లాడుతూ ఒక సంస్థ నిర్వాహకుడు జీవించి ఉన్నా, లేకున్నా.. దానిపై ఉన్న కేసులు యథాతథంగా కొనసాగుతాయని స్పష్టం చేశారు. 2008 సమయంలో సహారా గ్రూపులోని సహారా ఇండియా రియల్ ఎస్టేట్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఎస్‌ఐఆర్‌ఇసిఎల్), సహారా హౌసింగ్ ఇన్వెస్‌మెంట్ కార్పొరేషన్ (ఎస్‌హెచ్‌ఐసిఎల్) నిబంధనలకు విరుద్ధంగా ప్రజల వద్ద నుంచి దాదాపు రూ.20వేల కోట్లు నిధులు సమీకరించి.. ఆర్థిక అవకతవకలకు పాల్పడ్డాయి. రెగ్యులేటరీ చట్టాలను ఉల్లంఘించిన ఈ చర్యలపై సెబీ విచారణ చేపట్టింది. సెబీ నిబంధనలకు విరుద్ధంగా ఆప్షనల్లీ ఫుల్లీ కన్వర్టిబుల్ డిబెంచర్స్ జారీ చేసి మూడు కోట్ల మంది మదుపర్ల నుంచి నిధులు సమీకరించింది. ఈ సేకరించిన నిధులను రీఫండ్ చేయాలని 2011లో సహారా గ్రూప్ సంస్థలకు సెబీ ఆదేశాలు జారీ చేసింది. సుబ్రతా రాయ్ సెబీ ఆదేశాలను విస్మరించారు. ఇది కాస్తా సుప్రీంకోర్టుకు చేరింది. ఆ తర్వాత సెబీ నిర్ణయం సరైందేనని.. రాయ్ అవకతవకలకు పాల్పడ్డారని అత్యున్నత న్యాయ స్థానం తేల్చింది. దోషిగా తేల్చుతూ.. జైలు శిక్ష సైతం విధించింది. మదుపర్ల నుంచి సేకరించిన నిధులపై 15 శాతం వడ్డీతో వారికి చెల్లించాలని 2012 ఆగస్ట్‌లో ఆదేశాలు జారీ చేసింది. ఫలితంగా ఇన్వెస్టర్లకు సొమ్ము రీఫండ్ చేసేందుకు రూ.25 వేల కోట్ల నిధులను సెబీ వద్ద సహారా డిపాజిట్ చేసింది.

కానీ, నాటి నుంచి ఇప్పటి వరకూ మదుపర్లకు సెబీ కేవలం రూ.138 కోట్లు మాత్రమే రీఫండ్ చేసింది. సుప్రీంకోర్టు నియమించిన కమిటీకి ఇన్వెస్టర్లు సమర్పించిన ఆధారంగా పేమెంట్స్ జరుగుతున్నాయని మాధాబీ పురీ బుచ్ తెలిపారు. కాగా.. సెబీ ఇప్పటి వరకు కేవలం రూ.138 కోట్లు మాత్రమే చెల్లించడంపై విలేకరులు అడిగిన ప్రశ్నకు మాధాబీ సమాధానం ఇస్తూ.. సుప్రీంకోర్టు నియమించిన కమిటీకి మదుపరులు సమర్పించిన సాక్ష్యాల ఆధారంగా తిరిగి చెల్లింపులు జరుగుతున్నాయన్నారు.

పుదుచ్చేరిలో గిరిజనులకు అవమానం..

- సన్మాన కార్యక్రమంలో బలవంతంగా నేలపై కూర్చోబెట్టిన వైనం

పుదుచ్చేరి: కేంద్ర పాలిత ప్రాంతమైన పుదుచ్చేరిలో ఒక సన్మాన కార్యక్రమంలో గిరిజనులను బలవంతంగా నేలపై కూర్చోపెట్టడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. జనజాతీయ గౌరవ దినోత్సవాన్ని పురస్కరించుకుని గిరిజనులకు సన్మాన కార్యక్రమం జరిగింది. ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖ నిర్వహించిన ఈ కార్యక్రమానికి పుదుచ్చేరి ముఖ్యమంత్రి రంగసామి, లెఫ్టినెంట్ గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కాగా, కేవలం 300 మంది కూర్చొనే సామర్థ్యం ఉన్న ఆ హాల్ ప్రభుత్వ అధికారులతో నిండిపోయింది. దీంతో కార్యక్రమానికి ఆహ్వానించిన సుమారు 50 మంది గిరిజనులు కూర్చునేందుకు కుర్చీలు లేవు. ఈ నేపథ్యంలో వారంతా బలవంతంగా నేలపై కూర్చోవాల్సి వచ్చింది. దీంతో తమను అవమానించారంటూ కొందరు గిరిజనులు అసహనం వ్యక్తం చేయడంతో కార్యక్రమంలో గందరగోళం చెలరేగింది. మరోవైపు ఈ విషయం తెలుసుకున్న లెఫ్టినెంట్ గవర్నర్ తమిళిసై సౌందరరాజన్, సీఎం రంగసామి దీనిపై స్పందించారు. గిరిజనులకు వెంటనే కుర్చీలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వ అధికారులను ఆదేశించారు. ఆ ఏర్పాటు చేయడంతో 15 నిమిషాల తర్వాత ఆ కార్యక్రమం కొనసాగింది. అనంతరం లెఫ్టినెంట్ గవర్నర్ కార్యాలయం ఈ సంఘటనపై అసంతృప్తి వ్యక్తం చేసింది. దీనిపై వివరణ ఇవ్వాలని సంబంధిత అధికారులకు నోటీసులు జారీ చేసింది.

'స్టీల్ ప్లాంట్'పై మొండివైఖరి తగదు

- విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ

ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం)

వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను ప్రయివేటుపరం చేయొద్దని సుదీర్ఘకాలంగా ఉద్యమం కొనసాగుతున్నా కేంద్ర ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఛైర్మన్ డి.ఆదినారాయణ, నాయకులు జె.రామకృష్ణ అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో తలపెట్టిన రిలే నిరాహార దీక్షలు గురువారానికి 1008వ రోజుకు చేరాయి. స్టీల్ బ్లాస్ట్ ఫర్నేస్ విభాగం కార్మికులు దీక్షల్లో కూర్చున్నారు. వారినుద్దేశించి ఆదినారాయణ మాట్లాడుతూ ఉక్కు కర్మాగారం ప్రయివేటీకరణ అంశంపై కేంద్ర ప్రభుత్వం మొండి వైఖరి విడనాడాలని డిమాండ్ చేశారు. ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించి, పూర్తి ఉత్పత్తి సామర్థ్యంతో నడపాలని కోరారు. పోరాటాల ద్వారా ఏర్పాటైన ఉక్కు కర్మాగారాన్ని కాపాడుకోవడానికి ఎంతటి త్యాగానికైనా కార్మికవర్గం సిద్ధంగా ఉందన్నారు. దీక్షల్లో ఉక్కు ఉద్యోగులు సాయిరాం, సైన్‌బాబు, ఆర్.వెంకటరావు, వీరాస్వామి, మధు, డి.శ్రీనివాస్, మంత్రి రవికిరణ్, జయ కుమార్, చిత్త అబ్బాయి పాల్గొన్నారు.

శంకరయ్య మృతి ప్రజా ఉద్యమాలకు తీరనిలోటు

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

స్వాతంత్ర్యయోధులు, సిపిఎం వ్యవస్థాపక సభ్యులు ఎన్ శంకరయ్య మృతి ప్రజా ఉద్యమాలకు తీరని లోటని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు అన్నారు. సిపిఎం రాష్ట్ర కార్యాలయంలో బుధవారం ఉదయం శంకరయ్యకు నివాళి కార్యక్రమం జరిగింది. ముందుగా శంకరయ్య చిత్రపటానికి శ్రీనివాసరావు పూలమాల వేసి నివాళులర్పించారు. సంతాప సూచకంగా నిమిషం మౌనం పాటించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ.. శంకరయ్య అఖిల భారత కిసాన్‌సభ అధ్యక్షులుగా, ప్రధాన కార్యదర్శిగా పనిచేశారన్నారు. తమిళనాడులో ఆయనకు ప్రముఖ రైతు నాయకుడిగా పేరుందని, మధురైలో వ్యవసాయ కార్మిక సంఘాన్ని నిర్మించారని అన్నారు. 1940లోనే పార్టీ సభ్యత్వం తీసుకుని స్వాతంత్ర్యోద్యమంలో విద్యార్థి దశలోనే పాల్గొన్నారని అన్నారు. ఆయన డిగ్రీ చివరి సంవత్సరం పూర్తి చేయకుండా జైలుకు వెళితే ఇప్పుడు ఆ యూనివర్సిటీ ఆయనకు డిగ్రీ ప్రధానం చేసిందన్నారు. ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీలో సభ్యునిగా ఉండటమే కాకుండా, కమ్యూనిస్టు పార్టీ పునర్నిర్మాణంలో జాతీయ కౌన్సిల్ బహిష్కరించి బయటకు వచ్చిన 32 మందిలో శంకరయ్య ఒకరన్నారు. రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. శంకరయ్య శత జయంతి సందర్భంగా తమిళనాడు రాష్ట్ర ముఖ్యమంత్రి స్టాలిన్ ఆయన ఇంటికి వెళ్లి సత్కరించి, రూ.10 లక్షలు అందిస్తే.. దానిని కరోనాతో బాధపడుతున్న వారికి అందించాలని కోరారని తెలిపారు. రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి ఉమామహేశ్వరావు మాట్లాడుతూ.. ఇప్పటికీ తమిళనాడులో బలమైన కమ్యూనిస్టు ఉద్యమం ఉందంటే శంకరయ్య, రామ్మూర్తి వంటి వారి కృషి, కార్మికోద్యమాన్ని నిర్మించడంలో వారు చేసిన త్యాగాలే కారణమన్నారు. సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు దడాల సుబ్బారావు మాట్లాడుతూ.. శంకరయ్య క్షేత్రస్థాయి నుంచి పార్టీని నిర్మించి అంకితభావంతో పనిచేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డి రమాదేవి, మంతెన సీతారాం, సిహెచ్ బాబురావు పాల్గొన్నారు.

చంద్రబాబు మెడికల్ రిపోర్టులపై అనుమానాలు

- సజ్జల రామకృష్ణారెడ్డి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో



అనారోగ్య సమస్యలపై కండీషన్ బెయిల్‌పై బయటకు వచ్చాక చంద్రబాబు నాయుడుకు ఇస్తున్న మెడికల్ రిపోర్టులు పలు రకాల అనుమానాలను పెంచేలా వున్నాయని వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి అన్నారు. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. చంద్రబాబుకు ప్రైవేటు ఆస్పత్రులు ఇస్తున్న మెడికల్ రిపోర్టులను పరిశీలిస్తే ఆ బెయిల్‌పై మరికొంత కాలం బయట ఉండేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలిసిందన్నారు. గుండె సంబంధిత ఇబ్బందులుంటే వెంటనే స్టంట్ వేయడం గానీ, బైపాస్ సర్జరీ చేయడం గానీ చేస్తారని, అలా కాకుండా అంబులెన్స్‌ను వెంటపెట్టుకుని బయట తిరగాలని వైద్యులు రిపోర్టు ఇచ్చారంటే వాటిపై అనుమానాలు వస్తున్నాయని అన్నారు. కేన్సర్ వంటి రోగం ఉందో లేదో పరీక్షలు చేయాలని రిపోర్టు రాయటం ఏమిటని ప్రశ్నించారు. జైలులో ఉన్నంతసేపు ప్రాణాంతక వ్యాధులున్నట్టు ప్రచారం చేసుకుని బెయిల్ రాగానే జైలు నుంచి ర్యాలీ పేరుతో హంగామా చేశారన్నారు. మెడికల్ రిపోర్టు ఇచ్చింది వైద్యులా? లేక రాజకీయ నేతలా? అనే అనుమానాలు కలుగుతున్నాయని అన్నారు. చంద్రబాబు జైలులో ఉన్నా.. బయట ఉన్నా.. తమకేమీ ఇబ్బంది లేదన్నారు.

విద్యార్థుల ఫీజు బకాయిలు రూ.1,650 కోట్లు

- తక్షణమే విడుదల చేయాలి
- ముఖ్యమంత్రికి లోకేష్ లేఖ



ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

డిగ్రీ, పిజి విద్యార్థులకు ఫీజు బకాయిలు రూ.1,650 కోట్లు తక్షణమే విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని టిడిపి ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ కోరారు. ఈ మేరకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి గురువారం ఆయన లేఖ రాశారు. 2021-22 బకాయిలు రూ.600 కోట్లు, 2022-23లో నాలుగో టర్మ్ ఫీజు రూ.600 కోట్లు చెల్లించాల్సి ఉందని వివరించారు. నాలుగేళ్లుగా పిజి కోర్సుల బకాయిలు రూ.450 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. విద్యాసంవత్సరం మొదలై నాలుగు నెలలు గడుస్తున్నా ఫీజు బకాయిలు చెల్లించలేదని అన్నారు. కళాశాలల యాజమాన్యాలు పరీక్షలు రాయనీయడం లేదని, విద్యార్థుల భవిష్యత్తు అగమ్యగోచరంగా మారిందని పేర్కొన్నారు. చదువు పూర్తయిన వారి మార్కుల లిస్టులు, ఇతర సర్టిఫికెట్లు జారీని నిలిపేశాయని అన్నారు. పై చదువులు, ఉద్యోగ పరీక్షలు, ఇంటర్వ్యూలకు హాజరయ్యే విద్యార్థులు సర్టిఫికెట్లు లేక నానా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కేంద్రం ఎస్‌సి, ఎస్‌టి విద్యార్థులకు ఇస్తున్న 60 శాతం ఫీజు ఏ లెక్కలోనూ చూపడం లేదని విమర్శించారు. విద్యాదీవెన డబ్బులను విద్యార్థి, తల్లి జాయింట్ ఖాతాలో వేస్తామంటూ మెలిక పెట్టడం విద్యార్థుల్ని మరింత ఇబ్బందులకు గురిచేసే ప్రహసనమని పేర్కొన్నారు.

సయోధ్యా.. సంఘర్షణా?

(మొదటి పేజీ తరువాయి)

గురించి కూడా చర్చించారు. అక్రమ మందుల సరఫరాను నియంత్రించడంలో పరస్పరం సహకరించు కునేందుకు ఒక వర్కింగ్ గ్రూపును ఏర్పాటు చేయాలని ఇరువురు నేతలు నిర్ణయించారు. సమానత్వం, గౌరవం ప్రాతిపదికన చైనా - అమెరికా రక్షణ విభాగ వర్కింగ్ గ్రూపుల సమావేశాలు నిర్వహించాలని, సముద్ర జలాల భద్రతపై సంప్రదింపుల యంత్రాంగం సమావేశాలు జరపాలని నిర్ణయించారు. వచ్చే ఏడాది నుండి రెండు దేశాల మధ్య విమానాల సంఖ్యను గణనీయంగా పెంచాలని నిర్ణయించారు. విద్య, అంతర్జాతీయ విద్యార్థులు, యువత, సంస్కృతి, క్రీడలు, వాణిజ్యం తదితర రంగాల్లో పరస్పర మార్పిడులను విస్తరించాలని కూడా నిర్ణయించారు. వాతావరణ సంక్షోభాన్ని పరిష్కరించేందుకు కార్యకలాపాలను, చర్యలను వేగవంతం చేయాలన్న నిశ్చయాన్ని పునరుద్ఘాటించారు.

చంద్రబాబు బెయిల్ పిటిషన్‌పై తీర్పు రిజర్వు

(మొదటి పేజీ తరువాయి)

ఏముందని ప్రశ్నించారు. సీమెన్స్ ఫోరెన్సిక్ ఆడిట్‌ను పూర్తిగా పరిశీలన చేయలేదని రాశారని చెప్పారు. చంద్రబాబును కేసులో ఇరికించేందుకే ఫోరెన్సిక్ రిపోర్టు తయారు చేశారన్నారు. క్షేత్రస్థాయిలో పరిశీలన చేయకుండా రిపోర్టు చేసినట్లుగా ఫోరెన్సిక్ ఆడిట్ నివేదికలో ఉందని తెలిపారు. స్కిల్ కేసులో అరెస్టయిన పిటిషనర్ చంద్రబాబు రాజమహేంద్రవరం కేంద్ర కారాగారంలో 52 రోజులు ఉన్నారని, రెండు రోజులపాటు చంద్రబాబును పోలీసుల కస్టడీకి ఎసిబి కోర్టు ఇచ్చిందని, ఆ తర్వాత మళ్లీ ఇచ్చేందుకు కోర్టు నిరాకరించిందని అన్నారు. రికార్డులన్నీ ప్రభుత్వం వద్దనే ఉన్నాయని, అవి తారుమారయ్యే ఆస్కారం లేదని చెప్పారు. చంద్రబాబుకు బెయిల్ మంజూరు చేయాలని కోరారు. ఇరుపక్షాల వాదనల తర్వాత హైకోర్టు తీర్పును రిజర్వులో పెడుతున్నట్లు ప్రకటించింది.

అన్ని నియోజకవర్గాల్లోనూ పోటీ : కెఎ పాల్

ప్రజాశక్తి - కలెక్టరేట్ (విశాఖపట్నం)
రానున్న ఎన్నికల్లో రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల్లోనూ తమ పార్టీ పోటీ చేయనుందని ప్రజాశాంతి పార్టీ అధ్యక్షులు కెఎ పాల్ తెలిపారు. విశాఖ ఆశీల్‌మెట్టలోని తన కార్యాలయంలో ఆయన గురువారం మీడియాతో మాట్లాడారు. విశాఖ ఎంపీగా తనను గెలిపించాలని కోరారు. వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ కాకుండా తాత్కాలికంగా అడ్డుకున్నామని తెలిపారు. విశాఖ నగర వాసులకు ఉపాధి అవకాశాలు కల్పించేలా కంపెనీల ఏర్పాటు, విద్య, వైద్యం వంటి సౌకర్యాలు కల్పించడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. స్టీల్‌ప్లాంట్‌కు రూ.4 వేల కోట్లు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నామని ప్రకటించిన ప్రభుత్వం తీసుకోవడానికి అంగీకరించలేదని చెప్పారు. బిజెపి నాయకులు జివిఎల్ నరసింహారావు విశాఖ నుంచి ఎంపీగా పోటీ చేయడానికి సన్నద్ధమవుతున్నారని, ఈ ప్రాంతంతో సంబంధంలేని వ్యక్తికి నగర వాసులు ఓట్లు వేయొద్దని కోరారు. దేశంలో బిజెపి పాలన దారుణంగా తయారైందని, ముస్లిములు, క్రిస్టియన్లపై ఎక్కడికక్కడ దాడులు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వాటిని నియంత్రించకపోగా ప్రధాని మోడీ ప్రోత్సహిస్తుండడంపై మండిపడ్డారు. తన పార్టీకి ఎపిలో అధికారాన్ని ఇస్తే చంద్రబాబు, జగన్‌మోహన్‌రెడ్డి చేసిన అప్పులన్నింటినీ తీరుస్తామని హామీ ఇచ్చారు.

జగనన్న కాలనీల్లో అవినీతి

- నాదెండ్ల మనోహర్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో
జగనన్న కాలనీల కోసం చేపట్టిన భూసేకరణలో వైసిపి ప్రజా ప్రతినిధులు రూ.35,141 కోట్ల అవినీతికి పాల్పడ్డారని జనసేన రాజకీయ వ్యవహారాల కమిటీ ఛైర్మన్ నాదెండ్ల మనోహర్ ఆరోపించారు. గురువారం జనసేన పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. జగనన్న కాలనీల నిర్మాణం పేరుతో వైసిపి సర్కారు పేదలను వంచిస్తోందన్నారు. భూసేకరణ పేరుతో ప్రభుత్వ ఖజానాను లూటీ చేస్తున్నారని, గుంకలాం ఇళ్ల పరిశీలన సమయంలో పవన్‌కల్యాణ్ అప్పుడే చెప్పారని మనోహర్ గుర్తు చేశారు. ముఖ్యమంత్రి శాసనసభలో చెప్పిన లెక్కలకు, ప్రభుత్వ ప్రకటనలకు పొంతన లేదన్నారు. వైసిపి నాయకుల మధ్య వాటాల పంపకంలో గొడవలు రావడంతో అవినీతి లెక్కలు బయటకు వస్తున్నాయని తెలిపారు. గుంటూరు జిల్లాలో వైసిపి ప్రజా ప్రతినిధులు, అధికారులు, చివరకు కలెక్టరు కూడా అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు. ఒక ఎమ్మెల్యే చేసిన భూసేకరణపై విజిలెన్స్ విచారణకు డిమాండ్ చేశారు.

మోడీ ప్రభుత్వాన్ని సాగనంపాలి


విద్రోహదినం కార్యక్రమంలో పెన్షనర్లు


విశాఖలోని మర్రిపాలెం పిఎఫ్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న పెన్షనర్లు

ప్రజాశక్తి- యంత్రాంగం
కనీస పెన్షన్ అమలు చేసే అంశంలో సుప్రీంకోర్టు, ఇపిఎఫ్‌ఒ ఆదేశాలను కేంద్రంలోని నరేంద్రమోడీ ప్రభుత్వం అమలు చేయకుండా తప్పుదారి పట్టిస్తోందని, పెన్షనర్లంతా ఐక్యంగా నరేంద్రమోడీని సాగనంపాలని ఎఐసిఇపిఎఫ్‌పిఎ, ఎపిఆర్‌పిఎ డిమాండ్ చేశాయి. పెన్షనర్ల సమస్యలపై గురువారం రాష్ట్రవ్యాప్తంగా ఎఐసిఇపిఎఫ్‌పిఎ, ఎపిఆర్‌పిఎ ఆధ్వర్యాన విద్రోహ దినం పేరుతో అన్ని జిల్లాల పిఎఫ్ కార్యాలయాల ముందు నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. విశాఖ పిఎఫ్, తహశీల్దార్ కార్యాలయాల్లో వినతిపత్రాలు అందజేశారు. విజయవాడలో జరిగిన విద్రోహ దినం కార్యక్రమంలో ఎఐసిఇపిఎఫ్‌పిఎ, ఎపిఆర్‌పిఎ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఎస్‌ఎ శాస్త్రి, కె సత్తిరాజు మాట్లాడారు. తమ జీవితంలో ఎక్కువ కాలం సర్వీసు చేసిన ఉద్యోగికి సామాజిక బాధ్యతగా కేంద్రం చెల్లించాల్సిన పెన్షన్‌ను నామమాత్రంగా చెల్లిస్తోందని విమర్శించారు. పెన్షన్ అంశంపై సుప్రీం కోర్టు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినా నరేంద్రమోడీ ప్రభుత్వం అమలు చేయడం లేదన్నారు. బిజెపి సర్కార్‌ను సాగనంపేందుకు పెన్షనర్లంతా నడుంబిగించాలని అన్నారు. మోడీని ఇంటికి పంపేదాకా అంచెలంచెలుగా ఈ పోరాటాలను ఉధృతం చేయాలని కోరారు. విశాఖ మర్రిపాలెం పిఎఫ్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. పెద్ద సంఖ్యలో తరలివచ్చిన పెన్షనర్లను ఉద్దేశించి ఇపిఎస్ - 95 పెన్షనర్ల సంఘం రాష్ట్ర కార్యదర్శి కె సుధాకర్‌రావు మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ఇపిఎస్ - 95 పెన్షన్ పథకాన్ని అమలు చేసి నేటికి 28 ఏళ్లు అవుతున్నా, ఇప్పటి వరకూ కనీస పెన్షన్ సవరణగాని, పెంపుగానీ లేకుండా పెన్షనర్లను మోసగిస్తూ వస్తోందన్నారు. తక్షణం కనీస పెన్షన్ రూ.తొమ్మిది వేలుతోపాటు డిఎను అనుసంధానం చేసి ఇవ్వాలని డిమాండ్ చేశారు. అందరికీ హయ్యర్ పెన్షన్ అవకాశం కల్పించాలని కోరారు. భార్యాభర్తలకు వైద్య సదుపాయం కల్పించాలని, రైల్వే రాయితీని పునరుద్ధరించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం పిఎఫ్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు.

జిఎస్‌టి వసూళ్లలో గణనీయమైన పురోగతి

- కేంద్ర ఆర్థిక శాఖా మంత్రి నిర్మలా సీతారామన్
- తిరుపతిలో సెంట్రల్ జిఎస్‌టి కమిషనరేట్‌కు భూమిపూజ



ప్రజాశక్తి - తిరుపతి టౌన్
జిఎస్‌టి వసూళ్లలో గణనీయమైన పురోగతి సాధించామని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. రూ. 36.11 కోట్లతో తిరుపతిలో నిర్మించనున్న సెంట్రల్ జిఎస్‌టి కమిషనరేట్‌కు గురువారం భూమిపూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నిర్మలా సీతారామన్ వర్చువల్‌గా పాల్గొన్నారు. సెంట్రల్ బోర్డు ఆఫ్ ఇన్‌డైరెక్ట్ ట్యాక్సెస్ అండ్ కస్టమ్స్ (సిబిఐసి) సభ్యులతో కలిసి ఛైర్మన్ సంజయ్ కుమార్ అగర్వాల్ భూమిపూజ నిర్వహించి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిర్మలా సీతారామన్ మాట్లాడుతూ తిరుపతి సిజిఎస్‌టి కమిషనరేట్ వైజాగ్ జోనల్ చీఫ్ కమిషనరేట్ పరిధిలో ఉంటుందని తెలిపారు. వైజాగ్ జోనల్ చీఫ్ కమిషనర్ వారు జిఎస్‌టి వసూళ్లే కాకుండా కస్టమ్స్, సెంట్రల్ ఎక్సైజ్ కార్యక్రమాలను పర్యవేక్షిస్తారని, బంగారం, మాదక ద్రవ్యాల స్మగ్లింగ్ వంటి చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడే వారికి శిక్షలు పడేలా చర్యలు తీసుకుంటున్నారని అన్నారు. తిరుపతి సిజిఎస్‌టి కమిషనరేట్ పరిధిలో తిరుపతి, చిత్తూరు, కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి, కడప, అన్నమయ్య జిల్లాలు ఉన్నాయని, ఇందులో ఎక్కువ శాతం మౌలిక సదుపాయాల పరిశ్రమలు, వివిధ పరిశ్రమల ద్వారా జిఎస్‌టి వసూళ్లలో గణనీయమైన పురోగతి ఉందని తెలిపారు. గత సంవత్సరం జిఎస్‌టి ట్యాక్స్ కలెక్షన్లు రూ. 8264 కోట్లుగా ఉందని, ఈ ఆర్థిక సంవత్సరం సెప్టెంబర్ నాటికి రూ.5019 కోట్లను వసూళ్లు చేశారని తెలిపారు. ప్యాసింజర్ వాహనాల తయారీ పరిశ్రమలు, ఆటోమోటివ్ బ్యాటరీ పరిశ్రమలు, సిమెంట్ పరిశ్రమలు ప్రధానంగా కాంట్రిబ్యూట్ చేస్తున్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిబిఐసి జోనల్ సభ్యులు వివేక్ నిరంజన్, ఎడిజి సెంట్రల్ పబ్లిక్ వర్క్స్ డిపార్ట్‌మెంట్ హైదరాబాద్ రేంజ్ శిశిర్ భన్సాల్, తదితరులు పాల్గొన్నారు.

ఎయిమ్స్‌లో మౌలిక వసతులపై నిర్లక్ష్యం

- రాష్ట్ర ప్రభుత్వంపై పురందేశ్వరి ధ్వజం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి
మంగళగిరి ఎయిమ్స్‌లో కనీస వసతులు కల్పించడంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు దగ్గుబాటి పురందేశ్వరి విమర్శించారు. గుంటూరులో ఆమె గురువారం మీడియాతో మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం రూ.1600 కోట్లతో మంగళగిరిలో ఎయిమ్స్ వైద్యశాలను ఏర్పాటు చేసినప్పటికీ మౌలిక వసతులు కల్పించడంతో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందన్నారు. కనీసం తాగునీటి సౌకర్యం కూడా కల్పించలేని స్థితిలో ఉండడం సిగ్గుచేటన్నారు. దీంతో, ఎయిమ్స్‌లో వైద్యులు, విద్యార్థులు, రోగులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని తెలిపారు. కేంద్రం నుంచి వచ్చే నిధులను రాష్ట్ర ప్రభుత్వం దారిమళ్లించి తన సొంత పథకాలకు వినియోగించుకుంటోందని ఆరోపించారు. రాష్ట్రంలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలపై శ్రద్ధ చూపడంలేదన్నారు. పరిశ్రమల స్థాపనపైనా మొదటి నుంచి నిర్లక్ష్యమే కనిపిస్తోందని విమర్శించారు. అమరావతి అభివృద్ధిని విస్మరించి రైతులను తీవ్రంగా నష్టపరిచిందన్నారు. రాజధానిగా అమరావతి ఉంటుందన్న ఆలోచనతో రూ.20 వేల కోట్లతో అవుటర్ రింగ్ రోడ్డు నిర్మాణానికి కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందన్నారు. అనంతపురం-అమరావతి హైవే నిర్మాణానికి రూ.28 వేల కోట్లు కేటాయించినా ఇంత వరకు పనులు ప్రారంభించలేదని గుర్తు చేశారు. ఎన్‌జి రంగా అగ్రికల్చరల్ యూనివర్సిటీ లాంలో ఏర్పాటు చేసేందుకు నిధులు ఇచ్చినా గత టిడిపి ప్రభుత్వం వినియోగించుకోకపోవడం వల్ల అవి వెనక్కి వెళ్లాయని చెప్పారు.


రాష్ట్ర సమాచార కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎపిడబ్ల్యుజెఎఫ్ నేతలు

జర్నలిస్టుల ఇళ్ల స్థలాల జిఓ సవరించండి

- ఐఅండ్‌పిఆర్ కమిషనర్‌కు ఎపిడబ్ల్యుజెఎఫ్ నేతల వినతి

ప్రజాశక్తి - విజయవాడ
జర్నలిస్టుల ఇళ్ల స్థలాల కేటాయింపు జిఒకు సవరణలు చేయాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (ఎపిడబ్ల్యుజెఎఫ్) ఆధ్వర్యాన రాష్ట్ర సమాచార, పౌర సంబంధాల శాఖ కమిషనర్ టి.విజయకుమార్‌రెడ్డికి గురువారం వినతిపత్రం అందజేశారు. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల కేటాయింపునకు ప్రభుత్వం మంత్రివర్గంలో తీర్మానించి జిఒ జారీ చేయడం పట్ల ఎపిడబ్ల్యుజెఎఫ్ నేతలు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఎస్.వెంకట్రావు, రాష్ట్ర నాయకులు గోరంట్ల [illegible], విజయవాడ నగర అధ్యక్ష, కార్యదర్శులు కె.కలిమిశ్రీ, ఎం.బి.నాథన్ కమిషనర్‌ను ఆయన ఛాంబర్‌లో కలిసి వినతిపత్రం అందించారు. ప్రభుత్వం జారీ చేసిన జిఒలో నిబంధనలను సవరించాలని కోరారు. అర్హులైన వర్కింగ్ జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. భార్యాభర్తకు ఇంటి స్థలం ఉన్నా, గతంలో ప్రభుత్వం ఇచ్చిన స్థలం ఉన్నా ప్రస్తుతం ఇవ్వకూడదన్న నిబంధన ఎత్తేయాలని కోరారు. స్థలం ఖరీదులో 60/40 రేషియోను సవరించి, నామమాత్రపు ధరకు కేటాయించాలని, ఆ స్థలంలో నిర్మాణం చేపట్టే వారికి రుణ సదుపాయం కల్పించాలని కోరారు. 1/70 చట్టం కారణంగా గిరిజన ప్రాంతాల్లో పనిచేస్తున్న గిరిజనేతర జర్నలిస్టులు స్థానికంగా ఇంటి స్థలం పొందే అవకాశం లేకుండా పోతుందని, వారికి సమీపంలోని మైదాన ప్రాంతంలో కేటాయించాలని విజ్ఞప్తి చేశారు.

'నేరడి'పై ఉదాసీన వైఖరి తగదు

సిఎంకు ఇంధనశాఖ మాజీ కార్యదర్శి ఇ.ఎ.ఎస్ శర్మ లేఖ



ప్రజాశక్తి - కవిటి
వంశధార-బహుదా నదుల అనుసంధానం (నేరడి రిజర్వాయర్) విషయంలో ఉదాసీన వైఖరి తగదని ఇంధన శాఖ మాజీ కార్యదర్శి ఇ.ఎ.ఎస్ శర్మ అన్నారు. ఈ మేరకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డితో పాటు శ్రీకాకుళం జిల్లాకు చెందిన మంత్రులు, ఎంపి, ఎమ్మెల్యేలకు గురువారం లేఖలు రాశారు. శ్రీకాకుళం జిల్లాలో వంశధార-బహుదా నదుల అనుసంధానం ప్రాజెక్టు (నేరడి రిజర్వాయర్ ప్రాజెక్టు)తో ఇచ్ఛాపురం, కవిటి, కంచిలి, సోంపేట, మందస, పలాస, వజ్రపుకొత్తూరు మండలాల్లో సుమారు 2.5 లక్షల ఎకరాలకు సాగునీటి సౌకర్యం కలుగుతుందని పేర్కొన్నారు. అప్పటి టిడిపి ప్రభుత్వం ఈ ప్రాజెక్టుకు అనుమతులు మంజూరు చేసి పనులు ప్రారంభించిందని తెలిపారు. వంశధార ట్రిబ్యునల్ అనుమతి లభించినా, వైసిపి ప్రభుత్వం ప్రాజెక్టును తిరిగి పరిశీలన కోసం వెనక్కి పంపిందన్నారు. 2019 ఫిబ్రవరి 18న ముఖ్యమంత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన సమీక్షలో రూ.6,342 కోట్ల ఖర్చుతో ప్రాజెక్టు రిపోర్టులను 2020 జూన్ 30వ తేదీ లోపు ప్రభుత్వ పరిశీలనకు దాఖలు చేయాలని జలవనరుల శాఖకు ఆదేశాలు ఇచ్చినట్టు గుర్తుచేశారు. ఆ తరువాత 2021 నవంబరులో భువనేశ్వర్‌లోని ఒడిశా-ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రుల మధ్య జరిగిన సమీక్ష సందర్భంగా ఇద్దరు ముఖ్యమంత్రులు చేసిన ఉమ్మడి ప్రకటనలో, నేరడి ప్రాజెక్టు విషయంలో తక్షణ చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినా ఇంత వరకూ ప్రాజెక్టు పనులు ముందుకు పోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రాజెక్టు కోసం కావలసిన 106 ఎకరాల భూమిని ఒడిశా ప్రభుత్వం సేకరించి ఆంధ్రప్రదేశ్ అధికారులకు అందజేయాలని, కానీ ఈ విషయంలో ఎపి రాష్ట్ర ప్రభుత్వం ఆసక్తి చూపకపోవడంతో ఒడిశా ప్రభుత్వం ఎటువంటి చర్యలూ తీసుకోలేదని ఆయన లేఖలో పేర్కొన్నారు. రాష్ట్రంలో చేపట్టిన అన్ని జలవనరుల ప్రాజెక్టుల గురించి ఏటా బడ్జెట్ సమయంలో శాసన సభనుద్దేశించి రాష్ట్ర ఆర్థిక మంత్రి ప్రసంగం చేస్తున్నారని, కానీ, నేరడి రిజర్వాయర్ ప్రాజెక్టు గురించి ప్రస్తావించకపోవడం గమనార్హమని పేర్కొన్నారు.

రాష్ట్ర జలవనరుల శాఖ వెబ్‌సైట్‌లో నేరడి ప్రాజెక్టు పేరే కనిపించకపోవడం, శ్రీకాకుళం జిల్లా ప్రజలకు ఆశ్చర్యం, బాధ కలిగిస్తున్నట్టు పేర్కొన్నారు.

సుజల స్రవంతిలో అదే తీరు..


శ్రీకాకుళం జిల్లా జలవనరుల ప్రాజెక్టుల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం ఉదాసీనతతో వ్యవహరిస్తోంది అనడానికి మరో ఉదాహరణగా బాబూ జగ్‌జీవన్‌రామ్ ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టును ఆయన పేర్కొన్నారు. మాజీ ముఖ్యమంత్రి రాజశేఖర్‌రెడ్డి హయాంలో చేపట్టిన ఈ ప్రాజెక్టు వల్ల శ్రీకాకుళం జిల్లాలో 85,000 ఎకరాల భూములకు సాగునీటి సౌకర్యం కలిగే అవకాశం ఉంది. కానీ ఈ రోజూ వరకు బడ్జెట్‌లో నిధులను చేకూర్చకపోవడం కారణంగా ప్రాజెక్టు అమలు కావడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. శ్రీకాకుళం జిల్లా అభివృద్ధి, జలవనరుల ప్రాజెక్ట్‌ల మీద ఆధారపడి ఉందని, కాని ప్రభుత్వం ఇతర జిల్లాలకు ఇస్తున్న ప్రాముఖ్యత శ్రీకాకుళం జిల్లాకు ఇవ్వకపోవడం అక్కడి ప్రజలకు నిరాశ, బాధ కలిగిస్తోందని లేఖలో వివరించారు. ఇప్పటికైనా ప్రభుత్వం శ్రీకాకుళం జిల్లా అవసరాలను గుర్తించి, నేరడి ప్రాజెక్టు కోసం నిధులను మంజూరు చేయాలని కోరారు. అంతేకాకుండా ఆలస్యం చేయకుండా పనులు చేపడతామని ప్రకటించాలని పేర్కొన్నారు. ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టుకు నిధులను సమకూర్చి శ్రీకాకుళం ప్రాంతానికి న్యాయం చేయాలని కోరారు.

ఆరోపణలపై విచారణ జరిపించండి

- ఎస్‌పికి ఫిర్యాదు చేసిన మంత్రి మేరుగు నాగార్జున

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా
నాపై వచ్చిన ఆరోపణలపై విచారణ జరపాలని బాపట్ల జిల్లా ఎస్‌పి వకుల్ జిందాల్‌ను మంత్రి మేరుగ నాగార్జున కోరారు. ఈ మేరకు గురువారం ఎస్‌పిని కలిసి మంత్రి ఫిర్యాదు చేశారు. అనంతరం విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. బాపట్లలో హాస్టల్ వార్డెన్‌గా పనిచేస్తోన్న గోవిందు అనే వ్యక్తి టిడిపికి చెందిన వారని, స్థలం వివాదం విషయంలో రెవెన్యూ అధికారులు చేసిన ఫిర్యాదు మేరకు చుండూరు పోలీసులు గోవిందుపై చర్యలు తీసుకున్నారని తెలిపారు. జరిగిన విషయాన్ని పక్కదారి పట్టిస్తూ.. తాను కూడా రూ.రెండు లక్షలు అడిగినట్లు, ఎస్ఐ తనతో మాట్లాడే సమయంలో గోవిందు కూడా అక్కడే ఉన్నట్లు తనపై చేసిన తప్పుడు ప్రచారంపై సమగ్ర విచారణ చేయాలని ఎస్‌పిని కోరానన్నారు. అంబేద్కర్ భావజాలంతో ముందుకు వెళ్తున్న తనపై తప్పుడు ఆరోపణలు సరికావన్నారు. కొందరి ప్రోద్బలంతో గోవిందు ఇలాంటి ఆరోపణలు చేశారని, ఆ ఆరోపణలు వాస్తవం కాకపోతే అతనిపై చర్యలు తీసుకోవాలన్నారు.

కడప ట్రిపుల్‌ఐటి వసతి గృహంలోకి కొండచిలువ


మంచం కింద చుట్టుకుని ఉన్న కొండచిలువ

ప్రజాశక్తి - వేంపల్లె
వైఎస్ఆర్ జిల్లా వేంపల్లె మండలంలోని ఆర్‌జెయుకెటి పరిధిలోని ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటి వసతి గృహంలోకి కొండచిలువ ప్రవేశించింది. దీంతో, విద్యార్థులు భయాందోళనకు గురయ్యారు. ట్రిపుల్‌ఐటి న్యూ క్యాంపస్‌లోని బాయ్స్ హాస్టల్-2లోకి గురువారం పెద్ద కొండచిలువ వెళ్లి మంచం కింద చుట్టుకొంది. హాస్టల్‌లో ఉన్న విద్యార్థులు గదిలోకి వెళ్లిన కొద్ది క్షణాల్లోనే శబ్ధం రావడంతో.. మంచం కిందకు చూశారు.

కొండ చిలువ ఉండడంతో కేకలు వేశారు. అక్కడ ఉన్న సెక్యూరిటీ సిబ్బంది అక్కడికి చేరుకుని విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. సెక్యూరిటీ అధికారి కొండచిలువ ఉన్న విషయాన్ని ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ బాలసుబ్రమణ్యంకు సమాచారమిచ్చారు. డిప్యూటీ రేంజ్ అధికారి గురప్ప, మధు, ఎస్‌బిఒ శివమోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఫారెస్ట్ సిబ్బంది కొండ చిలువను చాకచక్యంగా గోనెసంచిలో బంధించి సమీప అడవుల్లో విడిచిపెట్టారు. దీంతో, విద్యార్థులు ఊపిరి పీల్చుకున్నారు. గతంలోనూ పాత ట్రిపుల్‌ఐటి క్యాంపస్ భవనాల్లో పాములు వస్తుండడంతో విద్యార్థులు ఆందోళన చేసిన సంఘటనలు ఉన్నాయి. హాస్టల్ గదులకు కిటికీలు సరిగా లేకపోవడంతోనే కొండచిలువ వచ్చినట్లు విద్యార్థులు తెలిపారు. విషపురుగులు రాకుండా అధికారులు తగు చర్యలు తీసుకోవాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.

కాఫీ గింజల కొనుగోలు ప్రారంభం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ (విశాఖపట్నం)
అల్లూరి సీతారామరాజు జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతాల్లో కాఫీ గింజల కొనుగోలు ప్రక్రియ గురువారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా జిసిసి వైస్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ జి.సురేష్ కుమార్ మాట్లాడుతూ.. ఈ సీజన్‌లో పాడేరు, చింతపల్లి, రంపచోడవరం డివిజన్లలోని తొమ్మిది సొసైటీల పరిధిలో 1500 మెట్రిక్ టన్నుల కాఫీ గింజలను కొనుగోలు చేసేలా లక్ష్యం పెట్టుకున్నామని తెలిపారు. అరబికా పార్చ్‌మెంట్ కాఫీ గింజలకు కిలోకు రూ.280, అరబికా చెర్రీ కాఫీ గింజలకు కిలోకు రూ.145, రోబస్టా చెర్రీ కాఫీ గింజలకు కిలోకు రూ.70 మార్కెట్ ధర నిర్ణయించామన్నారు. దళారుల దోపిడీని నిరోధిస్తామని చెప్పారు.

సంపాదకీయం

వాణిజ్య 'లోటు'

అక్టోబర్ నెలలో దేశ వాణిజ్య లోటు ఎన్నడూ లేనంత ఎక్కువకు చేరుకోవడం ఆందోళనకరం. భారత ప్రభుత్వ వాణిజ్య శాఖ విడుదల చేసిన గణాంకాల ప్రకారం ఆ నెలలో ఎగుమతులు 6.29 శాతం పెరగగా దిగుమతులు 14 శాతం పెరిగాయి. దేశ ఎగుమతులు 3,357 కోట్ల డాలర్లు (డాలరు ప్రస్తుత మారక విలువ రూ.83.20) కాగా దిగుమతులు 6,500 కోట్ల డాలర్లుగా నమోదయింది. ప్రపంచంలో మూడవ అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా అభివృద్ధి చెందుతామనీ, విశ్వగురువు భారత్ అంటూ ప్రధాని మొదలు అధికారపార్టీకి చెందిన చోటా మోటా నేతలు ఊదరగొడుతుంటే వాస్తవ ఆర్థిక పరిస్థితి ఇలా ఉండడం గమనార్హం. అభివృద్ధి చెందుతున్న దేశాలకు వాణిజ్య లోటు ఉండడం సాధారణమే అని కొందరనుకున్నా ఇంత ఎక్కువగా ఉండడం మాత్రం శ్రేయస్కరం కాదు. దేశ స్థూల ఉత్పత్తితో పోల్చి చూసుకుంటే ఇది మరింత ప్రమాదకరమైనదే! ఎగుమతులను పెంచుకోవాలంటూ పాలకులు ఎంతగా ఉద్ఘాటిస్తున్నా అది అంతలా పెరగడం లేదు. సెప్టెంబర్‌తో పోల్చితే అక్టోబర్ ఎగుమతుల్లో పెరుగుదల సాధించడం సంతోషించదగినదే. అక్టోబర్‌లో పెరుగుదల ఈ ఆర్థిక సంవత్సరం ఏడు నెలల్లో సాధించిన వాటిలో రెండవది. అంటే మిగిలిన ఐదు నెలల్లో స్థిరంగా ఉండడమో లేదా తగ్గడమో జరిగింది. ఇంకో విషయం ఏమిటంటే గత ఏడాది అక్టోబర్‌తో పోల్చితే పెరుగుదల తక్కువే. ఆ ముందుటేడాది 2021 అక్టోబర్‌లో 3,570 కోట్ల డాలర్లతో పోల్చితే ఇప్పటిది ఇంకా తక్కువ. అంటే పెరుగుదల శాతాల్లో చూసుకుంటే సంతోషంగా ఉన్నా వాస్తవంలో మన ఎగుమతుల స్థాయి రెండేళ్ల క్రితం కన్నా దిగువనే ఉంది. దిగుమతుల పరిస్థితి పరిశీలిస్తే అది రివర్స్ గేర్‌లో ఉంది. 2021 అక్టోబర్‌లో 5,320 కోట్ల డాలర్లుండగా 2022లో 5,360 కోట్ల డాలర్లకు, ఈ ఏడాది 6,500 కోట్ల డాలర్లకీ ఎగబాకింది. ఈ గణాంకాల ప్రకారం మనకు దిగుమతులు పెరుగుతున్నాయి కానీ ఆ మేరకు ఎగుమతుల్లో వృద్ధి లేదని విదితమవుతోంది. ఇదీ దేశ అభివృద్ధి తీరు!

ఈ కాలంలో మన ఎగుమతుల్లో ప్రధాన పెరుగుదల ఫార్మా రంగంలోనే ఉంది. గత ఏడాది అక్టోబర్‌తో పోల్చితే 29 శాతం పెరిగి 242కోట్ల డాలర్లకు చేరింది. ఫార్మా రంగంలో ముఖ్యంగా బల్క్ డ్రగ్ తయారీలో 1970వ దశకంలో మన దేశంలో పడిన పునాది ఇప్పుడు ఉపయోగపడుతోంది. ప్రపంచ వాణిజ్య సంస్థ మాటున సంపన్న దేశాలు రుద్దిన పేటెంట్ 'నిబంధనాలు' లేకుంటే ఫార్మా రంగం మరింతగా విస్తరించేది. కోవిడ్ వ్యాక్సిన్ విషయంలో భారత్‌కు జరిగిన అన్యాయం, విదేశీ కార్పొరేట్లు ప్రపంచమంతటా వేల కోట్ల డాలర్లు కొల్లగొట్టిన వైనం అందరికీ గుర్తుండే ఉంటుంది. పేద, కడుపేద దేశాలకు మన వ్యాక్సిన్లు చౌకగాను కొంత మేరకు ప్రపంచ ఆరోగ్య సంస్థ ద్వారా ఉచితంగా సరఫరా చేయడం తప్ప అమెరికా, బ్రిటన్ వంటి సంపన్న దేశాలకు భజన చేసే మోడీ సర్కారు ఇంకేమీ చేయలేదు. మోడీ సర్కారు వైఖరి మూలంగా సంపన్న దేశాలు 'మీ ఇంటికొస్తే ఏమిస్తావ్? మా ఇంటికొస్తే ఏం తెస్తావ్?' అన్నట్టు వ్యవహరిస్తున్నాయి. మన పాలకుల మేక్ ఇన్ ఇండియా, ఎగుమతి ఆధారిత వ్యవసాయం వంటివి నినాదాలే తప్ప వాస్తవంలో జరిగేది మాత్రం విదేశీ కార్పొరేట్లకు భారత్ ఓ పెద్ద మార్కెట్‌గా ఉపయోగపడడం మినహా మరేమీ లేదన్నది స్పష్టం. వాణిజ్య లోటు పెరుగుదలకు మరో ముఖ్య కారణం డాలరుతో రూపాయి మారకం విలువ పడిపోవడం. రెండేళ్ల క్రితం అంటే 2021 నవంబర్ 16న డాలరుకు మారకం రూ.74.46 కాగా అది ఈ ఏడాది అదే తేదీన రూ.83.24కి పడిపోయింది. ఎగుమతిదార్లకు రూపాయల్లో కొంత లబ్ధి చేకూరినా దిగుమతులు అధికం కనుక మన దేశం నష్టపోయేది ఎక్కువగా ఉంటుంది. వినియోగదారులు మరింతగా నష్టపోతున్నారు.

నయా ఉదారవాద ఆర్థిక విధానాల ఫలితంగానే దేశానికీ దురవస్థ ఏర్పడిందన్నది సుస్పష్టం. అంతేగాక అమెరికాకు జూనియర్ భాగస్వామిగా మారాక భారత్ పరిస్థితి పెనం మీది నుండి పొయ్యిలో పడినట్టయింది. ఈ ఆర్థిక విధానాల స్థానంలో స్వావలంబనకు దోహదపడే విధానాలొస్తేనే దేశం బాగుపడుతుంది. అయితే కార్పొరేట్ మతతత్వ కూటమి పాలనలో అది అసంభవం. కాబట్టి ఈ ముదనష్టపు ప్రభుత్వాన్ని గద్దె దించడమే దేశ ప్రజల ముందున్న ఏకైక మార్గం.

మహనీయుల మాట




రాజకీయపరమైన స్వాతంత్ర్యం
ఎంత వున్నా,
అది ఆకలితో అలమటించేవారిని
సంతోష పెట్టలేదు.
- వి.ఐ. లెనిన్

సందర్భం

సామ్రాజ్యవాదాన్ని వ్యతిరేకించడం కమ్యూనిస్టుల ప్రథమ కర్తవ్యం

భారత కమ్యూనిస్ట్ పార్టీ 103వ వార్షికోత్సవం సందర్భంగా ప్రమోద్ దాస్ గుప్తా మెమోరియల్ ట్రస్ట్, కలకత్తా వారు సెమినార్ నిర్వహించారు. అక్కడ 'వర్తమాన కాలంలో 175 ఏళ్ల కమ్యూనిస్ట్ ప్రణాళిక' అనే అంశంపై గత నెల17న సిపిఎం పోలిట్‌బ్యూరో సభ్యులు ప్రకాష్ కరత్ చేసిన ప్రసంగ పాఠమిది.



ప్రకాష్ కరత్



తాష్కెంట్‌లో ఏర్పడిన భారత కమ్యూనిస్ట్ పార్టీ వార్షికోత్సవంతో పాటు...మార్క్స్, ఎంగెల్స్ రచించిన 'కమ్యూనిస్ట్ ప్రణాళిక' ప్రచురణ 175వ వార్షికోత్సవాన్ని జరుపుకునేందుకు...మనమిక్కడ సమావేశమయ్యాం. ఈ రెండిటికి చాలా దగ్గరి సంబంధం ఉంది. 'కమ్యూనిస్ట్ ప్రణాళిక' అనేది కమ్యూనిస్టుల మొదటి రాజకీయ ప్రకటన. కమ్యూనిస్ట్ ఉద్యమానికి సంబంధించిన ప్రతీది, ఈ చిన్న రచన ఆధారంగానే జరుగుతుంది. జర్మనీ కార్మికులకు చెందిన 'కమ్యూనిస్ట్ లీగ్' అనే చిన్న బృందం కోసం వారు దానిని 1848లో రచించారు. తరువాత ఇతర కార్మికుల్ని కలుపుకునేందుకు దానిని విస్తరించి, ఆ తరువాత ఇంటర్నేషనల్ వర్కింగ్ మెన్స్ అసోసియేషన్ (మొదటి ఇంటర్నేషనల్)గా అభివృద్ధి చేశారు. కాబట్టి కమ్యూనిస్ట్ మ్యానిఫెస్టో లేకుండా ప్రపంచంలో కమ్యూనిస్టు పార్టీల ఏర్పాటు గురించి ఆలోచించలేం.

1920లో నూతన విప్లవకర రష్యాలో భాగమైన తాష్కెంట్‌లో కమ్యూనిస్ట్ ఇంటర్నేషనల్ రెండో మహాసభకు ఎం.ఎన్.రాయ్ ప్రతినిధిగా హాజరయ్యాడు. తాష్కెంట్ చేరుకున్న భారత సంతతికి చెందిన కొందరిని, భారతదేశాన్ని విడిచిపెట్టిన వలసదారులను, రష్యా నుండి శిక్షణ, మద్దతు పొంది, తిరిగొచ్చి భారతదేశాన్ని విముక్తి చేసేందుకు సిద్ధమైన ముహాజిర్లను కూడగట్టేందుకు రాయ్ చొరవ చూపాడు. అలా కమ్యూనిస్ట్ మ్యానిఫెస్టో, అంతర్జాతీయ కార్మికవర్గ ఉద్యమానికి పునాదులు వేసింది. చిన్న పార్టీగా ఏర్పడిన భారత కమ్యూనిస్ట్ పార్టీని భారతదేశంలో బ్రిటిష్ సామ్రాజ్యవాదంపై పోరాటం చేయాలనుకున్న ప్రజలు ప్రోత్సహించారు. పెట్టుబడిదారీ విధానం అంతర్జాతీయవ్యవస్థ అనే అవగాహన కోసం కమ్యూనిస్ట్ మ్యానిఫెస్టో పునాదులను వేసింది. ప్రపంచ స్థాయి పెట్టుబడిదారీ విధానంపై పోరాటం చేసేందుకు కార్మికవర్గం కూడా అంతర్జాతీయ ఉద్యమాన్ని నిర్మించాల్సి ఉంటుంది. కమ్యూనిస్ట్ మ్యానిఫెస్టోలో చారిత్రక భౌతికవాద రూపురేఖలు, చారిత్రక భౌతికవాద భావనలను స్పష్టంగా పేర్కొన్నారు. 'ఇప్పటివరకూ నడిచిన చరిత్రంతా వర్గ పోరాటాల చరిత్రే' అని 'కమ్యూనిస్ట్ ప్రణాళిక'లో చెప్పిన విషయం అందరికీ తెలిసిందే. పెట్టుబడిదారీ విధానం, బూర్జువావర్గం, కార్మిక వర్గాన్ని, మిగులు విలువను ఎలా దోచుకుంటుందన్న విషయాన్ని కూడా ప్రణాళిక వివరిస్తుంది. ప్రపంచ పెట్టుబడిదారీ విధానం ఎలా రూపుదిద్దుకుంటుందో కూడా మ్యానిఫెస్టో స్పష్టంగానే ఊహించింది. వాస్తవానికి మార్క్స్, పెట్టుబడిదారీ ప్రపంచీకరణకు ప్రవక్త అని బూర్జువా వర్గాలు కూడా అంగీకరిస్తాయి. కమ్యూనిస్ట్ మ్యానిఫెస్టో దాని భవిష్యత్ గూర్చి ఇలా చెప్తుంది : దాని ఉత్పత్తులకు నిరంతరం విస్తరిస్తున్న మార్కెట్లు అవసరం, దాని ఉత్పత్తులు ప్రపంచ వ్యాప్తంగా బూర్జువా వర్గాన్ని తరుముతాయి. అది ప్రతీ చోట గూడు ఏర్పాటు చేసుకొని, ప్రతి చోట స్థిరపడి, సంబంధాలను ఏర్పరచుకోవాలి. కాబట్టి బూర్జువావర్గం, ఉత్పత్తుల కోసం మార్కెట్ల వెంటపడి, ప్రపంచ నలుమూలల్లో పెట్టుబడి పెట్టాల్సి ఉంటుంది. దీనిని మార్క్స్ ముందే ఊహించాడు. కానీ మ్యానిఫెస్టో...పెట్టుబడిదారీ విధానం ఒక వ్యవస్థ అనే పూర్తి స్థాయి విశ్లేషణ ఇవ్వలేదు. తర్వాత మార్క్స్, 1867లో రాసిన క్యాపిటల్ (పెట్టుబడి) గ్రంథంలో దానిని విశ్లేషించాడు.

మార్క్స్ పెట్టుబడిదారీ సిద్ధాంతాన్ని కొత్త స్థాయికి తీసుకెళ్లిన లెనిన్, 'పెట్టుబడి' గ్రంథంలో మార్క్స్ చేసిన కృషిని ఉపయోగించాడు. ఇప్పుడు గుత్తపెట్టుబడిదారీ విధానం అభివృద్ధి చెందింది. దీనిని సామ్రాజ్యవాదంగా గుర్తించాలి. సామ్రాజ్యవాదం, పెట్టుబడిదారీ విధానం అత్యున్నత దశ అని ఆయన అన్నాడు. ఆ విధంగా మార్క్స్ తరువాత, ఆయన సిద్ధాంతాన్ని ఉన్నత దశకు తీసుకొని వెళ్ళాడు. ఇప్పుడు పెట్టుబడి దారీ విధానం, సామ్రాజ్యవాదం ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రపంచవ్యాప్త వ్యవస్థ అని లెనిన్ గ్రహించాడు. సామ్రాజ్యవాదం, ప్రపంచంలో వివిధ దేశాలను వలస రాజ్యాలుగా మార్చి, వాటిని పెట్టుబడి దారీ సంబంధాల్లోకి లాగింది. కాబట్టి, మనం సామ్రాజ్య వాదంపై పోరాటం చేయాలంటే ఆ పోరాటం అభివృద్ధి చెందిన పెట్టుబడిదారీ దేశాలకు మాత్రమే పరిమితం కాకుండా, దానిని అశేష ప్రజానీకం ముఖ్యంగా సామ్రాజ్య వాదం, ప్రపంచవ్యాప్త పెట్టుబడి చేతిలో దోపిడీకి గురవుతున్న రైతాంగం ఉన్న చిన్నచిన్న వలసలలో కూడా ఉధృతం చేయాలని లెనిన్ అన్నాడు. అందువల్ల, అభివృద్ధి చెందిన పెట్టుబడిదారీ దేశాలలో కార్మికవర్గం చేస్తున్న పోరాటాలకు, విముక్తి కోసం సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాడే వలస దేశాల రైతులకు మధ్య సంబంధం ఉంటుంది.

సామ్రాజ్యవాద శక్తులు మరో వినాశనకర యుద్ధానికి సిద్ధంగా ఉన్నాయి. అమెరికా తన పశ్చిమ మిత్రదేశాల అండతో గాజాపై భూదండయాత్రను చేసేందుకు ఇజ్రాయిల్ సిద్ధంగా ఉంది. సామ్రాజ్యవాదం కింద వలసవాద ప్రక్రియ 20వ శతాబ్దంలోనే దాదాపు పూర్తయింది. కానీ పాత రకానికి చెందిన ఒక స్థిర నివాసుల వలస మిగిలింది, అదే పాలస్తీనా. పాలస్తీనాను ఆక్రమించి, పాలస్తీనియన్లను వలస ప్రజలుగా మార్చింది ఇజ్రాయిల్. ఇజ్రాయిల్ సామ్రాజ్యవాద దేశం కాదని ఎవరైనా వాదించవచ్చు. సాంప్రదాయ నిర్వచనం ప్రకారం అది అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్, జర్మనీ లాంటి సామ్రాజ్యవాద దేశం కాదు. కానీ, శత్రువు కదలికలను కనిపెట్టే ఒక చిన్న మిలిటరీ శిబిరం. అది సామ్రాజ్య వాదానికి పుట్టిన బిడ్డ.

ఇజ్రాయిల్, పాలస్తీనాల చారిత్రక నేపథ్యాన్ని అర్థం చేసుకోకుంటే, వాటి వివాదానికి సంబంధించి నేడు జరుగుతున్నదే మిటో సమగ్రంగా అర్థం చేసుకోలేం. పెట్టుబడిదారీ విధానంపై మార్క్స్ విశ్లేషణ నుండి లెనిన్ సామ్రాజ్యవాద సిద్ధాంతం వరకున్న వివరణ, సామ్రాజ్యవాదం సజీవంగానే ఉందనీ, ప్రపంచంలో నేడు అది ప్రభావం చూపుతుందనే అవగాహననిస్తుంది. గాజాలో మనం చూస్తున్నది, చూడబోతున్నది కూడా సామ్రాజ్యవాదం ప్రారంభించిన మరో వినాశనకర యుద్ధం. సామ్రాజ్యవాదం, ఇరాక్‌కు వ్యతిరేకంగా యుద్ధాన్ని ప్రారంభించి, ఇరాక్‌ను నాశనం చేసింది. లిబియాపై దాడి చేసి, లిబియాను నాశనం చేసింది. ఆఫ్ఘనిస్తాన్‌పై యుద్ధం చేసి, దానిని మట్టి కరిపించింది. అలాగే బ్రిటీష్ వారు మధ్య ప్రాచ్యం అని పిలిచే పశ్చిమాసియాలో కూడా ఇదే జరుగుతున్నది.

ఇజ్రాయిల్, పాలస్తీనా వివాద చరిత్రను వివరించడానికి తిరిగి 1948కి వెళ్తాను. మే, 1948 వరకు ఇజ్రాయిల్ లేదు. 1948 వరకు బ్రిటీష్ పాలన కింద, దాని అధీన దేశంగా పాలస్తీనా మాత్రమే ఉంది. దానికంటే ముందు, 1917-19 మధ్యకాలంలో బ్రిటీష్ దళాలు పాలస్తీనాను ఆక్రమించే వరకు, పాలస్తీనా ఓట్టోమన్ సామ్రాజ్యంలో భాగం. మొదటి ప్రపంచయుద్ధం సామ్రాజ్య విభజనతో ముగిసింది. పాశ్చాత్య శక్తులు, మధ్య ప్రాచ్యాన్ని వారి వారి దేశాలపై ప్రభావం చూపే ప్రాంతాలుగా విభజించాయి. అలా పాలస్తీనా బ్రిటీష్ ఆధీనంలోకి వెళ్లింది. యూరోప్‌లో యూదుల చరిత్ర తెలిసిందే. కేవలం యూదులనే కారణంగా క్రైస్తవ మతానికి, యూదు మతానికున్న చారిత్రక విరోధం కారణంగా అనేక ప్రాంతాల్లో యూదుల్ని పీడించి, అణిచి వేశారు. 19వ శతాబ్దం చివర్లో యూదు ప్రజలకు స్వంత దేశాన్ని స్థాపించే లక్ష్యంతో జియోనిస్ట్ ఉద్యమమనే రాజకీయ ఉద్యమం యూదుల్లో ప్రారంభమైంది. శతాబ్దాలుగా యూదులు యూరోప్‌లో నివసిస్తున్నారు. వారు మధ్య, తూర్పు యూరోపియన్ దేశాల్లో ఎక్కువగా ఉన్నారు. చాలామంది యూరోపియన్ చక్రవర్తులు వారి విధేయతను క్యాథలిక్ చర్చికి ప్రకటించి, యూదుల్ని హింసించారు. యూదు ఉద్యమం చివరికి బ్రిటీష్ సామ్రాజ్యవాదానికి అనుకూలంగా మారింది. 1917లో యూరోప్‌లో మొదటి ప్రపంచయుద్ధం చెలరేగినపుడు, యూదు ప్రజలు బల్ఫోర్ డిక్లరేషన్‌ను స్వీకరించారు. అది బ్రిటీష్ విదేశాంగ కార్యదర్శి ఆర్థర్ బల్ఫోర్ జారీ చేసిన బహిరంగ ప్రకటన. అది, పాలస్తీనాలో యూదులు మాతభూమిని ఏర్పాటు చేసుకోడానికి బ్రిటీష్ వారి మద్దతును వ్యక్తం చేసింది.

అప్పటి నుండి వరుస సంఘటనలు ప్రారంభమయ్యాయి. ముఖ్యంగా రెండో ప్రపంచ యుద్ధంలో సంపూర్ణ వినాశనంగా పిలువబడే నాజీల ఊచకోత, యూదులపై మారణహోమం వంటివి జరిగాయి. రెండో ప్రపంచ యుద్ధం తర్వాత దాదాపు అన్ని పాశ్చాత్య శక్తులు, సంపూర్ణ వినాశనంపై అపరాధ భావంతో, అవమానంతో పాలస్తీనాలో మాతృ భూమి కోసం యూదుల జియోనిస్ట్ డిమాండ్‌ను అంగీక రించాయి. అసలైన పాలస్తీనియన్లు, అప్పటికే అక్క డ ఉంటున్న అరబ్బుల ప్రస్తావనే రాలేదు. ఈలోగా, దశాబ్దాలకు పైగా పాలస్తీనాలోకి యూదుల వలసలు కొనసాగుతున్నాయి. వారక్కడ స్థిరపడిపోవడం, అరబ్బులపైన దాడులు చేసి వారిని వెళ్ళగొట్టడం మొదలుపెట్టారు. చివరకు, 1947 నవంబర్ 29న కొత్తగా ఏర్పాటైన ఐక్యరాజ్యసమితి 181వ తీర్మానాన్ని (విభజన తీర్మానం) ఆమోదించింది. యూదులకు ఇజ్రాయిల్ అనే ప్రత్యేక దేశాన్ని, అరబ్బులకు పాలస్తీనా అనే ప్రత్యేక దేశాన్ని ఇవ్వాలన్న పూర్వ బ్రిటీష్ ఆదేశం మే 1948 నాటికి ముగుస్తుంది కాబట్టి, ఈ తీర్మానం రెండు దేశాలుగా విభజన చేసింది.

కానీ ఇది అమలు కాలేదు. ఇజ్రాయిలీయులకు ఎక్కువ ఆయుధాలు వుండడం, పాశ్చాత్య దేశాల మద్దతుండడం వల్ల, నిజానికి ఇజ్రాయిల్ ప్రత్యేక దేశంగా ప్రకటించబడిన నాటి నుండి పాలస్తీనా అరబ్బులను వారి భూభాగం నుండి వెళ్ళగొట్టే ప్రక్రియ ప్రారంభం అయింది. అరబ్బులు సమిష్టిగా దీన్ని నక్బా (విపత్తు) అంటారు. ఈ సంవత్సరం నక్బా 75వ వార్షికోత్సవం. వెళ్లగొట్టిన తరువాత వారిప్పుడు అసలు పాలస్తీనాలో లేరు. కొందరు జోర్డాన్‌లోని వెస్ట్ బ్యాంక్‌కు వెళ్లారు. కొందరు గాజాలోకి వెళ్లారు. గాజా ఒక ప్పుడు ఓట్టోమన్ సామ్రాజ్యంలో భాగం. తరువాత అది కొన్ని దశాబ్దాలుగా ఈజిప్ట్ అదుపులోకి వచ్చింది.

ఆక్రమిత భూభాగాలకు, గాజాకు అవతల ఎక్కువ మంది పాలస్తీనియన్లు ఉన్నారు. పాలస్తీనా శరణార్థులు 60 ఏళ్ళకు పైగా లెబనాన్ శిబిరాల్లో ఉంటున్నారు. గాజాలో మెజార్టీ పాలస్తీనియన్లు, ఇజ్రాయిల్‌గా మారిన ప్రాంతాల నుండి వెళ్లగొట్టబడిన శరణార్థుల వంశీకులే. గాజా లో టౌన్‌షిప్‌లుగా మారిన 8 శరణార్థ శిబిరాలు ఉన్నాయి. ఉత్తర గాజా నుండి 11లక్షల మంది ప్రజల్ని ఖాళీ చేయాలని ఇజ్రాయిల్ ఆజ్ఞాపించింది కాబట్టి, 75 ఏళ్ళ క్రితం తమ మాతృభూమిని వదిలేయాల్సొచ్చిన ఈ ప్రజలు, నేడు మరొక నక్బాను ఎదుర్కొంటున్నామని అంటున్నారు. దీని వెనకున్న కుట్రను గ్రహించడం కష్టమేమీ కాదు. ఈజిప్టు, గాజా మధ్య ఉన్న రాఫా సరిహద్దును తెరవాలనీ, ఒకప్పుడు లెబనాన్, జోర్డాన్లకు వెళ్ళిన విధంగా, స్థానచలనం కలిగిన పాలస్తీనియన్లను తీసుకోవాలని వారు ఈజిప్ట్‌కు చెప్తున్నారు. వారొక్కసారి అక్కడికి వెళితే, తిరిగి రానివ్వరు. దానివల్ల గాజా ఖాళీ అవుతుంది, కాబట్టి వారు దానిని స్వాధీనం చేసుకుంటారు.

నేడు ఇజ్రాయిలీలకు హమాస్‌ను అంతం చేయాలన్న లక్ష్యం ఉంది. ఈ ప్రక్రియలో 'కొంత జాతి ప్రక్షాళన చేసి, పాలస్తీనియన్లను వదిలించుకుందాం' అనే ఒక రహస్య ఎజెండా ఉంది. హమాస్‌ను నిర్మూలించడం చాలా కష్టం. హమాస్ గాజాలో బాగా వేళ్ళూనుకొని ఉంది. 2007లో పాలస్తీనా భూభాగాలలో జరిగిన ఎన్నికల్లో హమాస్ విజయం సాధించింది.

అక్టోబర్ 7న హమాస్ మిలిటెంట్లు, దిగ్బంధించబడిన గాజా స్ట్రిప్ నుండి తప్పించుకొని, అడ్డంకులను ఛేదించి, ఇజ్రాయిల్ సైనిక స్థావరాలపైన, యూదుల నివాసాల పైన దాడి చేయడంతో 1500 పైగా ప్రజలు మరణించారు. ఇప్పుడు దీనినే హమాస్ టెర్రరిస్టుల భయంకర దాడిగా, ఊచకోతగా చెప్తున్నారు. కాబట్టి ఇజ్రాయిల్, గాజాకు వ్యతిరేకంగా ప్రతీకార చర్య తీసుకుంటుంది.

అయితే గాజా ఏమిటి? ఇజ్రాయిల్ సైన్యం స్థిర నివా సాలను కూల్చి, 2005లో గాజా స్ట్రిప్ నుండి విరమించు కున్నట్లు చెప్తున్నారు. కానీ వాస్తవ ఆక్రమణకు బదులుగా, వారు దిగ్బంధనం విధించి, గాజాను సమర్థవంతంగా అదుపు చేసారు. 365 చదరపు మీటర్లు లేదా 141 చదరపు మైళ్ల విస్తీర్ణంతో మధ్యధరా ప్రాంతం, ఇజ్రాయిల్, ఈజిప్ట్ మధ్య దాదాపు 23 లక్షల మంది ప్రజలు నివసిస్తున్న గాజా, ఓ ఇరుకైన తీర ప్రాంతం. గాజా స్ట్రిప్ లోకి అన్ని ప్రవేశ మార్గాల్ని ఇజ్రాయిల్ నియంత్రిస్తుంది. గాజా లోని 23 లక్షల మంది ప్రజలు తమకవ సరమైన ఆహారం, నీరు, విద్యుత్ కోసం ఇజ్రాయిల్‌పై ఆధారపడతారు. గాజా లోపల, వెలుపల ప్రయాణించే వారి సామర్థ్యం ఇజ్రాయిల్ అనుమతులపై ఆధారపడి ఉంది. అందుకే గాజా స్ట్రిప్‌ను ప్రపంచంలోనే అతి పెద్ద 'బహిరంగ జైలు'గా పేర్కొంటారు. గడిచిన 16 సంవత్సరాలుగా, 2007 నుండి ఈ అక్రమ దిగ్బంధనం గాజా స్ట్రిప్‌ను ఉక్కిరిబిక్కిరి చేస్తుంది. ఈ జైలు జీవితానికి వ్యతిరేకంగా ప్రజలు ఎప్పటికప్పుడు తిరుగుబాట్లు చేస్తూనే ఉన్నారు. వారు ఇజ్రాయిల్ లోకి రాకెట్లను ప్రయోగిస్తూ, సైనికదళాల్ని పంపుతున్నారు. ప్రతీసారి నావికా, వైమానిక బాంబులతో గాజాలో వందల మంది సాధారణ ప్రజలను చంపడం ద్వారా ఇజ్రాయిల్ ప్రతీకారం తీర్చుకుంటుంది. 'మీరు జైల్లో ఉన్నారు, మీ ప్రవర్తన సరిగా లేకుంటే, మీకు ఆహారం, విద్యుత్, మందుల సరఫరా ఉండదు. మీరు నిరసిస్తే, మీ పైన దాడి చేస్తాం' ఇది, ఇజ్రాయిల్ వైఖరి.

పదహారేళ్ల నిరాశ తరువాత, హమాస్ ఆధ్వర్యంలో సమీకరించబడిన గాజా యువత, ఇజ్రాయిల్ ఊహించని విధం గా దాడి చేసింది. తమకు అధునాతన సైన్యం, శాటిలైట్ అందించే అధునాతన నిఘా వ్యవస్థ ఉందని వారనుకున్నారు. ఇవన్నీ ఉన్నా, వారిపై దాడి జరగడంతో, ఈ ప్రాంతాలపై వారి అదుపు లేకుండా పోయింది. ఇప్పుడు ఇజ్రాయిల్‌లో ఉన్నది మితవాద ప్రభుత్వం. నాజీల, ఫాసిస్టుల పాలనలో ఇబ్బందులు పడ్డ ప్రజలు, ఫాసిస్టుల వలె ప్రవర్తించే ప్రజలనే నాయకులుగా ఎంచుకోవడం వింతగా ఉంది. తమ పవిత్ర భూమిలో ఏ ఒక్క అరబ్బు నివసించ కూడదనే ఫాసిస్టులు, మత దురభిమానులు, తీవ్రవాదులతో బెంజమిన్ నెతన్యాహు ప్రభుత్వం నిండి పోయింది.

తీవ్రవాద యూదు ఉద్యమం, వెస్ట్ బ్యాంక్‌లో ఐదు లక్షల మంది యూదు స్థిర నివాసులను, ఒక ప్రాంతం నుండి వేరొక ప్రాంతంలోకి స్థిరనివాసాల్లోకి చొప్పించింది. ఈ యూదు స్థిర నివాసులు జియోనిస్ట్‌లు. వారు భావజాల పరంగా ప్రేరేపించబడ్డారు, భారీగా ఆయుధాలున్నవారు, వారి పవిత్రభూమి పూర్తిగా వారి కిందే ఉంది కాబట్టి పాలస్తీనియన్లను తరిమి వేసే లక్ష్యంతో వారక్కడికి వచ్చారు. అందువల్ల పాలస్తీనాలో జీవనోపాధి వనరైన ఆలివ్ చెట్లను క్రమపద్ధతిలో నరికివేసారు. వారు పాలస్తీనియన్ల భూమిని, ఇళ్ళను ఆక్రమించి, అక్రమంగా ఉపయోగిస్తూ, వారిని వెళ్ళిపోవాలని ఒత్తిడి చేస్తారు. ఇజ్రాయిల్ భద్రతా సిబ్బంది లేదా సాయుధ స్థిరనివాసులు ఈ ఏడాదిలోనే వెస్ట్‌బ్యాంక్‌లో 47 మంది పిల్లలను, 248 మంది పాలస్తీనియన్లను చంపివేసారు.


కాబట్టి ఇక్కడ 20వ శతాబ్దపు పని అసంపూర్ణంగా మిగిలి ఉంది. ఇప్పటికీ విముక్తి చేయబడని వలస ఒకటి ఉంది. ఆధునిక కాలంలో సుదీర్ఘ కాలంపాటు ఆక్రమిత భూభాగం ఇది. రెండవ ప్రపంచ యుద్ధం తరువాత ఇజ్రాయిల్ ఏర్పడినప్పుడు, అప్పటికే సోవియట్ యూనియన్, సోషలిస్టు కూటమి ఉంది. జాతీయ విముక్తి పోరాటాలు ముందుకు సాగుతున్నాయి. అరబ్ జాతీయోద్యమం అభివృద్ధి చెందింది. ఈజిప్ట్‌లో నాజర్ అధికారంలోకి వచ్చాడు. ఇరాక్‌లో కూడా 'బాత్' ఉద్యమం ఊపందుకుంది. వారంతా లౌకికవాదులుగా ఉన్నారు. కాబట్టి, తన ప్రయోజనాలను కాపాడేందుకు ఈ ప్రాంతంలో ఒక పోలీసు అవసరమని అమెరికా కోరుకుంది. ఫలితంగా ఒక అపవిత్ర ఒప్పందం కుదిరింది. అమెరికా ఇజ్రాయిల్‌కు అండగా ఉంటూ, ఆయుధాలతో సహా భౌతిక వనరులను సమకూర్చుతుంది. దీనికి ప్రతిఫలంగా, అరబ్బు ప్రగతిశీల జాతీయవాద లౌకిక శక్తులు పెరగకుండా ఇజ్రాయిల్ చూసుకునే ప్రక్రియ కొనసాగింది.

ఈ విరోధానికి అమెరికా ఎలా స్పందించిందో మనం చూడవచ్చు.


(ఇంకా వుంది)

కామన్ సెన్స్

'ఎవల్యూషన్ డే' తప్పక జరుపుకోవాలి!



డా॥ దేవరాజు మహారాజు



చార్లెస్ డార్విన్ తన జీవపరిణామ సిద్ధాంతాన్ని ప్రకటించిన రోజు 1859 నవంబర్ 24. ఈ ఆధునిక వైజ్ఞానిక కాలానికి ఆ సిద్ధాంతం ఎంత ముఖ్యమో గ్రహించడానికి, ఆ శాస్త్రవేత్త మీద ఉన్న గౌరవం ప్రకటించుకోవడానికి 24 నవంబర్‌ను 'ఎవల్యూషన్ డే'గా ప్రపంచ దేశాలన్నీ జరుపుకుంటున్నాయి. దీన్ని పెద్ద ఎత్తున మన దేశంలో కూడా జరపడం చాలా అవసరం. ఎందుకంటే వైజ్ఞానిక దృక్పథం దేశంలో బలపడాలని చెప్పిన భారత తొలి ప్రధాని నెహ్రూ స్థాయిని తగ్గించాలని ప్రయత్నిస్తున్న-ప్రస్తుత కేంద్ర ప్రభుత్వ చర్యల్ని తిప్పికొట్టడానికి సామాన్య ప్రజలు వివేకవంతులై ఇలాంటి వైజ్ఞానిక కార్యక్రమాల్లో పాల్గొనడం తప్పనిసరి! జీవ పరిణామ సిద్ధాంతం (థీరీ ఆఫ్ ఎవల్యూషన్) పనికిరానిదని ప్రభుత్వం-సిలబస్ నుండి తొలగిస్తోంది. భారత రాజ్యాంగం స్థానంలో మనుస్మృతిని ప్రవేశపెడతామంటోంది. ఇలాంటి వాటిని అడ్డుకోవాలంటే, ప్రగతిశీల భావాలు గల వారంతా వైజ్ఞానిక కార్యక్రమాలు పెద్ద ఎత్తున జరుపుకోవాలి.

ఈ విషయాల్లో మన దేశ పరిస్థితులు మరీ దిగదుడుపుగా ఉన్నాయి. మతపరమైన పండుగలకు స్కూళ్లు, కాలేజీలు, ఆఫీసులకు సెలవులిస్తూ అర్థరహితమైన పండుగల్ని ప్రభుత్వాలు ప్రమోట్ చేస్తున్నాయి. దేవుళ్ల శోభాయాత్రల పేరుతో అసాంఘిక కార్యక్రమాలకు అవకాశం లభిస్తోంది. వివేకవంతమైన, అర్థవంతమైన వైజ్ఞానిక కార్యక్రమాలు విద్యాసంస్థల్లో గానీ, పౌర సమాజాల్లో గానీ, కుటుంబాల్లో గానీ ఏ ఒక్కటైనా నిర్వహిస్తున్నారా? లేదు కదా? అందుకే ఉపాధ్యాయులు, అధ్యాపకులు, సైన్సు కార్యకర్తలు, బాధ్యతగల పౌరులు, వివేకవంతమైన అధికారులు, మరీ ముఖ్యంగా మహిళలు పూనుకుని-దేశంలో కొనసాగుతున్న విషమ పరిస్థితులను అర్థం చేసుకుని, ఎక్కడికక్కడ ఎవరికివారు వైజ్ఞానిక దృక్పథాన్ని పెంపొందించే కార్యక్రమాలకు రూపకల్పన చేసుకోవాలి. ఉట్టి ఆలోచనలతో పని జరగదు. వాటిని ఆచరణలో పెట్టాలి. విద్యాసంస్థల్లో పనిచేసే వారిపై బాధ్యత మారింతగా ఉంది. విద్యార్థులకు జీవ పరిణామంపై, డార్విన్‌పై, సందర్భాన్ని బట్టి ఇంకా అనేక వైజ్ఞానిక అంశాలపై వ్యాస రచన/ఉపన్యాస పోటీలు పెడుతూ వారిలో వైజ్ఞానిక జిజ్ఞాస పెంచాలి. వారిని హేతుబద్ధంగా ఆలోచింపజేయాలి. మానవ వాదులుగా తీర్చిదిద్దుకోవాలి.

ఎవరి వ్యక్తిగత విశ్వాసాలనో దెబ్బ తీయాలని మనం అనుకోవడం లేదు. అవి వాటి పరిధిలో అవి ఉంటే సంతోషిద్దాం-అంతే! మత విశ్వాసాలెప్పుడూ వ్యక్తిగత స్థాయిలో ఉండాలి. అంతేగాని, వికృతంగా సమాజ స్వరూపాన్ని మార్చేంత దుర్మార్గంగా ఉండకూడదు. అయితే, మత విశ్వాసకులతో ప్రపంచం ప్రగతి పథాన నడవలేదని మాత్రం ఖచ్చితంగా చెబుదాం!

చంద్రయాన్-3 విజయవంతమైందని, అందుకు కారణం తనే అన్నట్టు అనవసరంగా అసందర్భంగా ఆన్‌లైన్‌లో దేశ ప్రజలకు కనబడి, భారతీయ మువ్వన్నెల జెండా ఊపిన నేటి ప్రధాని మోడీ చేసిన నిర్వాకం ఈ దేశ ప్రజలు గ్రహించాలి. ఇస్రో శాస్త్రవేత్తల జీతాల్లో కోతలు విధించడం గురించి-ఇస్రోకు ముడిసరుకు అందించిన వేల మంది సాంకేతిక నిపుణులకు, కార్మికులకు జీతాలివ్వకపోవడం గురించి-ఈ దేశ ప్రజలు తెలుసుకోవాలి. వారంతా పొట్ట పోసుకోవడానికి రోడ్ల మీద టీలు, టిఫిన్లు అమ్ముకోవడం, బయట మెకానిక్‌లుగా, డ్రైవర్లుగా పని చేయడం గురించి-ఈ దేశ ప్రజలు తెలుసుకోవాలి. ఇస్రో శాస్త్రవేత్తల కృషిని శ్లాఘించకుండా, దాన్ని తన ఎలక్షన్ ఎజెండాలో చేర్చుకోవడం గురించి-ఈ దేశ ప్రజలు తెలుసుకోవాలి. పైగా, పురాతన భారతీయ విమానయాన శాస్త్రంలో ఇవన్నీ రాసిపెట్టే ఉన్నాయని అబద్ధాలు ప్రచారం చేసుకుంటూ ఉండడం గురించి-ఈ దేశ ప్రజలు తప్పక తెలుసుకోవాలి. ఈ విషమ పరిస్థితుల్లోంచి బయటపడే మార్గాల్ని అన్వేషించుకోవాలి. రాబోయే కాలాలలో విద్యావంతులతో ముఖ్యంగా వైజ్ఞానిక పిపాస గల వివేకవంతులతో ప్రభుత్వాల్ని ఏర్పాటు చేసుకునే విధంగా చూసుకోవాలి.

'నిన్ను నువ్వు తెలుసుకో'-అని లేని దేవుణ్ణి ధ్యానిస్తూ కళ్లు మూసుకోవడం కాదు. నువ్వెవరు? ఎన్ని పరిణామాలు జరిగి, నువ్వు ఇలా మారావు-అన్నది తెలుసుకుంటే-నీ కళ్లు తెరుచుకుంటాయి! ఎన్నెన్ని మానవ జాతులు ఉద్భవించి అంతరించాయి. ఎన్ని వలసల తర్వాత నీ జాతి ఇప్పుడు నువ్వున్న ప్రాంతానికి చేరింది వంటి విషయాలు క్షుణ్ణంగా తెలుసుకోవాలంటే, తప్పదు-జీవ పరిణామం గురించి పూర్తిగా తెలుసుకోవాలి. ఆ భగవంతుడి సృష్టిలో నీ పుట్టుక ఒక భాగమని నువ్వింకా భావిస్తూ ఉంటే గనక, నీ మెదడులోని చీకటి తొలగిపోలేదని అర్థం. చీకట్లోనే జీవితం బాగుందనుకునే వారితో మనకు పేచీ లేదు. జీవితంలో వెలుగులు కావాలనుకునే వారు తప్పక వైజ్ఞానిక స్పృహ పెంచుకుంటారు. జీవ పరిణామం గురించి తెలుసుకుంటారు. మత మౌఢ్యాన్ని చావుదెబ్బ తీసిన డార్విన్ పరిణామ సిద్ధాంతం వెలువడిన ఆ రోజును గుర్తు చేసుకుంటారు. ప్రతి సంవత్సరం 'ఎవల్యూషన్ డే' జరుపుకుంటారు.

ఎక్కడి పాట అక్కడ పాడడం. అధికారం కోసం నానా గడ్డి కరవడం రాజకీయ నాయకులకు అలవాటు. శాస్త్రవేత్తలు అలా చేయరు. ఒక నిబద్ధతతో, నిజాయితీగా, నిజాల్ని మాత్రమే వెల్లడిస్తారు. అలాంటి వారిలో మహోన్నతుడు చార్లెస్ డార్విన్! ఆయన మతాలకున్న విలువను తగ్గించాలనుకోలేదు. మూఢ నమ్మకాల్ని నిర్మూలించగలననీ కూడా అనుకోలేదు. ఆయన ప్రతిపాదించిన సిద్ధాంతమే కాలక్రమంలో ఆ పనులు చేస్తూ వచ్చింది. అందుకే సంప్రదాయ వాదులకు డార్విన్ అన్నా, డార్విన్ సిద్ధాంతమన్నా పడదు. వారు సృష్టి/దైవ సిద్ధాంతం కావాలనుకుంటారు. ప్రస్తుతం కేంద్రంలో అధికారంలో ఉన్నవారి పాలసీ కూడా అదే! సిలబస్ నుండి 'ఎవల్యూషన్' చాప్టర్ తొలగిస్తున్నారని తెలియగానే, హైదరాబాద్‌లో పెద్దపెద్ద విద్యాసంస్థల్లో జెవివి వారు 'ఎవల్యూషన్' మీద నా లెక్చర్లు ఏర్పాటు చేశారు. నేను కూడా సంతోషంగా వెళ్ళి ఉపన్యసించి వచ్చాను. సిలబస్ నుండి తీసివేయగానే పిల్లలు ఇక ఏ రకంగానూ నేర్చుకోలేరన్న భ్రమలో ప్రభుత్వం వారుంటే- ఉండనివ్వండి. బాధ్యత గల పౌరులుగా మన పిల్లలకు మనం, ఏం నేర్పుకోవాలో మనకు తెలుసు కదా? ప్రభుత్వాలు తాత్కాలికం- వైజ్ఞానిక స్పృహే శాశ్వతం! అందువల్ల మనం, వీలైనన్ని ఎక్కువగా వైజ్ఞానిక కార్యక్రమాలు అన్ని స్థాయిల్లో నిర్వహించుకుంటూనే ఉండాలి.

(వ్యాసకర్త కేంద్ర సాహిత్య అకాడెమీ అవార్డు గ్రహీత, విశ్రాంత బయాలజీ ప్రొఫెసర్) (మెల్బోర్న్ నుంచి)

కవిత్వం

ఎన్నుకుందాం

రంగుల్ని చిక్కగా కలిపి
జెండాలుగా ఎగరేసేవాళ్ళని కాదు
మడతపడ్డ సగటు పేగుల చిక్కును
విడదీసేవాళ్ళని ఎన్నుకుందాం.

కాగితాల పడవలపై
నమ్మకాన్ని నడిపేవాళ్ళని కాదు
బతుకు గీతల చేతి రాతల్ని
చక్కగా లిఖించేవాళ్ళని ఎంచుకుందాం.

ఒట్టి మాటల మాటున
తొంగి చూసి నమ్మించేవాళ్ళని కాదు
చేతల్లో చేయూతని
జనంలోకి నెట్టేవాళ్ళని ఎన్నుకుందాం.

గల్లి గల్లీలో సమ్మగా గిల్లిపోతూ
ఖద్దరు కాంతుల్ని వెదజల్లేవాళ్ళని కాదు
నిస్సహాయతలో మూలన పడ్డ
సమాజాన్ని బతికించేవాళ్ళని ఎంచుకుందాం.

జోడింపుల చేతుల్తో గెలిచి
అదిలించేవాళ్ళని కాదు
అణగారిన వ్యవస్థకు
కాస్త ఊపిరందించేవాళ్ళని ఎన్నుకుందాం.

ఎన్నుకుందాం
కలిసి కట్టుగా నడుస్తూనే
కష్టపడే తత్వాన్ని ఎంచుకుందాం
ఓటుకు, నోటి మాటకు
కట్టుపడే వ్యక్తిత్వాన్ని ఎన్నుకుందాం.

- నరెద్దుల రాజారెడ్డి,
సెల్ : 9666016636

ఆడపిల్ల పుడితే రూ. 2 లక్షల సేవింగ్స్ బాండ్

- రాజస్థాన్‌లో బిజెపి మేనిఫెస్టో విడుదల

జైపూర్ : రాజస్థాన్ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో బిజెపి గురువారం మేనిఫెస్టోను విడుదల చేసింది. ఆడపిల్ల పుడితే రూ.2 లక్షల సేవింగ్స్ బాండ్ అందజేస్తామని, ఉజ్వల పథకం లబ్దిదారులకు గ్యాస్ సిలిండర్‌పై రూ. 450 సబ్సిడీ ఇస్తామని, 2.5 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు కల్పిస్తామని బిజెపి వాగ్దానం చేసింది. బిజెపి మేనిఫెస్టోను 'సంకల్ప పత్ర' పేరుతో ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు జెపి నడ్డా, కేంద్ర మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్, రాజస్థాన్ మాజీ ముఖ్యమంత్రి వసుంధర రాజే జైపూర్‌లో విడుదల చేశారు. రాజస్థాన్‌లో బిజెపి ప్రభుత్వం ఏర్పడితే ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో జరిగిన స్కామ్‌లపై దర్యాప్తునకు సిట్ ఏర్పాటు చేస్తామని జెపి నడ్డా హామీ ఇచ్చారు. ఆడపిల్ల పుడితే రూ. 2 లక్షల సేవింగ్స్ బాండ్ అందజేయడంతో పాటు మహిళలు, బాలికలకు అనేక కొత్త పథకాలు అమలు చేస్తామని నడ్డా వాగ్దానం చేశారు.

రాజస్థాన్‌లో గెలుపు మాదే : రాహుల్ గాంధీ

రాజస్థాన్‌లో కాంగ్రెస్ నాయకులు ఐక్యంగా ఉన్నారని, త్వరలో జరిగే ఎన్నికల్లో తమ పార్టీదే గెలుపు అని రాహుల్ గాంధీ విశ్వాసం వ్యక్తం చేశారు. జైపూర్ విమానాశ్రయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ రాజస్థాన్ ఎన్నికల్లో క్లీన్ స్వీప్ చేస్తుందని అన్నారు. తారా నగర్, నోహర్, సాదుల్‌షమర్‌లలో నిర్వహించిన బహిరంగ సభల్లో కూడా రాహుల్ ప్రసంగించారు.

రాజస్థాన్ ప్రచారంలో అస్సాం గవర్నర్

- తొలగించాలని టిఎంసి, ఆప్ డిమాండ్

గౌహతి : రాజస్థాన్‌లో బిజెపి తరపున ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న అస్సాం గవర్నర్ గులాబ్ చంద్ కటారియాను ఆ పదవి నుంచి తొలగించాలని టిఎంసి, ఆప్ డిమాండ్ చేశాయి. 'అస్సాం గవర్నర్ గులాబ్ చంద్ కటారియా రాజస్థాన్‌లోని ఉదయపూర్‌లో బిజెపి తరపున ప్రచారంలో బిజీగా ఉన్నారు. ఎన్నికల సంఘం ఆయనపై చర్యలు తీసుకోవాలి. రాజ్యాంగ పరిరక్షకుడిగా ఉన్నప్పటికీ గవర్నర్ బిజెపి తరపున ప్రచారం చేయడం సిగ్గుచేటు. ఆయనను వెంటనే ఆ పదవి నుంచి తొలగించాలి' అని టిఎంసి జాతీయ అధికార ప్రతినిధి రిపున్ బోరా గురువారం ఎక్స్‌లో పోస్ట్ చేశారు. అస్సాంలో ఆప్ విభాగం కూడా ఇలాంటే ప్రకటననే విడుదల చేసింది.

బిజెపి పాలన ఎఫెక్టు
ఖాయిలాపడ్డ మధ్యప్రదేశ్!

గుజరాత్ తర్వాత బిజెపి ఎక్కువ కాలం పాలించిన రాష్ట్రం మధ్యప్రదేశ్. 2002 నుండి ఇప్పటివరకు మధ్యలో ఏడాదిన్నర కాలం మినహా మిగిలిన కాలమంతా బిజెపి పాలనలోనే ఈ రాష్ట్రం వుంది. ఆ ఏడాదిన్నర కాలంలో ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఫిరాయింపుల ద్వారా పడగొట్టారు. అసెంబ్లీ ఎన్నికల ప్రచార సందర్భంగా, కేంద్ర హోం మంత్రి అమిత్ షా మాట్లాడుతూ, బీమారు రాష్ట్రాన్ని గత 18ఏళ్ల కాలంలో పోలికే లేని రీతిలో తీర్చి దిద్దింది బిజెపినే అని సెలవిచ్చారు.

ఇంత సుదీర్ఘ కాలం రాష్ట్రాన్ని పాలించిన తర్వాత, బిజెపి తన రికార్డును సమర్థించుకోవాల్సి వుంది. అందుకే, మధ్యప్రదేశ్ ఖాయిలా రాష్ట్రమనే ట్యాగ్‌ను పొగొట్టుకుని దేనితోనూ పోలిక లేని రాష్ట్రంగా మారిందని అమిత్ షా, నిర్మలా సీతారామన్, రాజ్‌నాథ్ సింగ్‌లే కాకుండా పలువురు బిజెపి నేతలు చెప్పుకుంటున్నారు.

బీహార్, మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్ వంటి హిందీ ప్రాంత రాష్ట్రాలకు వాటి ఆర్థిక వెనుకబాటుతనాన్ని, దిగజారిన సామాజిక సూచికలను నొక్కి చెప్పడానికి బీమారు (ఖాయిలా) ట్యాగ్‌ను జత చేస్తూ వుంటారు. బిజెపి పాలనలో రాష్ట్రం చాలా వేగంగా పురోగతిని సాధించిందని ప్రకటించడం ద్వారా మధ్యప్రదేశ్‌కు వున్న ముద్రను పోగొట్టాలని బిజెపి ప్రయత్నిస్తోంది. అయితే అసలు వాస్తవం ఏమిటి, ఎలా వుంది? మధ్యప్రదేశ్ ఆర్థిక పనితీరు దేశంలోనే అత్యంత అధ్వానంగా వుంది. 1993-94లో, తలసరి నికర రాష్ట్ర దేశీయోత్పత్తి విషయంలో 27 రాష్ట్రాల్లో మధ్యప్రదేశ్ 19వ స్థానంలో వుంది. అయితే, 2021-22కు వచ్చేసరికి కేవలం రెండు స్థానాలు మాత్రమే పైకి ఎగబాకింది. నీతి ఆయోగ్ సమాచారం ప్రకారం, రాష్ట్రంలో సగానికి పైగా జనాభా అత్యంత నిరుపేదలుగా వున్నారు. విద్యకు సంబంధించినంతవరకు చూసినట్లైతే, 2020లో ప్రాథమిక, హయ్యర్ సెకండరీ, కాలేజీ స్థాయి విద్యలో చేరిన విద్యార్థులు వంటి సూచికల్లో మొత్తం 30 రాష్ట్రాలకు గాను మధ్యప్రదేశ్ 20వ స్థానంలో వుంది. సామాజిక సూచీల్లోనూ మధ్యప్రదేశ్ ర్యాంక్ చాలా అధ్వానంగా వుంది. ఉదాహరణకు, 2019-21లో మధ్యప్రదేశ్‌లో 35.7శాతం మంది పోషకాహారం లోపంతో బాధపడుతున్న పిల్లలు వుండేవారు. మొత్తంగా 30 రాష్ట్రాలకు గాను 25వ ర్యాంక్‌లో వుంది. 2015-16, 2019-21 మధ్య కాలంలో వయసుకు తగిన బరువు లేని పిల్లల సూచికకు సంబంధించి మధ్యప్రదేశ్ రాష్ట్రం కేవలం రెండు స్థానాలు (28 నుండి 26కు) మాత్రమే పైకి ఎగబాకగలిగింది. మొత్తంగా అన్ని రంగాల్లో మధ్యప్రదేశ్ సామాజిక స్థాయి అనేది మానవ వికాస సూచీ (హెచ్‌డిఐ)లో ర్యాంక్ ద్వారా తెలుస్తోంది. 2021లో 30రాష్ట్రాల్లో ఎంపి స్థానం 27గా వుంది. సామాజిక ఆర్థిక సూచీల్లో మధ్య ప్రదేశ్ మొత్తం రాష్ట్రాల్లో దిగువ సగ భాగంలో కొనసాగుతుండడాన్ని ఏమనాలి? శివరాజ్ సింగ్ చౌహాన్ నేతృత్వంలోని మతతత్వ-కార్పొరేట్ ప్రభుత్వ తప్పుడు విధానాల ఫలితమే ఇది అని చెప్పకతప్పదు. విచక్షణారహితంగా గనుల తవ్వకాలకు అనుమతించడంతో మధ్య ప్రదేశ్‌లో సహజ వనరులు యథేచ్ఛంగా కొల్లగొట్టబడుతున్నాయి. తాజాగా ధీరౌలి బొగ్గు గనుల తవ్వకాల లీజును అదానీ గ్రూపునకు ఇచ్చారు. ఈ బొగ్గు గని 2,672 హెక్టార్లలో అంటే అడవులు, బొగ్గు క్షేత్రాలు, గ్రామాల్లో విస్తరించి వున్నాయి.



మధ్యప్రదేశ్ ఒక ప్రభుత్వ ఆసుపత్రిలో సెల్ ఫోన్ వెలుగులోనే రోగులకు చికిత్స నిర్వహిస్తున్న వైద్యుల దృశ్యం

PEOPLE'S DEMOCRACY

జాతీయ నేరాల నమోదు సంస్థ (ఎన్‌సిఆర్‌బి) గణాంకాల ప్రకారం, 2021లో మధ్యప్రదేశ్‌లో షెడ్యూల్డ్ తెగలపై అధిక సంఖ్యలో అత్యాచారాలు నమోదయ్యాయి. దేశవ్యాప్తంగా నమోదైన మొత్తం కేసుల్లో 29.8 శాతం మధ్యప్రదేశ్‌లోనే చోటు చేసుకున్నాయి. షెడ్యూల్డ్ కులాలపై జరిగిన అత్యాచారాల కేసుల్లో కూడా 14.1శాతం కేసులతో ఈ రాష్ట్రం మూడవ స్థానంలో వుంది. 2019లో ప్రస్తుత బిజెపి ప్రభుత్వం అడ్డూ అదుపు లేకుండా అనుసరిస్తున్న హిందూత్వ ఎజెండాతో మైనారిటీలపై ఏ విధంగా దాడులు చేస్తున్నదీ చూస్తున్నాం. ఇండోర్‌లో ముస్లిం వీధి వ్యాపారులపై దాడులు, ఖార్గావ్‌లో ముస్లింల ఇళ్లను ధ్వంసం చేయడం, మైనారిటీలను వేధించడం వంటివి నిత్యకృత్యంగా మారాయి. క్రైస్తవ ఆరాధనా స్థలాలను కూడా వదిలిపెట్టడం లేదు. ఇప్పటివరకు చెప్పినట్లుగా, మధ్యప్రదేశ్‌లోని మతతత్వ- కార్పొరేట్ ప్రభుత్వ స్వభావం రాష్ట్ర వ్యవహారాలన్నీ నాశనమవడానికి మాత్రమే దారి తీసింది. మతోన్మాదమనే వ్యాధితో బాధపడుతున్న సమాజంగా వుంది. దళితులు, ఆదివాసీలు, మైనారిటీల అణచివేత ద్వారా ఇది స్పష్టంగా కనిపిస్తోంది. ప్రజల్లో తీవ్ర అసంతృప్తికి కారణమవుతున్న ఈ ప్రభుత్వ పనితీరుపై ప్రజలిచ్చే తీర్పు శుక్రవారం జరిగే పోలింగ్‌లో ప్రతిబింబిస్తుందని ఆశిద్దాం.

నేడు రెండు రాష్ట్రాల్లో పోలింగ్

మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ ఎన్నికల నిర్వహణకు సర్వం సిద్ధం

న్యూఢిల్లీ : మధ్యప్రదేశ్ , ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో శుక్రవారం పోలింగ్ జరగనుంది. ఇక్కడ ఎన్నికల నిర్వహణకు రెండు రాష్ట్రాల ఎన్నికల అధికారులు సర్వం సిద్ధం చేశారు. ఛత్తీస్‌గఢ్‌లో ఇది రెండో విడత పోలింగ్. మధ్యప్రదేశ్‌లో ఈసారి ఉత్కంఠభరితమైన పోటీ నెలకొంది. ఇక్కడ కాంగ్రెస్, బిజెపిల మధ్యే ప్రత్యక్ష పోటీ నెలకొంది. మధ్యప్రదేశ్‌లో 230 అసెంబ్లీ స్థానాలకు జరిగే పోలింగ్ ఉదయం 7 గంటలకు ప్రారంభమై సాయంత్రం 6 గంటల వరకు కొనసాగుతుంది. ఇక్కడ మొత్తం ఓటర్ల సంఖ్య 5.6 కోట్లు. వీరిలో పురుష ఓటర్ల సంఖ్య 2.88 కోట్లు. మహిళా ఓటర్లు 2.72 కోట్లు. రాష్ట్రంలో తొలిసారిగా మొత్తం 22.36 లక్షల మంది యువత ఓటు వేయనున్నారు. 2,533 మంది అభ్యర్థులు పోటీపడుతున్నారు.

ఛత్తీస్‌గఢ్‌లోనూ..

ఛత్తీస్‌గఢ్‌లో 90 అసెంబ్లీ స్థానాల్లో 20 స్థానాలకు మొదటి విడతలో నవంబర్ 7న పోలింగ్ జరిగింది. తుదివిడతగా మిగిలిన 70 స్థానాలకు శుక్రవారం పోలింగ్ జరగనుంది. ఈ ఎన్నికల్లో మొత్తం 958 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. ఇందులో 827 మంది పురుష అభ్యర్థులు కాగా 130 మంది మహిళా అభ్యర్థులు పోటీలో ఉన్నారు. అలాగే ఒక థర్డ్ జెండర్ అభ్యర్థి కూడా బరిలో నిలిచారు.

రెండో విడత పోలింగ్‌కు రాష్ట్రంలోని కోటి 63 లక్షల 14 వేల 479 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. వీరిలో 81 లక్షల 41 వేల 624 మంది పురుష ఓటర్లు, 81 లక్షల 72 వేలా 171 మంది మహిళా ఓటర్లు, 684 మంది థర్డ్ జెండర్ ఓటర్లు ఉన్నారు. ఓటింగ్ సజావుగా సాగేందుకు మొత్తం 18 వేల 833 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. వీటిలో 700 సంగ్వారీ పోలింగ్ కేంద్రాలు కూడా తయారు చేయబడ్డాయి, ఇక్కడ మహిళా పోలింగ్ సిబ్బందిని మాత్రమే ఉంచుతారు. ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు సహకరించాలని అధికారులు కోరారు. పోలింగ్ కేంద్రాలకు అవసరమైన ఇవిఎంలు సహా అన్ని ఏర్పాట్లు పూర్తయినట్టు అధికారులు తెలిపారు. డిసెంబర్ 3న ఓట్ల లెక్కింపు జరగనుంది.



నిజాయితీపరులకే పట్టం కట్టండి

- ప్రజాసమస్యలపై పోరాడే తమ్మినేనికే ఓట్లు వేయండి
- పాలేరు ఎన్నికల ప్రచారంలో పి మధు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఈ నెల 30న జరిగే తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో నిజాయితీపరులకే పట్టం కట్టాలని, అనునిత్యం ప్రజా సమస్యలపై పోరాడే తమ్మినేనిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని సిపిఎం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పూర్వ కార్యదర్శి, మాజీ ఎంపి పి మధు కోరారు. పాలేరు సిపిఎం అభ్యర్థి తమ్మినేని వీరభద్రం విజయాన్ని కాంక్షిస్తూ ఖమ్మం రూరల్ మండలంలోని ఏదులాపురం గ్రామంలో గురువారం నిర్వహించిన ఎన్నికల ప్రచరంలో ఆయన పాల్గొన్నారు. ఏదులాపురం, ఆదిత్యనగర్, ఓరుగంటి నగర్, వెంపటి నగర్, సింహాద్రి నగర్, మారుతీ నగర్, ఆటో నగర్, సాయి బృందావనం కాలనీల్లో రోడ్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా మధు మాట్లాడుతూ పాలేరు నియోజకవర్గంలో బిఆర్ఎస్, కాంగ్రెస్ అభ్యర్థులు బడా కాంట్రాక్టర్లు కావడంతో డబ్బు సంచులతో ప్రజలను ప్రలోభ పెట్టి గెలిచేందుకు వస్తున్నారని అన్నారు. అలాంటి వారి మాయమాటలను నమ్మి ప్రజలు మోసపోవద్దని విజ్ఞప్తి చేశారు. తమ్మినేని 50 ఏళ్ల నుంచి పట్టిన ఎర్ర జెండాను విడవని నిజాయితీపరుడని, అలాంటి వ్యక్తికి మీ అమూల్యమైన ఓటు వేయాలని కోరారు. సిపిఐ సోదరులు ఆలోచించి ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. తోటి సోదర వామపక్ష రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని పాలేరు నుంచి పోటీ చేస్తున్నారని, మీ ఓట్లు ఆయనకు వేయాలని సిపిఐ శ్రేణులను కోరారు.. సిపిఎం పాలేరు అభ్యర్థి తమ్మినేని వీరభద్రం మాట్లాడుతూ వామపక్ష సోదరులు, అభ్యుదయవాదులు, లౌకిక శక్తులు సుత్తి కొడవలి నక్షత్రంపై ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. తన విజయాన్ని కాంక్షిస్తూ ఈ నెల 25న ఎం వెంకటాయపాలెంలో జరిగే బహిరంగ సభకు సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి వస్తున్నారని, మండలంలోని వామపక్ష శక్తులు ఈ సభకు హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో పాలేరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి బండి రమేష్, షేక్ బషీరుద్దీన్, మండల కార్యదర్శి నండ్ర ప్రసాద్, మండల ఇన్‌చార్జి ఊరడి సుదర్శన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జిన్‌పింగ్ నియంతే ! : బైడెన్ మళ్లీ అదే పాట

వూడ్‌సైడ్ : చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ నియంతేనంటూ అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ గురువారం పాత పాటే పాడారు. ఆ విషయంలో తన అభిప్రాయాన్ని మార్చుకోలేనని తెలిపారు. ఇరువురు నేతలు సుదీర్ఘంగా ముఖాముఖి చర్చలు జరిపిన కాసేపటికే బైడెన్ ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం. జిన్‌పింగ్‌తో సమావేశం ముగిసిన కొద్ది గంటల తర్వాత బైడెన్ విడిగా పత్రికా సమావేశం నిర్వహించారు. జిన్‌పింగ్‌ను ఇంకా నియంతగానే భావిస్తున్నారా అని ఒక విలేకరి ప్రశ్నించగా, ఆయన పైవిధంగా స్పందించారు. మన ప్రభుత్వానికి పూర్తి భిన్నమైన కమ్యూనిస్టు దేశాన్ని పాలిస్తున్న వ్యక్తి ఆయన, అందువల్ల ఆయన నియంతే అని వ్యాఖ్యానించారు.

తీవ్రంగా ఖండించిన చైనా

బైడెన్ వ్యాఖ్యలను చైనా విదేశాంగ మంత్రిత్వ శాఖ తీవ్రంగా ఖండించింది. బైడెన్ పేరును ప్రస్తావించకుండానే ఖండన వెలువడింది. 'ఈ ప్రకటన ఆక్షేపణీయం, అభ్యంతరకరమే కాదు అత్యంత బాధ్యతారాహిత్యం, రాజకీయ వక్రీకరణలతో కూడుకున్నది' అని చైనా విదేశాంగ శాఖ ప్రతినిధి మావో నింగ్ గురువారం విలేకర్లతో వ్యాఖ్యానించారు. కొంతమంది ఎప్పుడూ దుష్ట ఆలోచనలతోనే వుంటారని బైడెన్‌ను ఉద్దేశించి అన్యాపదేశంగా పేర్కొన్నారు.

గాజాలో యుద్ధాన్ని ఆపండి

- ఆసియాన్ రక్షణ మంత్రుల పిలుపు

జకార్తా : తక్షణమే గాజాలో యుద్ధాన్ని ఆపాల్సిందిగా ఆసియాన్ దేశాల రక్షణ మంత్రులు పిలుపునిచ్చారు. గాజాలో మానవతా సాయం అందించేందుకు కారిడార్‌లను ఏర్పాటు చేయడంపై ప్రపంచ దేశాలు పరస్పరం సహకరించుకోవాలని కోరారు. మయన్మార్‌లో సుదీర్ఘంగా కొనసాగుతున్న అంతర్యుద్ధాన్ని ఎలా ఎదుర్కొనాలనే విషయంలో ఒక అభిప్రాయానికి రాలేకపోయారు. దక్షిణ చైనా సముద్రంలో నౌకల రాకపోకల స్వేచ్ఛను పాటించాల్సిన ప్రాముఖ్యతను ఇక్కడ జరుగుతున్న ఆసియాన్ దేశాల రక్షణ మంత్రుల సమావేశం పునరుద్ఘాటించింది. వివాదాస్పద జలాల్లో ఘర్షణలను నివారించేందుకు అంతర్జాతీయ నిబంధనలు గౌరవించాలని కోరింది. ఈ మేరకు సంయుక్త డిక్లరేషన్‌ను వెలువరించింది.

10 దేశాలు సభ్యులుగా వున్న ఆసియాన్‌లో మయన్మార్ కూడా వున్నా, ఆ దేశ రక్షణ మంత్రిని ఈ వారం సమావేశాలకు రాకుండా నిషేధించారు. మయన్మార్‌లో హింసను అణచివేసేందుకు రూపొందించిన ఐదు పాయింట్ల శాంతి ప్రణాళికకు అనుగుణంగా వ్యవహరించడంలో మిలటరీ ప్రభుత్వం విఫలమైందని పేర్కొంది. మయన్మార్‌లో పరిస్థితులు క్షీణించడం పట్ల విచారం వ్యక్తం చేసింది. శాంతియుత, శాశ్వత పరిష్కారం కనుగొనేందుకు మయన్మార్‌కు మద్దతు ఇవ్వాల్సిందిగా ఆసియాన్ దేశాలను ఇండోనేషియా కోరింది.

అత్యవసర మానవతాసాయం అందించండి

ఎట్టకేలకు తీర్మానాన్ని ఆమోదించిన భద్రతామండలి

ఐక్యరాజ్య సమితి : గత నెల రోజులకు పైగా సాగుతున్న ఇజ్రాయిల్ యుద్ధంపై తీర్మానాన్ని ఆమోదించడంలో నెలకొన్న ప్రతిష్టంభనను ఎట్టకేలకు భద్రతా మండలి అధిగమించగలిగింది. ఎలాంటి ఆటంకం లేకుండా అత్యవసరమైన మానవతా సాయాన్ని బాధితులకు అందించేందుకు వీలుగా గాజాలో మానవతా కారిడార్‌లను ఏర్పాటు చేయాలని పిలుపునిస్తూ భద్రతా మండలి తీర్మానాన్ని ఆమోదించింది.

గాజాలోని బాధితులకు ఆహారం, మందులు, ఇతర సామగ్రిని అందజేసేందుకు వీలుగా ఆటంకాలు తొలగించి, మార్గాలను తెరవాలని కోరుతూ ఐరాస భద్రతా మండలి ఓ తీర్మానాన్ని ఆమోదించింది. పదిహేను మంది సభ్యులుండే భద్రతా మండలిలో 12 మంది ఈ తీర్మానానికి అనుకూలంగా ఓటు వేయగా అమెరికా, బ్రిటన్, రష్యా గైర్హాజరయ్యాయి.

హమస్ జరిపిన దాడులను ఖండించడంలో తీర్మానం విఫలమైందని ఆరోపిస్తూ అమెరికా, బ్రిటన్ ఓటింగ్‌కు దూరంగా ఉన్నాయి. మానవత్వంతో కాల్పుల విరమణ పాటించాలని తీర్మానం కోరనందుకు నిరసనగా రష్యా ఓటింగ్‌కు గైర్హాజరైంది. తీర్మానంలో సవరణ చేసేందుకు ఓటింగుకు ముందు రష్యా చేసిన ప్రయత్నం ఫలించలేదు. బందీలుగా ఉంచిన వారిని తక్షణమే బేషరతుగా విడుదల చేయాలని తీర్మానం కోరింది. యూరప్ దేశమైన మాల్టా తీర్మానాన్ని ప్రవేశపెట్టింది. 'మేము ఈ రోజు సాధించింది ముఖ్యమైన తొలి చర్య' అని ఐరాసలో మాల్టా రాయబారి ఫ్రాజియర్ వ్యాఖ్యానించారు. ఈ యుద్ధంలో అనేక అంతర్జాతీయ చట్టాలు ఉల్లంఘనకు గురవుతున్నాయని, దీనిపై దర్యాప్తు జరిపించాలని ఐరాస మానవ హక్కుల అధిపతి వాల్కర్ టర్క్ కోరారు.



భద్రతా మండలి సమావేశంలో ఓటింగ్ దృశ్యం

బుల్డోజర్లతో ఆస్పత్రి ఎంట్రన్స్ ధ్వంసం

గాజాలోని అతి పెద్ద ఆస్పత్రి షిఫా దక్షిణ ప్రాంత ప్రవేశ ద్వారాన్ని ఇజ్రాయిల్ దళాలు బుల్‌డోజర్లతో ధ్వంసం చేశాయని పాలస్తీనా ఆరోగ్య మంత్రిత్వ శాఖ గురువారం తెలిపింది. నలభై రోజులుగా జరుగుతున్న యుద్ధంలో ఇజ్రాయిల్ దళాలు ప్రధానంగా ఈ ఆస్పత్రినే లక్ష్యంగా చేసుకొని దాడులు చేస్తున్నాయి. ఈ దాడిని సౌదీ అరేబియా తీవ్రంగా ఖండించింది. షిఫా ఆస్పత్రిలో చేపట్టిన గాలింపు చర్యల్ని కొనసాగిస్తామని గాజాలో ఇజ్రాయిల్ సైనిక కార్యకలాపాలు నిర్వహిస్తున్న దళాల అధిపతి మేజర్ జనరల్ యారన్ ఫింకెల్‌మాన్ చెప్పారు.

హృదయవిదారకమైన దృశ్యాలు

ఇజ్రాయిల్ దళాలు బుధవారం ఈ ఆస్పత్రిలో ప్రవేశించడానికి ముందు లోపల 2,300 మంది రోగులు, సిబ్బంది, నిరాశ్రయులైన పౌరులు ఉన్నారని ఐరాస సంస్థలు అంచనా వేశాయి. ముసుగులు ధరించిన కొందరు ఇజ్రాయిల్ సైనికులు గాలిలోకి కాల్పులు జరిపారని, లొంగిపోవాల్సిందిగా యువతను ఆదేశించారని లోపల చిక్కుకుపోయిన ఓ పాత్రికేయుడు తెలిపారు. ఇజ్రాయిల్ సైనికులు కొందరు పాలస్తీనియన్లను నగ్నంగా నిలబెట్టి ఆయుధాలు, పేలుడు పదార్థాల కోసం తనిఖీలు చేశారని ఆయన చెప్పారు. ఆస్పత్రి లోపల పరిస్థితి హృదయవిదారకంగా ఉన్నదని ప్రత్యక్షసాక్షులు చెబుతున్నారు. మత్తుమందు ఇవ్వకుండానే శస్త్ర చికిత్సలు చేస్తున్నారు. ఆహారం, నీరు లభించక రోగుల బంధువులు కారిడార్లలో ఇబ్బందులు పడుతున్నారు. ఇదిలా వుండగా హమాస్‌ను పూర్తిగా నాశనం చేసే వరకూ ఇజ్రాయిల్ యుద్ధం ఆగదని అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ పేర్కొన్నారు.

న్యూస్‌క్లిక్ కేసులో సింగంకు సమన్లు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో: ఆన్‌లైన్ న్యూస్ పోర్టల్ న్యూస్‌క్లిక్ కేసులో అమెరికన్ మిలియనీర్ నెవిల్లే రాయ్ సింగంకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) సమన్లు జారీ చేసింది. మోడీ నేతృత్వంలోని మతతత్వ-కార్పొరేట్ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎత్తి చూపుతున్నందుకు న్యూస్‌క్లిక్ ఎడిటర్ ప్రబీర్ పుర్కాయస్థ, హెచ్‌ఆర్ విభాగం అధిపతి అమిత్ చక్రవర్తిలను అరెస్టు చేసి రాజ ద్రోహ నేరం కింద అక్రమ కేసు బనాయించింది. న్యూయార్క్ టైమ్స్ ప్రచురించిన ఓ కట్టు కథను సాకుగా చూపి న్యూస్‌క్లిక్ గొంతు నొక్కాలని చూస్తున్నది. ఆ వెబ్ పోర్టల్ ఆస్తులను జప్తు చేసింది. ఇప్పుడు మనీలాండరింగ్ చట్టం కింద భారత విదేశాంగ శాఖ ద్వారా చైనాలోని షాంఘైలో ఉన్న నెవిల్లే రాయ్ సింగంకు నోటీసులు పంపింది. ఆయన వాదనలు రికార్డు చేసేందుకు ఢిల్లీ కోర్టు అనుమతించిన నేపథ్యంలో ఇడి రెండోసారి సమన్లు జారీ చేసింది. న్యూస్‌క్లిక్ వివాదంలో తనపై వచ్చిన ఆరోపణలను నెవిల్లే ఇప్పటికే ఖండించారు. చైనా నుంచి నిధులు అందుతున్నాయనే ఆరోపణలతో 2021 సెప్టెంబరులో న్యూస్‌క్లిక్ కార్యాలయాలపైన, సిబ్బంది ఇళ్లపైన ఇడి మూకుమ్మడి దాడులు జరిపింది. అక్రమ అరెస్టు, కేసులు కొట్టివేయాలని ప్రబీర్ పుర్కాయస్థ దాఖలు చేసిన పిటిషన్ ప్రస్తుతం సుప్రీంకోర్టులో విచారణలో ఉంది.

కార్మికుల వెలికితీతకు మరో రెండు, మూడు రోజులు

డెహ్రాడూన్ : ఉత్తరాఖండ్‌లో నిర్మాణంలో ఉన్న సొరంగం కూలిపోయిన ప్రమాదం నుంచి కార్మికుల వెలికితీతకు మరో రెండు, మూడు రోజులు పట్టనుంది. ఈ విషయాన్ని సహాయ కార్యక్రమాల్లో పాల్గొంటున్న నిపుణులు గురువారం వెల్లడించారు. ఉత్తరకాశీ జిల్లాలోని బ్రహ్మఖల్-యమునోత్రి జాతీయ రహదారిపై సిల్క్యారా, దండల్‌గావ్ మధ్య నిర్మాణంలో ఉన్న సొరంగంలో కొంతభాగం ఆదివారం తెల్లవారు జామున కుప్పకూలడంతో 40 మంది కార్మికులు సొరంగంలో చిక్కుకున్న సంగతి తెలిసిందే. వారి వెలికితీతకు సహాయక కార్యక్రమాలు ఐదో రోజైన గురువారం కూడా కొనసాగాయి. అమెరికా నుంచి వచ్చిన 'ఆగర్' అనే యంత్రాన్ని గురువారం నుంచి డ్రిల్లింగ్‌లో వినియోగించడం ప్రారంభించారు. ఇప్పటి వరకూ డ్రిల్లింగ్ కోసం ఉపయోగించిన యంత్రాలు విఫలం కావడంతో కొత్త యంత్రాన్ని సిబ్బంది రప్పించారు. ఈ యంత్రంతో గంటకు 5 నుంచి 10 మీటర్ల చొప్పున డ్రిల్లింగ్ చేయవచ్చునని సిబ్బంది తెలిపారు. గురువారం సహాయక కార్యక్రమాలను కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖ సహాయ మంత్రి వికె సింగ్ పరిశీలించారు.

ఘూద్రి ఉద్యమ వారసత్వాన్ని దేశ నలుమూలలకు తీసుకెళ్తాం : సిపిఎం

జలంధర్ : ఘాద్రి ఉద్యమ వారసత్వాన్ని సిపిఎం దేశ నలుమూలలకు తీసుకు వెళుతుందని ఆ పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు నీలోత్పల్ బసు తెలిపారు. లాహోర్‌లోని సెంట్రల్ జైలులో 1915 నవంబర్ 16న ఏడుగురు ఘాద్రి వీరులకు ఉరిశిక్ష విధించారు. వారి ప్రాణత్యాగాన్ని స్మరించుకుంటూ సిపిఎం పంజాబ్ రాష్ట్ర కమిటీ గురువారం భారీ సదస్సు నిర్వహించింది. ఈ సదస్సులో నీలోత్పల్ బసు మాట్లాడుతూ, ఘాద్రి విప్లవకారుల, స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాల వారసత్వాన్ని దేశంలోని ప్రతి పల్లెకు, పట్టణానికి తీసుకెళ్లాలని సిపిఎం కేంద్ర కమిటీ నిర్ణయించినట్లు తెలిపారు. కాలాపానీ అని పిలిచే అండమాన్-నికోబార్‌లోని జైలుకు వెళితే అక్కడ విప్లవకారుల జాబితా ఉందని, జాబితాలో ఎక్కువ మంది పంజాబీలు, బెంగాలీలు ఉన్నారని చెప్పారు. స్వాతంత్ర్య పోరాటంలో గదర్ ఉద్యమం ఆదర్శప్రాయమైన పాత్రను పోషించింది. వీరంతా గొప్ప గొప్ప త్యాగాలు చేశారు' అని నీలోత్పల్ బసు గుర్తు చేశారు. ఫాసిస్ట్ ఇజ్రాయిల్ సాగిస్తున్న హంతక దాడులకు వ్యతిరేకంగా, పాలస్తీనియన్లకు సంఘీభావంగా ప్రతి ఒక్కరూ నిలబడాలని ఆయన పిలుపునిచ్చారు.



ఘాద్రి అమరవీరుల నివాళి సభలో ప్రసంగిస్తున్న నీలోత్పల్ బసు

సిపిఎం పంజాబ్ రాష్ట్ర కార్యదర్శి సుఖ్వీందర్ సింగ్ సెఖోన్ మాట్లాడుతూ ఘాద్రి విప్లవకారుల వారసత్వాన్ని పంజాబ్‌లోని ప్రతి మూలకు తీసుకెళ్లాలని పార్టీ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. దేశ సమైక్యత, సమగ్రత కోసం గదర్ వీరుల స్ఫూర్తితో మతతత్వ శక్తులకు వ్యతిరేకంగా పోరాడాలని ప్రజలకు పిలుపునిచ్చారు.

లాహోర్‌లోని సెంట్రల్ జైలులో 1915 నవంబర్ 16న లాహోర్ కుట్ర కేసు ఆరోపణలతో కర్తార్ సింగ్ సరభా, విష్ణు గణేష్ పింగెల్, సురైన్ సింగ్ సీనియర్, సురైన్ సింగ్ జూనియర్, బక్షిష్ సింగ్, జగత్ సింగ్, హర్నామ్ సింగ్ సియాల్కోటిలను అప్పటి బ్రిటీష్ ప్రభుత్వం ఉరి తీసింది. ఈ కేసులో 291 మందిపై అభియోగాలు మోపింది. వీరిలో 42 మందికి మరణశిక్ష విధించారు. 114 మందికి జీవిత ఖైదు, 93 మందికి వివిధ రకాల జైలు శిక్షలు అమలు చేశారు.





మీ కోసం

గడ్డ కట్టిన నెయిల్ పాలిష్ సీసాని మరిగే నీళ్లలో కొద్దిసేపు ఉంచితే పాలిష్ తిరిగి కరుగుతుంది.

జీవన సౌరభం

అజ్ఞానం కన్నా నిర్లక్ష్యమే ఎక్కువ నష్టాన్ని కలిగిస్తుంది.

మన తెలుగు



తేనెల తొలకరి తెలుగు
వెన్నెల ఝరి తెలుగు
మల్లెల పరిమళం తెలుగు
అమ్మ ప్రేమామృతం తెలుగు

జాతీయాల సంపద తెలుగు
పొడుపు కథల విడుపు తెలుగు
సామెతల చమత్కారం తెలుగు
శతక పద్యాల వెలుగు తెలుగు

త్యాగయ్య కృతులలో తెలుగు
అన్నమయ్య కీర్తనలలో తెలుగు
అమ్మ గోరుముద్దలలో తెలుగు
ఆనందాల వెలుగు తెలుగు

అమృతం కురిపించిన తిలక్ కలం తెలుగు
చైతన్యం రగిలించే శ్రీ శ్రీ కవనం తెలుగు
జంధ్యాల నవ్వుల పువ్వులు తెలుగు
సినారె గజల్ మెరుపులు తెలుగు


నాగావళి వంశధార పరవళ్ళు తెలుగు
మొల్ల రామాయణమే తెలుగు
పోతన భాగవతమై తెలుగు
కాకతీయ రుద్రమ్మ పౌరుషం తెలుగు
అల్లూరి ధైర్య వచనాలు తెలుగు
తిమ్మరుసు ధీయుక్తి తెలుగు
ఎంకి నాయుడు పాటలు తెలుగు

నా తెలుగు... మన తెలుగు
అణువణువు అమృతాల మణుగు

– మొర్రి గోపి,
88978 82202

సరైన పదాలు రాయండి

పిల్లలూ, ఇక్కడ కొన్ని పండ్ల బొమ్మలు ఇచ్చాం. పక్కనే ఉన్న గళ్లల్లో ఆంగ్లంలో వాటిని ఏమంటారో రాయండి. క్లూ ఆధారంగా రాయాలి మరి!



నేను గీసిన బొమ్మ





పి ఆనంద్
1వ తరగతి,
విజ్ఞాన్ హైస్కూల్, మార్కాపూర్.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com



'వైతాళిక'తో కళాకారులకు ప్రోత్సాహం

మరుగున పడిపోతున్న కళలు, కళాకారులను ప్రోత్సహించే వారు చాలా అరుదుగా కనిపిస్తుంటారు. అటువంటి బాటలో హైద్రాబాద్‌కు చెందిన పదిహేడేళ్ల అమ్మాయి ప్రీతిక పవిరాల చేస్తున్న కృషి తెలిస్తే మాత్రం ఆశ్చర్యపోతాం. యుక్త వయసు పిల్లలు సోషల్ మీడియాలో చాలా చురుకుగా ఉంటారు. కొంత అభిరుచి ఉన్న వారైతే కళలు, కళాకారులు పెట్టే పోస్టులను, ఫొటోలను ఇష్టపడుతూ, షేర్ చేస్తూ తమ మద్దతు తెలియజేస్తారు. కానీ ప్రీతిక అంతటితో ఊరుకోలేదు.

ఐదేళ్ల క్రితమే ప్రీతిక కుటుంబం అమెరికా నుంచి భారత్‌కి చేరింది. కళల పట్ల మక్కువ ఉన్న ప్రీతిక కూచిపూడి నృత్యం, సంగీతం పట్ల చిన్నప్పటి నుండే ఆసక్తి పెంచుకుంది. అలా అమెరికాలో పుట్టి పెరిగినా, తెలుగు సంస్కృతి, సాంప్రదాయాలను ఒంటబట్టించుకుంది. స్కూల్లో డ్యాన్స్ కాంపిటీషన్స్‌ను లీడ్ చేసిన అనుభవం ఉంది.

'నేను 11 ఏళ్లుగా నృత్య ప్రదర్శనలు ఇస్తున్నాను. 10 స్టేజ్ షోలలో పాల్గొన్నాను. 2000కి పైగా నృత్య ప్రదర్శనలు ఇచ్చాను. ఇంత చేసినా ఇప్పుడు చేస్తున్న కృషే ఎక్కువ సంతృప్తినిస్తోంది' అంటున్న ప్రీతిక హైద్రాబాద్‌కు వచ్చిన తరువాత ఓ అనాథ శరణాలయాన్ని సందర్శించింది. అక్కడ ఓ డ్యాన్స్ ప్రదర్శన చేసింది. ఆమెతో పాటు అక్కడి పిల్లలు కూడా డ్యాన్స్ చేశారు. 'వారంతా అనాథలు, వాళ్లెలా నృత్య సాధన చేశారు' అన్న ఆలోచన ఆమెను మరింత దురాలోచన చేసేలా పురికొల్పింది. అవగాహన ఉన్న అనాథ శరణాలయాల్లో విద్య, సంరక్షణతో పాటు కళలను సాధన చేయిస్తారు. అదే అవకాశాలు లేని చోట.. అక్కడ ఉన్నవారికి కళల పట్ల ఆసక్తి ఉన్నా, సాధన చేసే వీలు ఉండదు. అటువంటి వారిని వెలుగులోకి తీసుకురావాలి. అప్పుడే నిజమైన కళాకారులు బయటికి వస్తారు' అని ఆలోచించింది. కానీ, ఆ దిశగా అడుగులు వేయడం ఎలా?

'వైతాళిక' ఇలా మొదలైంది!


కళ పట్ల అభిమానం అయితే ఉంది. కానీ కళలను, కళాకారులను ప్రోత్సహించడం సవాలుతో కూడుకున్న పని. అయినా వెనుకంజ వేయలేదు. 'వైతాళిక' పేరుతో ఒక సంస్థను స్థాపించి, ఆసక్తి ఉన్న తన ఈడు వారందరినీ అందులో భాగస్వామ్యం చేసింది. గ్రామీణ కళలు, కళాకారులను వెతికి పట్టుకుంటోంది. బృందాలు, బృందాలుగా అనాథ శరణాలయాలకు వెళుతోంది. అక్కడ ఔత్సాహిక కళాకారులతో ప్రదర్శనలు ఇప్పిస్తూ, ఆసక్తి ఉన్న వారికి నేర్పిస్తామని చెబుతుంది. కళ పట్ల ప్రేమ ఉన్న విద్యార్థులు ముందుకు వస్తే వారు సాధన చేసే వీలుగా ఓ టీచర్‌ని నియమిస్తోంది. ఇలా గతేడాది అక్టోబరులో ప్రారంభించిన 'వైతాళిక' సేవలు ఇప్పటివరకు ఐదు గ్రామాలకు చేరాయి. 250 మంది గ్రామీణ మహిళా కళాకారులు, ఐదు అనాథశరణాలయాల భాగస్వామ్యంతో 300 మంది



అనాథ పిల్లలు సాంస్కృతిక కళల్లో తర్ఫీదు పొందుతున్నారు. నిష్ణాతులైన శిక్షకులతో వారికి శిక్షణ ఇప్పిస్తోంది. సోషల్‌మీడియాలో ఆ కార్యక్రమాలను పోస్టు చేస్తూ దేశవ్యాప్తంగా అభిమానులను సంపాదించుకుంటోంది.

సవాళ్లు ఎదురయ్యాయి

'దక్షిణాసియా సాంస్కృతిక కళలను ప్రోత్సహించడమే



లక్ష్యంగా 'వైతాళిక' పనిచేస్తోంది. విదేశాల్లో ఉన్న నా స్నేహితుల ద్వారా భారత్, యుఎస్‌లో ఆరు బ్రాంచీలు ప్రారంభించి నిధులు సేకరించాను. 100 మందిని వాలంటీర్లుగా చేర్చుకున్నాను. మొట్టమొదటిసారే రూ.3 లక్షల సొమ్ము వచ్చింది. ఆ మొత్తం, ఎంతో ప్రోత్సాహాన్నిచ్చింది. మరుగున పడిపోతున్న గ్రామీణ కళలను ఉద్ధరిస్తున్నానని చాలామంది నాకు మద్దతుగా నిలుస్తున్నారు. అలాగే ఆసక్తి ఉండి అవకాశాలు లేని వారిని ప్రోత్సహిస్తున్నానని అభినందిస్తున్నారు. మొదట్లో టీచర్ల కొరత వుండేది. వాళ్ల అడిగినంత వేతనాలు ఇవ్వలేకపోయేవాళ్లం. ఈ సమస్య చాలారోజులు నన్ను బాధించింది. ఆ తరువాత కొంతమంది స్వచ్ఛందంగా ముందుకువచ్చారు.

అప్పుడే అనుకున్నాను

హైద్రాబాద్‌కు వచ్చిన తొలి రోజుల్లో అనాథ శరణాలయాల్లో నృత్య ప్రదర్శనలో ఇచ్చాను. ఓ చోట నాతో పాటు అక్కడి పిల్లలు కూడా డ్యాన్స్ చేశారు. ఆ తరువాత శిల్పారామం సందర్శించినప్పుడు అక్కడ గ్రామీణ కళాకారుల అద్భుత ప్రతిభ చూశాక, కళల పట్ల మక్కువ ఉన్న నిరుపేద వ్యక్తులకు నా వంతు మద్దతు ఇవ్వాలని నిర్ణయించుకున్నాను. అలా 'వైతాళిక'కి బీజం పడింది. అనాథ శరణాలయాల గురించి కొంతమందికైనా అవగాహన ఉంటుంది. కానీ గ్రామాల్లో ఉన్న కళాకారుల గురించి ఎవరికీ తెలియదు. ఇంటర్‌నెట్ ఉన్నా వాళ్ల సమాచారం దొరకదు. అందుకే మా బృందాలు గ్రామాల చుట్టుపక్కల ఉన్న స్వచ్ఛంద సంస్థలను కలుస్తాము. వాళ్ల దృష్టికి వచ్చిన కళాకారుల వివరాలు తెలుసుకుని ఆయా గ్రామాలకు వెళుతున్నాం. వాళ్ల ఆసక్తి తెలుసుకుని ప్రోత్సహిస్తున్నాం. ఇదంతా



ఒక్కరోజులో జరగదు. వారాలు, నెలల తరబడి పనిచేయాల్సి వుంటుంది. ఈ కార్యక్రమాల్లో మా బృందం శక్తివంచన లేకుండా కృషి చేస్తుంది' అంటూ తన ప్రయాణం గురించి ప్రీతిక చెబుతోంది.

కళాకారులకు సాధికారత కల్పించాలన్న లక్ష్యంతో ముందుకు వెళుతున్న ప్రీతికకు మొదట్లో ఎన్నో అడ్డంకులు ఎదురయ్యాయి. నిధులు, టీచర్లు, కళాకారులను వెతికి పట్టుకోవడం కంటే, 'చిన్న వయసులో ఇంత పెద్ద పని చేస్తున్నావా' అంటూ ప్రతికూల వాతావరణం ఎదురైంది. ఎంతోమంది నుండి అనేక సందేహాలను ఎదుర్కొంది. కానీ కళ పట్ల ప్రేమ, కళాకారులను సాధికారత కల్పించాలన్న ఆమె అంకితభావానికి కుటుంబం, స్నేహితులు అండగా నిలబడ్డారు. వారిచ్చిన మద్దతుతో ఈ కార్యక్రమాన్ని మరింత ముందుకు తీసుకెళ్తానని నమ్మకంగా చెబుతోంది. ఆమె సంకల్పం ఎంతోమంది కళాకారులకు కొండంత చేయూతనివ్వాలని మనమూ ఆశిద్దాం.

ఇదే కాకుండా ఇస్కారా పేరుతో సంస్కృతి–ఆధారిత చర్మసంరక్షణ సామాజిక సంస్థకు ప్రీతిక సహ వ్యవస్థాపకురాలిగా ఉంది. అలాగే 7 కప్స్ అనే మానసిక ఆరోగ్య వెబ్‌సైట్ కమ్యూనిటీ మెంటార్‌గా ఉంది. ఈ రోజుల్లో ఎంతోమంది యుక్తవయసు పిల్లలు ఎన్నో అపోహలకు లోబడి జీవితాలను దుర్భరం చేసుకోవడం చూస్తున్నాం. వారందరికీ భిన్నంగా ప్రీతిక అనుసరిస్తున్న మార్గం ఎంతో అభినందనీయం.

అశ్రునివాళి



స్వాతంత్ర్య సమరయోధుడు, పీడిత ప్రజల నేత ఎన్ శంకరయ్య భౌతికకాయానికి చైన్నెలో బసంత్ నగర్ స్మశానవాటిక వద్ద గురువారం నిర్వహించిన అంత్యక్రియలకు హాజరైన నేతలు, అభిమానులు

వన్డే ప్రపంచకప్
ఫైనల్లో ఆస్ట్రేలియా

- సెమీస్‌లో దక్షిణాఫ్రికాపై మూడు వికెట్ల తేడాతో గెలుపు
- మిల్లర్ సెంచరీ వృథా
- 19న భారత్‌తో టైటిల్‌కై ఢీ

కోల్‌కతా: వన్డే ప్రపంచకప్ సెమీస్‌లో దక్షిణాఫ్రికా జట్టుకు మరోసారి నిరాశ తప్పలేదు. ఇంతకు ముందు ఐసిసి నిబంధనలు, వర్షం, డిఆర్‌ఎస్‌లు తదితర కారణాలతో ఫైనల్‌కు చేరలేకపోయిన సఫారీ జట్టు ఈసారి ఫీల్డర్లు క్యాచ్‌లు జారవిడవడంతో ఫైనల్‌కు చేరలేకపోయిందని చెప్పుకోవచ్చు. మెగా టోర్నీ ఆరంభం నుంచి భారీస్కోర్లతో, దూకుడైన బ్యాటింగ్, నిప్పులు చెరిగే బౌలింగ్, కళ్లు చెదిరే ఫీల్డింగ్ విన్యాసాలతో ఆకట్టుకున్న సఫారీలు.. కీలకమైన నాకౌట్ దశలో తేలిపోయారు. తొలుత బ్యాటింగ్‌లో విఫలమైనా.. ఫీల్డర్లు ఏకంగా ఐదు క్యాచ్‌లు జారవిడవడం సఫారీలను నిండా ముంచింది. ఓ దశలో మ్యాచ్ ఉత్కంఠగా మార్చినా.. కంగారూలు పట్టు విడవకుండా ఆడి సఫారీలపై గెలిచారు. దీంతో ఐదుసార్లు టైటిల్ విజేత ఆస్ట్రేలియా జట్టు మరోసారి టైటిల్‌కు అడుగు దూరంలో నిలిచింది.

బౌలర్లకు సహకరించిన ఈడెన్ గార్డెన్స్‌లో జరిగిన రెండో సెమీస్‌లో ఆస్ట్రేలియా జట్టు మూడు వికెట్ల తేడాతో దక్షిణాఫ్రికాపై గెలిచింది. తొలిగా బ్యాటింగ్‌కు దిగిన దక్షిణాఫ్రికా జట్టు 49.4 ఓవర్లలో 212పరుగులకు ఆలౌటైంది. స్వల్ప లక్ష్యాన్ని ఛేదించేందుకు బ్యాటింగ్‌కు దిగిన ఆసీస్‌కు ఓపెనర్లు అదిరిపోయే ఆరంభాన్నిచ్చారు. డేవిడ్ వార్నర్ 18 బంతుల్లోనే ఒక బౌండరీ, నాలుగు సిక్సర్ల సాయంతో 29 పరుగులు చేశాడు. ట్రావిస్ హెడ్ కూడా రాణించడంతో ఆసీస్.. 6ఓవర్లలోనే 60 పరుగులు చేసింది. రబాడా వేసిన ఆరో ఓవర్లో వార్నర్ రెండు, హెడ్ ఒక సిక్సర్ బాదారు. పేసర్లు ప్రభావం చూపకపోవడంతో బవుమా ఏడో ఓవర్లోనే పార్ట్ టైమ్ స్పిన్నర్ మార్‌క్రమ్‌కు బంతినిచ్చాడు. మార్‌క్రమ్ తొలి బంతికే వార్నర్‌ను బౌల్డ్ చేయడంతో ఆసీస్ తొలి వికెట్ కోల్పోయింది. వార్నర్ స్థానంలో వచ్చిన మిచెల్ మార్ష్ పరుగుల ఖాతా



తెరవకుండానే రబాడా బౌలింగ్‌లో డస్సెన్ సూపర్బ్ క్యాచ్ పట్టడంతో ఔటయ్యాడు. గెరాల్డ్ కొయెట్జ్ వేసిన 12వ ఓవర్లో హ్యాట్రిక్ ఫోర్లు కొట్టిన హెడ్.. అర్ధ సెంచరీ పూర్తిచేసుకున్నాడు. కానీ హెడ్‌ను 15వ ఓవర్లో కేశవ్ మహారాజ్ బోల్తా కొట్టించాడు. ఆ ఓవర్లో తొలి బంతికే హెడ్ క్లీన్ బౌల్డ్ అయ్యాడు.

లబూషేన్ (31 బంతుల్లో 18, 2 ఫోర్లు)తో కలిసి నాలుగో వికెట్‌కు 45 పరుగులు జోడించాడు. కానీ షంసీ 22వ ఓవర్లో ఐదో బంతికి లబూషేన్‌ను వికెట్ల ముందు దొరకబుచ్చుకున్నాడు. షంసీ తన మరుసటి ఓవర్లోనే గ్లెన్ మ్యాక్స్‌వెల్ (1)ను కూడా బౌల్డ్ చేసి సఫారీలు మ్యాచ్ మీద పట్టుబిగించేలా చేశాడు. ఆఖర్లో మిచెల్ స్టార్క్ (38 బంతుల్లో 16 నాటౌట్, 2 ఫోర్లు), పాట్ కమిన్స్ (29 బంతుల్లో 14 నాటౌట్, 2 ఫోర్లు)లు విజయాన్ని ఖరారు చేశారు. సఫారీ ఫీల్డర్లు ఐదు క్యాచ్‌లు మిస్ చేడం గమనార్హం. తొలుత ఆసీస్ బౌలర్లు చెలరేగడంతో సఫారీ జట్టు 24పరుగులకే 4వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఆ దశలో మిల్లర్ (101) సెంచరీతో ఆదుకోగా క్లాసెన్ (47) రాణించాడు. వీరిద్దరూ 5వ వికెట్‌కు 95పరుగులు జతచేశారు. స్టార్క్, కమిన్స్‌కు మూడేసి, హేజిల్‌వుడ్, హెడ్‌కు రెండేసి వికెట్లు దక్కాయి. టీమిండియా రెండు పర్యాయాలు కప్ నెగ్గింది. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ హెడ్‌కు లభించింది.

స్కోర్‌బోర్డు..

దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్: డికాక్ (సి)కమిన్స్ (బి)హేజిల్‌వుడ్ 3, బవుమా (సి)ఇంగ్లిస్ (బి)స్టార్క్ 0, డుస్సెన్ (సి)స్టీవ్ స్మిత్ (బి)హేజిల్‌వుడ్ 6, మార్‌క్రమ్ (సి)వార్నర్ (బి)స్టార్క్ 10, క్లాసెన్ (బి)హెడ్ 47, మిల్లర్ (సి)హెడ్ (బి)కమిన్స్ 101, జెన్సన్ (ఎల్‌బి)హెడ్ 0, కొయిట్జ్ (సి)ఇంగ్లిస్ (బి)కమిన్స్ 19, మహరాజ్ (సి)స్మిత్ (బి)స్టార్క్ 4, రబడా (సి)మ్యాక్స్‌వెల్ (బి)కమిన్స్ 10, షాంసీ (నాటౌట్) 1, అదనం 11. (49.4ఓవర్లలో ఆలౌట్) 212పరుగులు. **వికెట్ల పతనం:** 1/1, 2/8, 3/22, 4/24, 5/119, 6/119, 7/172, 8/191, 9/203, 10/212 **బౌలింగ్:** స్టార్క్ 10-1-34-3, హేజిల్‌వుడ్ 8-3-12-2, కమిన్స్ 9.4-0-51-3, జంపా 7-0-55-0, మ్యాక్స్‌వెల్ 10-0-35-0, హెడ్ 5-0-21-2.

ఆస్ట్రేలియా ఇన్నింగ్స్: హెడ్ (బి)మహరాజ్ 62, వార్నర్ (బి)మార్‌క్రమ్ 29, మార్ష్ (సి)డుస్సెన్ (బి)రబడా 0, స్మిత్ (సి)డికాక్ (బి)కొయిట్జ్ 30, లబూషేన్ (ఎల్‌బి)షాంసీ 18, మ్యాక్స్‌వెల్ (బి)షాంసీ 1, ఇంగ్లిస్ (బి)కొయిట్జ్ 28, స్టార్క్ (నాటౌట్) 16, కమిన్స్ (నాటౌట్) 14, అదనం 17. (47.2ఓవర్లలో 7వికెట్ల నష్టానికి) 215పరుగులు. **వికెట్ల పతనం:** 1/60, 2/61, 3/106, 4/133, 5/137, 6/174, 7/193 **బౌలింగ్:** జెన్సన్ 4.2-0-35-0, రబడా 6-0-41-1, మార్‌క్రమ్ 8-1-23-1, కొయిట్జ్ 9-0-47-2, షాంసీ 10-0-42-2, మహరాజ్ 10-0-24-1

జాతీయ నమూనా రూపొందించాలి

పాఠశాలల్లో బాలికలు, మరుగుదొడ్ల నిష్పత్తిపై కేంద్రానికి సుప్రీం ఆదేశం

ప్రజాశక్తి–న్యూఢిల్లీ బ్యూరో

పాఠశాలల్లో బాలికలు, మరుగుదొడ్ల సంఖ్య నిష్పత్తికి సంబంధించి జాతీయ నమూనాను రూపొందించాలని కేంద్ర ప్రభుత్వాన్ని అత్యున్నత న్యాయస్థానం ఆదేశించింది. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డివై చంద్రచూడ్, న్యాయమూర్తులు జస్టిస్ జెబి పార్దివాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాతో కూడిన త్రిసభ్య ధర్మాసనం శానిటరీ న్యాప్‌కిన్‌ల పంపిణీకి అనుసరించాల్సిన పద్ధతుల విషయంలో ఏకరూపతను తీసుకురావాలని ప్రభుత్వాన్ని కోరింది.జాతీయ రుతుక్రమ పరిశుభ్రత విధానం–2023 ముసాయిదాను ఖరారు చేసే ముందు దేశంలోని ప్రభుత్వ–ఎయిడెడ్, రెసిడెన్షియల్ పాఠశాలల్లో విద్యార్థినులు, బాలికల మరుగుదొడ్ల సంఖ్య నిష్పత్తికి సంబంధించి జాతీయ నమూనాను రూపొందించాలని కేంద్రాన్ని సుప్రీంకోర్టు కోరింది. పాఠశాలల్లోని విద్యార్థినులకు తగినన్ని శానిటరీ నాప్‌కిన్‌లు అందుబాటులో ఉండేలా చూసేందుకు వివిధ రాష్ట్రాల్లో అనుసరిస్తున్న విధానాలను పరిగణనలోకి తీసుకోవాలని కేంద్రాన్ని కోరింది.

అమెరికా-రష్యా సంబంధాలు ఏ క్షణంలోనైనా తెగిపోవచ్చు : రష్యా

మాస్కో: ఇప్పటికే సంక్షోభంలో ఉన్న రష్యా – అమెరికా సంబంధాలు ఏ క్షణంలోనైనా పుటుక్కుమనిపోవచ్చని రష్యన్ విదేశాంగ మంత్రిత్వ శాఖ తెలిపింది. ఈ రెండు దేశాల మధ్య సంబంధాలు పునరుద్ధరించబడి 90 ఏళ్లు అయిన సందర్భంగా రష్యన్ విదేశాంగ శాఖ గురువారం ఈ మేరకు ఒక ప్రకటన విడుదలజేసింది. 'రష్యన్ ఫోబిక్ ' ను అమెరికా వీడనంతకాలం ఆ దేశంతో సంబంధాలు కష్టమే. సంబంధాలు తెగిపోతే దానికి బాధ్యత అమెరికానే. దాని బాధ్యతారాహిత్య వైఖరి, విద్వేషాలను రెచ్చగొట్టడం, రష్యాను వ్యూహాత్మకంగా దెబ్బతీసేందుకు కుట్రలు, కుతంత్రాలకు పాల్పడడం వల్లే ఈ పరిస్థితి ఏర్పడిందని పేర్కొంది. పశ్చిమాసియాలో ప్రస్తుత సంక్షోభానికి అమెరికన్ పాలకవర్గాలు, వాటి మిత్రులే కారణమని రష్యా అధ్యక్షుడు వ్లదిమిర్ పుతిన్ విమర్శించారు. ఆయన ఇటీవల ఒక కార్యక్రమంలో మాట్లాడుతూ, పశ్చిమాసియా సంక్షోభం, ప్రాంతీయ ఘర్షణల వెనక అమెరికా, దాని మిత్రపక్షాల హస్తం ఉందన్నారు. అమెరికన్ పాలకవర్గాలు అమెరికా ప్రపంచాధిపత్యం కొనసాగాలని కోరుకుంటాయి. అందుకు నిత్యం ఎక్కడో ఒక చోట ఘర్షణలు, యుద్ధాలు జరిగేలా చూసుకుంటాయి. అవి లేకుంటే వాటికి లాభాలు రావు. వారి ప్రయోజనాలు నెరవేరవు. ఈ యుద్ధాలు, ఘర్షణల దుష్పరిణామాలు ప్రపంచ ప్రజలు అనుభవించాల్సి వస్తోంది. విద్వేషాలు రెచ్చగొట్టడం, ప్రపంచ ప్రజల మధ్య చీలిక తేవడం వంటి చర్యలు ప్రపంచాన్ని అనిశ్చితిలోకి నెడతాయి. ప్రపంచ అస్థిరత ఎంతగా పెరిగితే అమెరికన్ పాలకవర్గాలు, దాని మిత్రులకు అంతగా లాభం. అందుకే అవి వీటిని ప్రేరేపిస్తుంటాయి. అయితే, వీరి పెత్తనం ఎంతో కాలం సాగదు, ఇప్పటికే అమెరికా ఆధిపత్యానికి ప్రతిఘటన పెరుగుతోంది అని పుతిన్ పేర్కొన్నారు.

కేంద్రానికి ఆఖరి అవకాశం

ఆన్‌లైన్‌లో ఔషధాల అమ్మకానికి విధానాల రూపకల్పనపై ఢిల్లీ హైకోర్టు

న్యూఢిల్లీ : ఆన్‌లైన్‌లో ఔషధాల అమ్మకాలకు సంబంధించి విధానాలు రూపొందించడానికి కేంద్ర ప్రభుత్వానికి ఢిల్లీ హైకోర్టు ఎనిమిది వారాల సమయం ఇచ్చింది. ఈ పిటీషన్ ఐదేళ్లకు పైగా కొనసాగుతోందని, కాబట్టి ఇదే అఖరి అవకాశమని హైకోర్టు గురువారం స్పష్టం చేసింది. అలాగే, నిర్ణీత వ్యవధిలోగా పాలసీని రూపొందించకపోతే, ఈ అంశాన్ని (ఆన్‌లైన్‌లో ఔషధాల అమ్మకాలకు సంబంధించి విధానాలు రూపొందించే) నిర్వహిస్తున్న ప్రధాన కార్యదర్శి తదుపరి విచారణలో కోర్టుకు వ్యక్తిగతంగా హాజరుకావాలని ఆదేశించింది. తదుపరి విచారణను వచ్చే ఏడాది మార్చి 4కు వాయిదా వేసింది. ఇప్పటికే ఈ పిటీషన్ విచారణ ఐదేళ్లకు పైగా కొనసాగుతోంది, కాబట్టి విధానాన్ని రూపొందించడానికి కేంద్ర ప్రభుత్వానికి తగినంత వ్యవధి లభించింది కాబట్టి కేంద్రానికి చివరి అవకాశంగా ఎనిమిదివారాల సమయం ఇస్తున్నాం' అని గురువారం ఉత్తర్వుల్లో ఢిల్లీ హైకోర్టు స్పష్టం చేసింది. ఈ ఉత్తర్వులను తాత్కాలిక సిజె జస్టిస్ మన్మోహన్, జస్టిస్ మిని పుష్కర్ణతో కూడిన ధర్మాసనం జారీ చేసింది.

టెస్ట్‌లకు మసూద్, టి20లకు షాహిన్

పాకిస్తాన్ జట్టు కెప్టెన్లను ప్రకటించిన బోర్డు

లాహోర్: వన్డే ప్రపంచకప్‌లో పాకిస్తాన్ జట్టు లీగ్ దశలోనే నిష్క్రమించడంతో కెప్టెన్సీకి బాబర్ గుడ్‌బై చెప్పిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో పాకిస్తాన్ క్రికెట్‌బోర్డు(పిసిబి) గురువారం ఓ ప్రకటనలో టెస్టు, టి20 జట్లకు కెప్టెన్లను వెల్లడించింది. టెస్ట్ జట్టుకు షాన్ మసూద్, టి20 జట్టుకు షాహిన్ అఫ్రిదిలను కెప్టెన్లుగా ప్రకటించింది. 2023–25 ఐసిసి ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్ ముగిసేవరకు మసూద్ కెప్టెన్‌గా నియమిస్తున్నట్లు పిసిబి పేర్కొంది. టెస్ట్ కెప్టెన్‌గా ఎంపికైన షాన్ మసూద్ మాట్లాడుతూ.. ఈ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తానని, క్రికెట్‌బోర్డుకు, వాటాదారులకు కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు వెల్లడించింది. డిసెంబర్ 14నుంచి ఆస్ట్రేలియాతో మూడు టెస్ట్ మ్యాచ్‌ల సిరీస్ ప్రారంభం కానుంది. ఇక జనవరి 12నుంచి న్యూజిలాండ్‌తో ఐదు టి20 మ్యాచ్‌ల సిరీస్ షాహిన్ అఫ్రిది సారథ్యంలో పాకిస్తాన్ జట్టు తలపడనుంది.




షాన్ మసూద్



షాహిన్ అఫ్రిది

పోరాడి ఓడిన ప్రణయ్

జపాన్ బ్యాడ్మింటన్ టోర్నీలో ముగిసిన భారత్ పోరు



టోక్యో: జపాన్ మాస్టర్స్ సూపర్–500 బ్యాడ్మింటన్ టోర్నీలో భారత షట్లర్ల పోరాటం ముగిసింది. రెండోరౌండ్‌కు చేరిన ఏకైక షట్లర్ హెచ్‌ఎస్ ప్రణయ్ రాయ్ రెండోరౌండ్‌లో ఓటమిపాలయ్యాడు. గురువారం జరిగిన పురుషుల సింగిల్స్ రెండోరౌండ్ పోటీలో 7వ సీడ్ ప్రణయ్ 21–19, 16–21, 19–21తో ఛౌ–టిన్–చెన్(చైనీస్ తైపీ) చేతిలో పోరాడి ఓడాడు. ఈ మ్యాచ్ సుమారు గంటా 13నిమిషాలసేపు సాగింది. హోరాహోరీగా సాగిన ఈ పోరులో తొలి గేమ్‌ను నెగ్గిన ప్రణయ్.. రెండో గేమ్‌ను పోరాడి ఓడాడు. నిర్ణయాత్మక మూడో గేమ్‌లో ఉత్కంఠభరితంగా సాగినా.. చివర్లో వరుసగా రెండో పాయింట్లు సాధించి ఛౌ–టిన్ మ్యాచ్‌ను ముగించాడు.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68